

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 235

బుధవారం 10-5-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**'బెస్ట్' మెస్సీ, షెల్లీ ఫ్రేజర్**

లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డుల్లో ఉత్తమ క్రీడాకారులుగా ఎంపిక - 12లో



**'కలాసీ కూతురు ఇంజనీర్'**

'పది'లో ప్రభుత్వ స్కూళ్ల టాపర్‌గా నిలిచిన హేమశ్రీపై కథనం - 11లో



## నదిలో పడిన బస్సు.. 24 మంది మృతి

మధ్యప్రదేశ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి నదిలో పడింది. ఈ ప్రమాదంలో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. 40 మందికిపైగా గాయపడ్డారు.

- వివరాలు 6లో

## రష్యాపై 'రియల్ వార్'



స్వప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి పశ్చిమ దేశాలు రష్యాపై అసలైన యుద్ధం ప్రారంభించాయని దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. మాస్కోలోని రెడ్ స్క్వేర్‌లో నిర్వహించిన విక్టరీ డే పరేడ్‌లో ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నాగరికత నేడు మరోసారి ఒక నిర్ణయాత్మకమైన కీలక మలుపులో ఉందని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌లో సంఘర్షణకు పశ్చిమ దేశాల స్వార్థపూరిత ఆకాంక్షలు, అహంకారమే కారణమన్నారు.

- వివరాలు 6లో

## గెహ్లోత్ వర్సెస్ పైలట్



రాజస్థాన్ రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీని కాకుండా బీజేపీ నేత వసుంధర రాజెను తన నాయకురాలిగా భావిస్తున్నారంటూ అసంతృప్త నేత సచిన్ పైలట్ విమర్శించారు.

- వివరాలు 6లో

## ప్రభుత్వ ఉపాధ్యాయులకు సర్కార్ శుభవార్త

- హైస్కూల్ ప్లస్‌లో బోధనకు నియామకాలు.. 1,752 పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం
- సబ్జెక్టు టీచర్లుగా 7 వేల మంది ఎస్జీటీలకు పదోన్నతి.. సీనియారిటీ, ప్రతిభ ఆధారంగా ఎంపిక
- ఇంటర్ స్థాయి బోధనకు ఎంపికైన వారికి అదనపు ఇంక్రిమెంట్.. ఈ నెలాఖరుకు నియామక ప్రక్రియ పూర్తి



- వివరాలు 10లో

## న్యూస్‌రీల్

### హజ్ యాత్రికులకు ఏపీ ప్రభుత్వ సహకారం



కేంద్ర ప్రభుత్వ నిబంధనల వల్ల ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారిపై పడే అధిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని మైనారిటీ శాఖ మంత్రి అంజాద్ బాషా చెప్పారు. హజ్ యాత్రికులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు.

వివరాలు 14లో ▸

### గంగమ్మజాతర మొదలైందహో..



భక్తకోటి కోర్కెలు తీర్చే కల్పవల్లి, తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర బుధవారం నుంచి ఈనెల 16 వరకు అత్యంత వైభవంగా జరగనుంది. కైకాల వంశస్తులు మంగళవారం అర్ధరాత్రి తర్వాత వేసిన చాటింపుతో జాతర ప్రారంభమైంది.

వివరాలు 5లో ▸



# సమస్యలు తీర్చే.. సేవకులం

## 'జగనన్నకు చెబుదాం' మిగతా కార్యక్రమాల కంటే భిన్నం: సీఎం జగన్

### గట్టిగా ప్రయత్నించినా సమస్య పరిష్కారం కాకుంటే కాల్ 1902

- అర్జీదారుడికి సంతోషాన్ని కలిగించి, చిరునవ్వులు విరబూసేలా నాణ్యతగా పరిష్కారం
- టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ కొడితే నేరుగా నా కార్యాలయానికే వస్తుంది
- నాతో సహా వలంటీర్ల దాకా అంతా ప్రజా సేవకులమే
- కలసికట్టుగా ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వులు చూడాలనే తపనతో పనిచేద్దాం
- 1902 టోల్‌ఫ్రీ నంబర్, వెబ్‌సైట్‌ను ప్రారంభించిన సీఎం



'జగనన్నకు చెబుదాం' ప్రారంభ కార్యక్రమంలో సీఎం జగన్. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, అధికారులు

**సాక్షి, అమరావతి:** సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో ఎదురయ్యే సమస్యలకు మరింత మెరుగైన, నాణ్యమైన పరిష్కారాలను చూపాలనే తపనతో 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమాన్ని తెచ్చినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రిగా తానున్నది అధికారాన్ని చలాయించడానికి కాదని, తన దగ్గర నుంచి సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల వరకు అంతా ప్రజా సేవకులమేనని స్పష్టం చేశారు. జగనన్నకు చెబుదాం 1902 టోల్‌ఫ్రీ నంబర్, వెబ్‌సైట్‌ను

మిగతా 2వ పేజీలో ▶

> "అర్హత ఉండి కూడా ఏ కారణం చేతైనా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందకపోయినా, న్యాయం మీ వైపున ఉన్నా న్యాయం జరగని పక్షంలో, ఇప్పటికే ప్రయత్నించినా సత్ఫలితాన్ని ఇవ్వని పరిస్థితుల్లో ఇక నేరుగా మీ జగనన్నకు చెబుదాం టోల్ ఫ్రీ నంబరు 1902కి ఫోన్ కొట్టండి. నేరుగా నా కార్యాలయానికే (సీఎంవో) ఫోన్ వస్తుంది. సమస్యలకు ఈ స్థాయిలో పరిష్కారం చూపే దిశగా గొప్ప ఆలోచనతో అడుగులు వేస్తున్నాం.
>
> మీ సమస్యను నా సమస్యగానే భావించి ట్రాక్ చేస్తాం. నేరుగా సీఎంవో దీన్ని ట్రాక్ చేస్తుంది. ఫిర్యాదు పరిష్కారంపై ఎస్ఎంఎస్, ఐవీఆర్ఎస్ ద్వారా ఎప్పటికప్పుడు మెసేజ్‌లు, సందేశాలు వస్తాయి. మీ సమస్య పరిష్కారం ఏ దశలో ఉందో మీరు నేరుగా వెబ్‌సైట్లో కూడా చూడవచ్చు."
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ అరెస్టు

**వాహనం అద్దాలు బద్దలు కొట్టి, కాలర్ పట్టుకొని లాక్కెళ్లి..**

- ఇస్లామాబాద్ హైకోర్టు ఎదుట అదుపులోకి తీసుకున్న పారామిలటరీ రేంజర్లు
- సొంత ట్రస్టుకు భూమి బదిలీ కేసులో అరెస్టు చేసినట్లు అధికారుల ప్రకటన
- కస్టడీలో ఇమ్రాన్‌ను హింసిస్తున్నారని పీటీఐ నేతల ఆరోపణలు

6లో



ఇమ్రాన్ వాహనం గ్లాస్ డోర్‌ను పగులగొట్టి అతన్ని అదుపులోకి తీసుకుంటున్న పారామిలటరీ రేంజర్లు

## ఇక నుంచి మీ కలే నా కల

'ఇకపై మీ కలే నా కల. మీ సంకల్పాన్ని నాదిగా భావిస్తున్నా. మన ఉమ్మడి లక్ష్య సాధనను ప్రపంచంలో మరెవరూ ఆపలేరు. దేశంలో కర్ణాటకను నంబర్‌వన్ రాష్ట్రంగా మార్చే యజ్ఞంలో మీ ఆశీస్సులు నాకు కావాలి' అంటూ ప్రధాని మోదీ ట్విట్టర్‌లో ఒక వీడియోను పోస్ట్ చేశారు.



6లో

**నేడే కర్ణాటకలో పోలింగ్**

## పేదల ఇళ్ల కోసం మరో 268 ఎకరాలు

### అమరావతిలో కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం

ఏపీ సీఆర్‌డీఏ పరిధిలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకానికి ప్రభుత్వం మరో 268 ఎకరాలను కేటాయించింది. ఇందులో బోరుపాలెం, పిచికలపాలెం, అనంతవరం గ్రామాల పరిధిలో 168 ఎకరాలను ఎన్టీఆర్ జిల్లాకు చెందిన లబ్ధిదారుల కోసం కేటాయించగా.. గుంటూరు జిల్లాకు చెందిన లబ్ధిదారుల కోసం నెక్కల్లులో మరో 100 ఎకరాలను కేటాయించింది.

- వివరాలు 3లో

# బ్యాంకింగ్‌లో ఏపీ కింగ్

## మంచి ఫలితాలు నమోదు చేస్తున్న రాష్ట్ర బ్యాంకింగ్ రంగం

- ఆర్‌బీఐ నిబంధనలకంటే మెరుగ్గా పనితీరు
- మొత్తం రుణాల్లో వ్యవసాయ రుణాలు 40.97 శాతం
- చిన్న సన్నకారు రైతులకు 27.54 శాతం రుణాలు
- మహిళలకు 23.52 శాతం, బలహీనవర్గాలకు 26.31 శాతం
- ప్రాధాన్యతారంగాలకు 63.64 శాతం రుణాలిచ్చిన బ్యాంకులు
- నాలుగేళ్లుగా రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న బ్యాంకింగ్ సేవలు
- రూ.3.12 లక్షల కోట్ల నుంచి రూ.4.43 లక్షల కోట్లకు చేరిన డిపాజిట్లు
- రుణాలు రూ.3.97 లక్షల కోట్ల నుంచి రూ.6.57 లక్షల కోట్లకు చేరిక

**సాక్షి, అమరావతి:** ఒక రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటును బ్యాంకింగ్ గణాంకాలు ప్రస్ఫుటం చేస్తాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బాగుంటే బ్యాంకింగ్ రంగం వృద్ధి చెందుతుంది. బ్యాంకు డిపాజిట్లు, రుణాలు, ఇతరత్రా బ్యాంకింగ్ కార్యకలాపాలు పెరుగుతాయి. శాఖలూ పెరుగుతాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో బ్యాంకింగ్ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. గడిచిన నాలుగేళ్లలో రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు శర వేగంగా సాగుతున్న విషయాన్ని రాష్ట్ర బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) 2022 నివేదిక వెల్లడించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలను పటిష్టంగా అమలు చేస్తూ వ్యవసాయ, పారిశ్రామిక రుణాల నుంచి మహిళా రుణాల వరకు, డిపాజిట్ల నుంచి బ్యాంకు సేవల విస్తరణ వరకు రాష్ట్రం అన్ని రంగాల్లో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. గత నాలుగేళ్లలో రాష్ట్రంలోని అన్ని బ్యాంకుల డిపాజిట్లలో 41.96 శాతం వృద్ధి నమోదైతే, రుణా ల్లో 65.47 శాతం వృద్ధి నమోదయ్యింది. 2019 మార్చినాటికి బ్యాంకుల్లో మొత్తం డిపాజిట్ల విలు వ రూ.3,12,642 కోట్లుగా ఉంటే 2022 డిసెంబర్‌కి రూ.4,43,854 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో మొత్తం రుణాలు రూ.3,97,350 కోట్ల నుంచి రూ.6,57,497 కోట్లకు చేరాయి. బ్యాంకుల శాఖలు కూడా 7,379 నుంచి 7,769కి చేరాయి. కోవిడ్ సమయంలో కూడా రాష్ట్రంలో బ్యాంకింగ్ లావాదేవీల్లో వృద్ధి నమోదు కావడం రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు కుంటుపడకుండా ప్రభు త్వం తీసుకున్న చర్యలకు నిదర్శనమని ఆర్థికవేత్తలు ప్రశంసిస్తున్నారు. సాధారణంగా దేశవ్యాప్తంగా క్రెడిట్ డిపాజిట్ రేషియో (సీడీ రేషియో) 60%గా ఉండాలి. కానీ అది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 148.13% ఉందంటే ఇక్కడ ఏ స్థాయిలో ఆర్థిక కా ర్యకలాపాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చని బ్యాంకర్లు పే ర్కొంటున్నారు. బ్యాంకింగ్ కార్యకలాపాల పెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వ చర్యలు, ముఖ్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చూపుతున్న శ్రద్ధ ప్రధానమైనవని ఎస్ఎల్‌బీసీ అధికారులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహి స్తూ ప్రాధాన్యత రంగాలకు, బలహీన వర్గాలు, మహిళలకు అధికరుణాలను ఇచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నారని, అందువల్లే ఇంత పె ద్ద మొత్తంలో అన్ని రంగాలకు రుణా లు మంజూరవుతున్నాయని బ్యాంకుల అధికారులు వివరించారు.

### ఆర్‌బీఐ నిబంధనలను మించి రుణాలు

ఆర్‌బీఐ రైతులు, బడుగు బలహీన వర్గాలకు రుణాలు అందించాలన్న లక్ష్యంతో కీలక రంగాలకు కనీస రుణ పరిమితిని లక్ష్యాలను నిర్దేశిస్తుంది. మొత్తం బ్యాంకుల రుణాల్లో ప్రాధాన్యతా రంగాలు అంటే వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, ఎగుమతులు ఇలా కీలక రంగాలకు కనీసం 40 శాతం రుణాలు ఇవ్వాలి. కానీ మన రాష్ట్రంలోని బ్యాంకులు ప్రాధాన్యతా రంగాలకు ఏకంగా 63.64 శాతం రుణాలు మంజూరు చేశాయి. 2019 మార్చిలో ప్రాధాన్యతా రంగాలకు మొత్తం రుణాల విలువ రూ.2,40,220 కోట్లు ఉండగా 2022 డిసెంబర్ 31 నాటికి రూ.3,70,382 కోట్లకు చేరాయి. అలాగే మొత్తం రుణాల్లో వ్యవసాయ రుణాల వాటా కనీసం 18 శాతంగా ఉండాలని ఆర్‌బీఐ నిబంధన విధిస్తే మన రాష్ట్రంలో 40.97 శాతం మంజూరు చేయడం విశేషం. 2019 మార్చి నాటికి రాష్ట్రంలో వ్యవసాయ రుణాల విలువ రూ. 1,49,264 కోట్లుగా ఉంటే అది 2022 డిసెంబర్ 31కి రూ. 2,38,408 కోట్లకు చేరింది. చిన్న, సన్నకారు రైతులకు కనీసం 9.5 శాతం రుణాలు ఇవ్వాల్సి ఉండగా 27.54 శాతం, బలహీన వర్గాలకు కనీసం 11.5 శాతం రుణాలు ఇవ్వాల్సి ఉండగా 26.31 శాతం, మహిళలకు కనీసం 5 శాతం రుణాలు ఇవ్వాల్సి ఉండగా 23.52 శాతం, మైక్రో (సూక్ష్మ) సంస్థలకు కనీసం 7.5 శాతం రుణాలు ఇవ్వాల్సి ఉండగా 7.55 శాతం రుణాలను రాష్ట్రంలోని బ్యాంకులు ఇచ్చాయి.

## నేటి నుంచి వడగాడ్పులు

రాష్ట్రవ్యాప్తంగా వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో ఎండకు తాళలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం నుంచి వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. మరోవైపు బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం.. నేడు తుపానుగా బలపడనుంది. రాష్ట్రంపై దీని ప్రభావం ఉండదని ఐఎండీ తెలిపింది.



- వివరాలు 14లో

## గంగపుత్రులకు 'భరోసా'

- భారీగా పెరిగిన అర్హుల జాబితా
- వైఎస్సార్ మత్స్యకార భరోసా పంపిణీకి రెడీ
- గతేడాది 1,05,161 మందికి రూ.105.16 కోట్ల లబ్ధి
- ఈ ఏడాది 1,23,519 మందికి రూ.123.52 కోట్ల సాయం.. 16న బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జమ చేయనున్న సీఎం జగన్

10లో

## ఎస్సీ గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

- ఐదో తరగతిలో జనవై, ఇంటర్‌లో సూర్య నేత్రేలకు టాప్ ర్యాంకులు
- ఒక్కో సీటుకు ముగ్గురు విద్యార్థుల పోటీ
- సీఎం జగన్ కృషితోనే గురుకులాల్లో ఉత్తమ ఫలితాలు
- మంత్రి మేరుగు నాగార్జున

3లో

## హైదరాబాద్‌లో 'ఉగ్ర కుట్ర' భగ్నం

- హైదరాబాద్‌లో ఉగ్రవాదుల కుట్రలను మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్, తెలంగాణ నిఘా వర్గాలు భగ్నం చేశాయి. ఐదుగురు హిజ్బు ఉత్ తహరీర్ ఉగ్రవాద సంస్థ అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. కత్తులు, గొడ్డళ్లు, ఎయిర్‌గన్‌లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఓ మెడికల్ కాలేజీ విభాగాధిపతి, డెంటిస్ట్, క్లౌడ్ సర్వీస్ ఇంజనీర్ ఉన్నారు. వీరు హైదరాబాద్‌లో డ్రోన్లతో రెక్కీ నిర్వహించినట్లు సమాచారం.

10లో

# అవకాశాలు గరిష్టం.. వినియోగం కనిష్టం

- దేశంలో 1,48,701 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తికి అవకాశం
- 25 మెగావాట్లకంటే ఎక్కువ ఉత్పత్తయ్యే ప్రాంతాల సామర్థ్యం 1,45,320 మెగావాట్లు
- ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్నది 46,512 మెగావాట్లు
- పోలవరం సహా నిర్మాణంలో ఉన్న జల విద్యుత్ కేంద్రాల సామర్థ్యం 9,057.5 మెగావాట్లు
- నిర్మాణం ఆగిపోయిన కేంద్రాల సామర్థ్యం 2,216 మెగావాట్లు
- ఇప్పటికీ 90,915.5 మెగావాట్ల ఉత్పత్తికి అవకాశం
- అయినా వినియోగించుకోలేని వైనం

**సాక్షి, అమరావతి:** దేశంలో జలవిద్యుత్ ఉత్పత్తికి అపారమైన అవకాశాలు ఉన్నాయి. ఇందులో మూడో వంతు మాత్రమే ఉత్పత్తి చేయగలుగుతున్నాం. ఉన్న అవకాశాలనూ వినియోగించుకోలేకపోతున్నాం. స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో జలవిద్యుదుత్పత్తి కేంద్రాల స్థాపిత సామర్థ్యం 508 మెగావాట్లు. ప్రస్తుతం నిర్మాణం పూర్తయి, విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న కేంద్రాల సామర్థ్యం 46,512 మెగావాట్లు. అంటే.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 76 ఏళ్లలో 46,004 మెగావాట్ల సామర్థ్యం కలిగిన జల విద్యుత్ కేంద్రాలను మాత్రమే నిర్మించాం. దేశంలోని హిమాలయ, ద్వీపకల్ప నదీ పరివాహక ప్రాంతాలలో 1,48,701 మెగావాట్ల జల విద్యుదుత్పత్తికి అవకాశం ఉంది. ఇందుకు అనువైన ప్రాంతాలను 1951లో సెంట్రల్ వాటర్ అండ్ పవర్ కమిషన్ (సీడబ్ల్యూపీసీ), 1974లో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) గుర్తించాయి.

### 90 వేల మెగావాట్లకుపైగా ఉత్పత్తికి అవకాశం

దేశంలో నైరుతి, ఈశాన్య రుతుపవనాల వల్ల సగటున 1298.6 మిల్లీ మీటర్ల వర్షం కురుస్తుంది. దీని వల్ల హిమాలయ, ద్వీపకల్ప నదుల ద్వారా 1,37,002.8 టీఎంసీల నీరు లభిస్తుందని సీడబ్ల్యూసీ అంచనా వేసింది. ఈ నదులపై 9,103.34 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 5,745 డ్యామ్‌లను దేశవ్యాప్తంగా నిర్మించి.. 24,367.43 టీఎంసీలను సాగు, తాగు నీటి కోసం వాడుకుంటున్నారు. దేశంలోని నదులపై 25 మెగావాట్ల కంటే అధికంగా విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉన్న ప్రాంతాలలో ఉత్పత్తి కేంద్రాలను నిర్మిస్తే 1,45,320 మెగావాట్లు లభిస్తుందని సీడబ్ల్యూసీ తేల్చింది. కానీ.. ఇప్పటివరకూ 46,512 మెగావాట్ల సామర్థ్యంతో మాత్రమే జల విద్యుదుత్పత్తి కేంద్రాలను కేంద్రం, రాష్ట్రాలు నిర్మించాయి. పోలవరం ప్రాజెక్టులో అంతర్భాగంగా 960 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న కేంద్రం సహా ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న కేంద్రాల స్థాపిత సామర్థ్యం 9,057.5 మెగావాట్లు. పర్యావరణ, భూసేకరణ తదితర సమస్యల కారణంగా నిర్మాణ దశలో ఆగిపోయిన కేంద్రాల స్థాపిత సామర్థ్యం 2,216 మెగావాట్లు. వీటిని పరిగణలోకి తీసుకుంటే.. ఇప్పటికీ 90,915.5 మెగావాట్ల ఉత్పత్తికి ఉన్న అవకాశాలను వినియోగించుకోవడంలేదని స్పష్టమవుతోంది.

### హిమాలయ రాష్ట్రాల్లో అపార అవకాశాలు

హిమాలయ పర్వతాల నుంచి ప్రవహించే గంగా, బ్రహ్మపుత్ర, సింధూ తదితర నదుల్లో ఏడాది పొడవునా ప్రవాహం ఉంటుంది. ఆ నదీ పరివాహక ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితుల కారణంగా వాటి పరిధిలోని రాష్ట్రాలలో జల విద్యుదుత్పత్తికి అత్యధిక అవకాశాలు ఉన్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో అత్యధికంగా 18,470 మెగావాట్లు, ఉత్తరాఖండ్‌లో 17,998, జమ్మూ కశ్మీర్‌లో 11,567 మెగావాట్ల జల విద్యుదుత్పత్తికి అవకాశాలు ఉన్నాయి. ద్వీపకల్ప నదీ పరివాహక ప్రాంతాలైన కర్ణాటకలో 6,459, కేరళలో 3,378, ఆంధ్రప్రదేశ్‌లో 3,261, తెలంగాణలో 1,099 మెగావాట్లు ఉత్పత్తి చేయొచ్చు. ప్రస్తుతం పూర్తయిన కేంద్రాల ద్వారా హిమాచల్‌ప్రదేశ్ అత్యధికంగా 9,920 మెగావాట్లు ఉత్పత్తి చేస్తూ జల విద్యుదుత్పత్తిలో ప్రథమ స్థానంలో ఉంది. 3,855.4 మెగావాట్లతో ఉత్తరాఖండ్ ద్వితీయ స్థానంలో, 3,644.2 మెగావాట్లతో కర్ణాటక మూడో స్థానంలో, 3,360 మెగావాట్లతో జమ్మూ కశ్మీర్ నాలుగో స్థానంలో ఉన్నాయి. 1,610 మెగావాట్లతో ఆంధ్రప్రదేశ్ 11వ స్థానంలో నిలిచింది.

## క్లుప్తంగా...

### శ్రీలక్ష్మీ మహా యజ్ఞానికి సీఎం జగన్‌కు ఆహ్వానం

- 12వ తేదీ నుంచి విజయవాడలో నిర్వహణ
- ఈనెల 25 నుంచి శ్రీశైలంలో మహాకుంభాభిషేక మహోత్సవం
- ఆహ్వానించిన మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



సీఎం జగన్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు

సాక్షి, అమరావతి/శ్రీశైలం టెంపుల్: విజయవాడ, శ్రీశైలంలో నిర్వహించనున్న శ్రీలక్ష్మీ మహా యజ్ఞం, మహాకుంభాభిషేక మహోత్సవాలకు సీఎం వైఎస్ జగన్‌ని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, శ్రీశైలం దేవస్థానం చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈవో లవన్న, వేదపండితులు ఆహ్వానించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం సీఎం జగన్‌ను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందించి సత్కరించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17 వరకు ప్రభుత్వం–దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో అష్టోత్తర శతకుండాత్మక(108) చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం నిర్వహించనున్నారు. శ్రీశైలంలో ఈ నెల 25 నుంచి 31 వరకు మహారుద్ర శతచండీ వేదస్వాహాకార పూర్వక మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నారు.

### సాధారణ భక్తులకూ యజ్ఞంలో భాగస్వామ్యం

'విజయవాడ' మహా యజ్ఞంపై విస్తృత ప్రచారం చేయాలని దేవదాయ శాఖ ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధితో పాటు ప్రజలందరూ శాంతి, సౌభాగ్యాలతో సంతోషంగా జీవించేందుకు గాను దేవదాయ శాఖ ఈ నెల 12 నుంచి విజయవాడలో నిర్వహించనున్న అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞంలో సాధారణ భక్తులకు కూడా భాగస్వామ్యం కల్పించనున్నారు. యాగశాలలోకి భక్తులకు అనుమతి ఉండదు కానీ.. యాగశాల చుట్టూ ఉండి ప్రత్యక్షంగా తిలకించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఈ మహా యజ్ఞం గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని దేవదాయ శాఖ నిర్ణయించింది. కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌ల ద్వారా ప్రచారం చేయాలని అన్ని ఆలయాల ఈవోలకు దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాలు జారీ చేశారు.

### కృష్ణబాబు, ద్వారకా తిరుమలరావుకు ఊరట

- జైలు శిక్ష, జరిమానా తీర్పు అమలు నిలుపుదల
- ధర్మాసనం ఉత్తర్వులు



సాక్షి, అమరావతి : కోర్టు ధిక్కార కేసులో ఐఏఎస్ అధికారి, ప్రస్తుత వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఐపీఎస్ అధికారి ద్వారకా తిరుమలరావు, మరికొందరు ఆర్టీసీ అధికారులకు హైకోర్టు ధర్మాసనం ఊరటనిచ్చింది. వీరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలును నిలిపివేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణ ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా తమ సర్వీసును క్రమబద్ధీకరించడం లేదంటూ ఫీల్డ్‌మెన్‌గా పనిచేస్తున్న సురేంద్ర తదితరులు కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు.. అప్పటి రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, తిరుపతి ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ టి.చంగల్ రెడ్డి, ఆర్టీసీ చీఫ్ ఇంజనీర్ యూఎస్ శ్రీనివాస్, నెల్లూరు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.కోటేశ్వరరావుకు నెల రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ కృష్ణబాబు, ద్వారకా తిరుమలరావుతో పాటు మిగిలిన అధికారులు ధర్మాసనం ముందు వేర్వేరుగా అప్పీళ్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ శేషసాయి ధర్మాసనం విచారణ జరిపింది. అధికారుల తరఫు న్యాయవాదులు చింతల సుమన్, సాల్మన్ రాజు వాదనలు వినిపిస్తూ.. జూనియర్ల సర్వీసును క్రమబద్ధీకరించారన్న పిటిషనర్ల వాదన సరికాదన్నారు. జూనియర్లు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసిందని తెలిపారు. ఈ విషయాలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి విధించిన జైలు శిక్ష, జరిమానా తీర్పు అమలును నిలిపివేయాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు.

# అప్పట్లో 'కొనుగోళ్లు' కతలెన్నో!

- టీడీపీ పాలనలో ధాన్యం కొనుగోళ్లు అంతా రికార్డుల్లోనే..
- మిల్లర్లతో కుమ్మక్కై అడ్డగోలుగా దోపిడి
- ఉమ్మడి 'తూర్పు'లో కొనుగోలు చేసింది 2–3 లక్షల మెట్రిక్ టన్నులే
- 90 శాతం రికార్డులకే పరిమితం
- తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి దొడ్డిదారిన కొనుగోళ్లు
- స్థానికంగా కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో చూపి దోపిడీ
- కానీ, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుకు కావల్సినవన్నీ అమలు
- ఆర్బీకేల ఏర్పాటు, ఈ–క్రాప్ నమోదు, కనీస మద్దతు ధర, రైతు వద్దకే వెళ్లి నేరుగా కొనుగోళ్లు ఇలా అన్నీ..
- సేకరించిన ధాన్యానికి సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ
- రవాణా, హమాలీల ఛార్జీలు కూడా చెల్లిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం




2015లో ధాన్యం కొనుగోలు అక్రమాలపై నాడు సాక్షిలో వచ్చిన కథనం (ఫైల్ ఫోటో)

సాక్షి అమలాపురం: తాము అధికారంలో ఉన్నప్పుడు రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లను గాలికొదిలేసిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు నీతులు వల్లిస్తుండడంపై అన్నదాతలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో రైతులకు కావల్సిన కనీస అవసరాలేవీ అమలులో లేవు. రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకే)గానీ, ఈ–క్రాప్ విధానం కానీ, మద్దతు ధర కానీ వీటి గురించి చంద్రబాబు కనీస ఆలోచన కూడా చేయలేదు. ఇవేకాదు.. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడం అన్న ఊసు కూడా ఎక్కడాలేదు. పైగా.. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం తీసుకొచ్చి స్థానిక రైతుల పేరు మీద చూపించి అడ్డగోలుగా దోపిడీ చేశారు. మిల్లులు అధికంగా ఉన్నచోట ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఈ దోపిడీ తతంగాన్ని నడిపారు. కానీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెపల్లెలో ఆర్బీకేలను ఏర్పాటుచేసి రైతులకు కావల్సిన అన్ని సదుపాయాలు అక్కడ నుంచే కల్పించడం, ఈ–క్రాప్ విధానం ప్రవేశపెట్టడం, పంటలకు కనీస మద్దతు ధర కల్పించి రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయడం చేస్తుంటే అన్యాయం, ఘోరం జరిగిపోయిందని టీడీపీ వెర్రెక్కిపోతూ గుండెలు బాదుకుంటోంది. నిజానికి.. చంద్రబాబు హయాంలో కొనుగోళ్ల తీరుతెన్నులు ఎలా ఉండేవంటే..

### టీడీపీ హయాంలో ఇలా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2014 నుంచి 2019 వరకు వరి ధాన్యం కొనుగోళ్లు తీసుకుంటే రైతులు ఎంతో నష్టపోయారు. ఉదాహరణకు..

- 2015లో ఖరీఫ్ దిగుబడి 12 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, నాటి ప్రభుత్వం కొనుగోలు చేసింది కేవలం నాలుగు లక్షల మెట్రిక్ టన్నులలోపు మాత్రమే. అంటే దిగుబడిలో మూడోవంతే. కొనుగోళ్లలో 90 శాతం రికార్డుల్లోనే. కొన్నది లేదు సరికదా.. రికార్డుల్లో చూపినదంతా తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి దొడ్డిదారిన తెచ్చిన ధాన్యం.
- అలాగే.. స్థానికంగా తక్కువ ధరకు కొనుగోలు చేసింది. అప్పట్లో ధాన్యం పండించిన చోట ఏర్పాటుచేసిన కేంద్రాల్లో కన్నా, మిల్లులు ఎక్కువగా ఉన్న బిక్కవోలు, మండపేట, పెద్దాపురం, సామర్లకోట, అనపర్తి, రాయవరం వంటి కేంద్రాల్లో కొనుగోళ్లు అధికంగా ఉండడానికి కారణం ఈ దొడ్డిదారి వ్యవహారమే.
- అప్పట్లో కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) రూ.1,057 ఉండేది. కానీ, కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేసే అవకాశంలేక రైతులు దళారులకు అమ్ముకోవాల్సి వచ్చేది.
- వీరి ధాన్యాన్ని తేమ, నూకలు, తాలూ తప్పల పేరుతో క్వింటాల్ ధాన్యాన్ని రూ.600ల నుంచి రూ.800లు చొప్పున కొనుగోలు చేయడంవల్ల రైతులు ఎంతగానో నష్టపోయారు.
- వీటిని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయాలు చూపించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1,057 పొందేవారు.
- కొనుగోలు లేకున్నా కొన్నామని చూపించడం ద్వారా కేంద్రాల నిర్వాహకులు సైతం ప్రభుత్వం నుంచి క్వింటాల్‌కు రూ.32 కమీషన్ రూపంలో నొక్కేసేవారు.
- రైతులకు ఇవ్వాల్సిన రవాణా ఖర్చులను, కూలీ ఖర్చులను కూడా స్వాహా చేసేవారు.
- అంతేకాక.. అప్పట్లో ఈ–క్రాప్ లేనందున ఇష్టానుసారం బుక్ ఎంట్రీ చేసే వీలు ఉండేది. మిల్లర్లు ధాన్యం బహిరంగంగా కొనుగోలు చేసినా కొనుగోలు కేంద్రాల్లో తమకు తెలిసిన రైతుల చిరునామాలను, సర్వే నెంబర్లు మీద ధాన్యం కొనుగోలుగా చూపించేవారు. అప్పట్లో వీటిల్లో టీడీపీ నేతల హవా ఉండడంతో దోపిడీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగింది.

### వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

టీడీపీ హయాంలో జరిగిన విధానంలో ధాన్యం కొనుగోళ్ల తీరుతో రైతులు నష్టపోతున్న విషయాన్ని నాటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ గుర్తించారు. తన ప్రభుత్వం వచ్చిన తరువాత ధాన్యం కొనుగోలులో సమూల మార్పులు తీసుకొచ్చారు. ఇప్పుడు ఆర్బీకేల ద్వారా క్షేత్రస్థాయిలో నేరుగా ధాన్యం సేకరణ సమర్థవంతంగా జరుగుతోంది. ఎలాగంటే..

- రైతులకు అడుగడుగునా అండగా నిలిచే రైతుభరోసా కేంద్రాలు ఊరూరా వెలిశాయి.
- ఈ–క్రాప్ విధానంవల్ల దిగుబడిపై పక్కాగా లెక్కలు వస్తున్నాయి. ఇప్పుడు తప్పుడు రికార్డులు సృష్టించే అవకాశమేలేదు.
- క్షేత్రస్థాయిలో కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగిస్తూ.. సమస్యలను అధిగమిస్తూ ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయడంవల్ల రైతుకు కనీస మద్దతు ధరకు ఢోకా లేకుండా పోయింది.
- చివరకు మిల్లుల వద్ద రైతులకు సమస్యలు రాకుండా కస్టోడియన్ అధికారులను ఏర్పాటుచేశారు.
- ఇక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రస్తుత రబీలోనే కాదు.. గత ఖరీఫ్‌లో సైతం రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసింది.
- ఉమ్మడి 'తూర్పు'లో 7.94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం కాగా, 7.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అంటే.. 97.84 శాతం ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసింది. రైతులకు రవాణా చార్జీల రూపంలో రూ.6.51 కోట్లు సైతం చెల్లించడం విశేషం.
- ఇక ప్రస్తుత రబీ విషయానికొస్తే.. ఇటీవల కురిసిన భారీ వర్షాలవల్ల తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొలక వచ్చిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేశారు.
- ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు రోడ్ల మీద తిరుగుతూ ఎక్కడ సమస్య వచ్చినా అక్కడికెళ్లి పరిష్కరిస్తున్నారు. ధాన్యం కొనుగోలుపై నిరంతర సమీక్ష చేస్తున్నారు.
- అయినప్పటికీ టీడీపీ నేతలు ధాన్యం కొనుగోలు చేయాలంటూ ఆందోళనకు దిగడం చూసి రైతులు ఆశ్చర్యపోతున్నారు.

### నాటి విధానంతో నష్టమనే మార్పులు..



టీడీపీ హయాంలో ధాన్యం కొనుగోలు విధానంవల్ల రైతులు నష్టపోయారు. అందుకే ప్రస్తుత ప్రభుత్వం మార్పులు చేసింది. స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధాన్యం కొనుగోలుపై సమీక్ష జరుపుతున్నారు. సమస్యలను ఆహ్వానిస్తున్నారు. ప్రతిపక్షాలు, దళారులు, ఒక వర్గం మీడియా చేస్తున్న రాజకీయాలవల్ల రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలేదనే విష ప్రచారంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.

– జిన్నూరి రామారావు (బాబీ), ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు, అల్లవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా




2015లో ధాన్యం కొనుగోలు అక్రమాలపై నాడు సాక్షిలో వచ్చిన కథనం (ఫైల్ ఫోటో)



ఈ నెల 6వ తేదీన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తడిచిన ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు ఎగుమతి చేస్తున్న దృశ్యం

### 'జగనన్నకు చెబుదాం'పై టీడీపీ నీచ రాజకీయం

- గ్రీవెన్స్ సెల్‌కు ఫోన్ చేసి ఉద్యోగిని వేధించిన టీడీపీ నేత వర్ల రామయ్య
- మరో 20 మందితో ఫోన్లు చేయించిన వైనం
- సమస్య చెప్పమంటే గ్రీవెన్స్ సెల్ సిబ్బందితో వెటకారాలు
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు కుయుక్తులు

సాక్షి, అమరావతి: ప్రజల సమస్యల్ని పరిష్కరించడం కోసం ప్రభుత్వం ప్రారంభించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై టీడీపీ నీచ రాజకీయాలకు తెరతీసింది. మీడియా సాక్షిగా జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్ సెల్‌కు టీడీపీ నేత వర్ల రామయ్య, కార్యకర్తలు మూకుమ్మడిగా ఫోన్లు చేశారు. వెటకారంగా మాట్లాడుతూ ఉద్యోగులను వేధింపులకు గురిచేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నుంచే వర్ల రామయ్య.. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. తనతోపాటు మరో 20 మంది పార్టీ నేతలు, కార్యకర్తలను మీడియా సమావేశంలో కూర్చోబెట్టి వారితో 1902 హెల్ప్ లైన్‌కి ఒకేసారి ఫోన్లు చేయించారు. తాను కూడా తన ఫోన్ నంబరు, ల్యాండ్‌లైన్ నంబర్ల నుంచి ఫోన్ చేశారు. హెల్ప్‌లైన్‌లో మాట్లాడుతున్న ఉద్యోగులతో అసభ్యంగా మాట్లాడుతూ, వెటకారం చేస్తూ వర్ల రెచ్చిపోయారు. 'నీ పేరేంటి.. నీ ఫోన్ నంబర్ చెప్పు.. నీ దుంప తెగ.. నువ్వు చాలా తెలివైనవాడివయ్యా.. నా సమస్యను జగనన్నకు చెప్పే అవకాశం లేదా? అన్ని సమస్యల్ని వెంటనే పరిష్కరించేస్తామన్నారుగా..' అంటూ ఉద్యోగిని వేధించారు. 'సీఎం జగన్ అవినీతి చేస్తున్నారు.. ఫిర్యాదు రాసుకో అంటూ' ఉద్యోగిని చాలాసేపు ఇబ్బంది పెట్టారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమమైన 'జగనన్నకు చెబుదాం'ను అడ్డుకోవడం, దానిపై బురద జల్లడమే లక్ష్యంగా వర్ల రామయ్య మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. టీడీపీ తన నీచ రాజకీయాల కోసం ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవడం అన్యాయమని మండిపడుతున్నారు. ప్రజల నిజమైన ఫిర్యాదుల పరిష్కారానికి అవకాశం ఇవ్వకుండా రాజకీయ డ్రామాలాడడం టీడీపీ నైజానికి నిదర్శనమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు, టీడీపీ నేతలు ఎంతకైనా దిగజారతారనే దానికి ఇది నిదర్శనమని అంటున్నారు. ప్రభుత్వంతో తమ సమస్యలు చెప్పుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలను టీడీపీ నేతలు అడ్డుకోవడంపై సొంత పార్టీ నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులను వేధించడానికి, వారి విధులకు ఆటంకం కలిగించడానికి చేసిన ప్రయత్నంగానూ ఇది కనిపిస్తోందని ధ్వజమెత్తుతున్నారు.

# సమస్యలు తీర్చే సేవకులం

▶ మొదటి పేజీ తరువాయి

సీఎం జగన్ మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, జిల్లా కేంద్రాల నుంచి అధికారులు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతా కలసికట్టుగా ఒక్కటై ప్రతి ఒక్కరి ముఖంలో చిరునవ్వులు చూడాలనే తపనతో పనిచేద్దామని ఈ సందర్భంగా అధికార యంత్రాంగానికి సీఎం పిలుపునిచ్చారు. సీఎం జగన్ ప్రసంగం వివరాలివీ..

### ధర్మబద్ధంగా పరిపాలిస్తే..

జగనన్నకు చెబుదాం కార్యక్రమం మిగతా వాటి కంటే భిన్నం. 3,648 కి.మీ సాగిన నా సుదీర్ఘ పాదయాత్రలో కనిపించిన సమస్యలకు పరిష్కారాలను అన్వేషించే దిశగా అడుగులు వేస్తూ నాలుగేళ్లుగా పాలన ముందుకు సాగుతోంది. చాలావరకు ఉత్పన్నమయ్యే సమస్యలన్నీ మానవ తప్పిదాలే అని పాదయాత్రలో అర్థమైంది. ప్రభుత్వం స్పందించాల్సిన రీతిలో స్పందిస్తే, న్యాయంగా, ధర్మబద్ధంగా ఉంటే ఎలాంటి సమస్యలకైనా పరిష్కారం ఉంటుంది. 90 – 95 శాతం సమస్యలకు పరిష్కారాలను చూపవచ్చని పాదయాత్రలో గుర్తించా.

### నాడు.. అడుగడుగునా లంచాలే

నా పాదయాత్రలో గ్రామాల్లోకి వెళ్లినప్పుడు పింఛన్లు రాలేదంటూ చాలా మంది వృద్ధులు వచ్చేవారు. పెన్షన్లు రాలేదని గోడు వెళ్లబోసుకుంటుంటే చాలా బాధ అనిపించేది. ఆ ప్రభుత్వం తీరు పట్ల ఆశ్చర్యం కలిగేది. పెన్షన్లు పొందేందుకు అన్ని అర్హతలున్నా మలి వయసులో అవస్థలు పడుతున్న దుస్థితి. జన్మభూమి కమిటీలు కనికరిస్తేగానీ పింఛన్లు రాని దయనీయ పరిస్థితి. మొదట మీరు ఏ పార్టీకి సంబంధించిన వారని జన్మభూమి కమిటీ నాయకులు ప్రశ్నిస్తారు. ఆ తరువాత ప్రతి పనికీ నాకెంత ఇస్తావు? అని లంచాలు అడిగే గుణం వారిది. పెన్షన్ల దగ్గర నుంచి ఇళ్ల కేటాయింపుల వరకూ ఇదే పరిస్థితి ఉండేది. ప్రభుత్వ పథకం ఏది తీసుకున్నా ప్రతి అడుగులోనూ వివక్ష, లంచాలే కనిపించేవి. ఊర్లో కొంత మందికి మాత్రమే ఇస్తామని చెప్పేవారు. ఎవరైనా చనిపోతే గానీ కొత్తవారికి అందని దయనీయ పరిస్థితులను నా పాదయాత్రలో చూశా.

### నాలుగేళ్లుగా సంతృప్త స్థాయిలో

ఏ వ్యవస్థలోనైనా అర్హులందరికీ ప్రయోజనం చేకూర్చడం, ఏ పార్టీ అనే వివక్ష లేకుండా ఇవ్వడం, లంచాలకు తావు లేకుండా సంతృప్త స్థాయిలో అందించడం గొప్ప మార్పులు తెచ్చేందుకు దోహదం చేస్తాయి. సంతృప్త స్థాయిలో గ్రామ స్థాయిలో అర్హులందరికీ మేలు చేస్తే దాదాపు 90 – 95 శాతం సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని భావించి సచివాలయాల ద్వారా విప్లవాత్మక మార్పులు తెచ్చాం. లంచాలు, వివక్షకు తావు లేని ఒక గొప్ప వ్యవస్థని గ్రామ స్థాయిలో తీసుకొచ్చాం. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం, ప్రతి యాభై ఇళ్లకు ఒక వలంటీర్‌ను కేటాయించి ఎవరికి ఏ సమస్య వచ్చినా చేయి పట్టుకుని నడిపించే పరిస్థితి ఇవాళ ఉంది. లబ్ధిదారుల జాబితాను సోషల్ ఆడిట్ కోసం గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తున్నాం.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

**ఫిర్యాదులను గౌరవిస్తూ 'వైఎస్సార్ ఐడీ నంబర్'**

మీరు ప్రయత్నం చేసినా పరిష్కారం కాని సమస్యలు నేరుగా నా దృష్టికే వస్తాయి. ఫోన్ చేశాక మీకు యునిక్ ఐడీ నంబరు వస్తుంది. యువర్ సర్వీస్ రిఫరెన్స్ (వైఎస్సార్) ఐడీ నంబరు అని పేరుపెట్టాం. మీ ఫిర్యాదుకు అంత గౌరవం ఇస్తూ వైఎస్సార్ పేరు పెట్టాం.

### ప్రజలకు మరింత చేరువగా పాలన

ఈ వ్యవస్థలే కాకుండా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ విధానం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం, అన్ని సదుపాయాలతో తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాలలు.. ఇలా ఏది తీసుకున్నా గ్రామ స్థాయిలో మార్పులు స్పష్టంగా తెలుస్తున్నాయి. పాలనలో ప్రజలను భాగస్వాములను చేస్తూ వారికి మరింత చేరువయ్యేలా ఈ నాలుగేళ్లలో అడుగులు పడ్డాయి.

### ఎదిగేకొద్దీ పెద్ద సేవకులే..

ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న నా దగ్గర నుంచి ప్రారంభిస్తే అంతా ప్రజలకు దగ్గరై సేవలు అందించడానికే ఉన్నాం. ప్రతి అధికారి పెద్ద స్థాయిలోకి వెళ్లేకొద్దీ మరింత పెద్ద సేవకుడు అవుతాడు. మీకు మరింత మంచి చేయాలనే తపనతో అడుగులు వేస్తున్న మీ ప్రభుత్వం ఇది.

### గట్టి ప్రయత్నం చేసినా ఫలించకుంటే

మారుమూల గ్రామాల నుంచి జిల్లా స్థాయి వరకు, కలెక్టర్ల దగ్గర నుంచి మున్సిపల్ కమిషనర్ల దాకా, అక్కడ నుంచి గ్రామ సచివాలయాల వరకు అన్ని స్థాయిల్లో అందరినీ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నాం. అర్జీదారుడికి సంతోషాన్ని కలిగించేలా, చిరునవ్వు కనిపించాలనే తపనతో ఈ కార్యక్రమాన్ని తీర్చిదిద్దాం. నాణ్యతగా సమస్యల పరిష్కారానికి వేదిక ఇది. ఏదైనా సమస్య ఉన్నప్పుడు సచివాలయం సహా అందుబాటులో ఉన్న వ్యవస్థల ద్వారా గట్టి ప్రయత్నం చేయండి. ఆ తరువాత కూడా అర్హత ఉన్నా న్యాయం జరగని పరిస్థితి ఉంటే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ఉపయోగపడుతుంది. నేరుగా జగనన్నకే చెబుదాం అన్నది ఈ కార్యక్రమం సారాంశం.

### మీ బిడ్డకే ఫోన్ కొట్టండి

అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలు, సేవలు అందకపోవడం, వైఎస్సార్ పెన్షన్ కానుక, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ సేవలు, సామాజిక పథకాలు, భూమి రికార్డులు ఇలా ఎలాంటి సమస్యలైనా మీ ప్రయత్నం చేసినప్పటికీ ఫలితాలు రాని పక్షంలో నేరుగా మీ జగన్‌కు, మీ అన్నకే, మీ తమ్ముడికే, మీ బిడ్డకే ఫోన్ కొట్టండి. 1902కు ఫోన్ కొడితే నేరుగా నా కార్యాలయానికే (సీఎంవో) ఫోన్ వస్తుంది.

### ఆ బాధ తెలిసిన ప్రభుత్వమిది

లంచాలు, వివక్షకు చోటులేని వ్యవస్థ కోసం దేశంలో ఎక్కడా చూడని విధంగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. అందులో భాగంగా ఇప్పటికే 'స్పందన' అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాం. సమస్యల పరిష్కారంలో గ్రామ సచివాలయాల నుంచి కలెక్టర్ల వరకూ ప్రతి ఒక్కరూ భాగస్వాములు అయ్యారు. దీనికోసం ఒక యంత్రాంగాన్ని తెచ్చాం. ప్రజలకు ప్రభుత్వం నుంచి ఒక హక్కుగా అందాల్సిన ఏ సేవ అయినా ఎక్కడైనా అందకుంటే బాధ్యతగా అందించేలా, జాప్యం జరగకుండా నివారించగలిగాం. న్యాయం, ధర్మం మన పక్షాన ఉన్నా కూడా తమకు రావాల్సింది రాకపోతే ఎలాంటి బాధ అనుభవిస్తారో తెలిసిన ప్రభుత్వంగా అడుగులు ముందుకు వేశాం. సమస్యలకు పరిష్కారాలను చూపేలా స్పందన ద్వారా అడుగులు వేశాం. స్పందన మరింత మెరుగ్గా చేయాలనే ఉద్దేశంతో ఇవాళ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. నేరుగా మీ ముఖ్యమంత్రికే చెబుదాం అనే ఆలోచనతో దీన్ని చేపట్టాం.

### సీఎంవో, సీఎస్, డీజీపీ పర్యవేక్షణ

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసేందుకు మండల కేంద్రం, జిల్లా కేంద్రం, రాష్ట్ర సచివాలయం, సీఎంవోలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లు పెట్టాం. సీఎంవో, సీఎస్, డీజీపీ దీన్ని సమర్థంగా నిర్వహించేలా బాధ్యతలు అప్పగించాం. మానిటరింగ్ యూనిట్లలో ప్రతి చోటా మీ సమస్య పరిష్కారాన్ని పర్యవేక్షిస్తారు. స్పెషల్ ఆఫీసర్లు క్రమం తప్పకుండా జిల్లాల్లో పర్యటించి కలెక్టర్లతో మమేకమై జగనన్నకు చెబుదాం కార్యక్రమం సమర్థంగా అమలయ్యేలా పర్యవేక్షిస్తారు. మీకు ఉత్తమ పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటారు. మీ సమస్య పరిష్కారం అయ్యాక ఫోన్ చేసి ఫీడ్‌బ్యాక్ కూడా తీసుకుంటారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇవన్నీ జరుగుతాయి.

### ప్రతి ఫిర్యాదు పరిశీలన..

గత ఆర్నెల్లుగా మీరు (ముఖ్యమంత్రి జగన్) చేసిన సూచనల మేరకు మా జిల్లాలో ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశాం. కలెక్టర్, జేసీల నేతృత్వంలో ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ పని చేస్తోంది. వీరిలో ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కన్వీనర్‌గా ఉన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాలకు అందే వినతులు, ఫిర్యాదులను మండల స్థాయిలో కూడా పరిశీలించేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి ఫిర్యాదును పరిశీలించి పర్యవేక్షిస్తున్నాం. గ్రామ సచివాలయం నుంచి జిల్లా కేంద్రం వరకు అందరూ పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మీ (సీఎం ) పేరు ఉండడం వల్ల నాణ్యతతో కూడిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకున్నాం. మీ సూచనలు సలహాలు పాటిస్తూ ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళతాం.

– దినేష్‌కుమార్, ప్రకాశం జిల్లా కలెక్టర్

### కొత్త శకానికి నాంది..

జాప్యం లేకుండా ఫిర్యాదుల పరిష్కారానికి పూర్తి స్థాయి యంత్రాంగాన్ని సిద్ధం చేసుకున్నాం. స్పెషల్ ఆఫీసర్ కూడా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులకు తగిన శిక్షణ కూడా ఇచ్చాం. ఇది కొత్త శకానికి నాంది పలుకుతుంది. ఫిర్యాదుదారుడు సమస్య పరిష్కారం కాగానే చిరునవ్వుతో వెనుదిరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– నిషాంత్‌కుమార్, పార్వతీపురం మన్యం కలెక్టర్

### 1902 ప్రతి గడపకూ తెలిసేలా..

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి సంబంధించి ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లలో సిబ్బందిని నియమించి ఇప్పటికే అవగాహన తరగతులు నిర్వహించాం. 1902 నెంబర్ ప్రతి గడపకూ తెలిసేలా చర్యలు తీసుకున్నాం. రోజువారీ నివేదికను సిద్ధం చేసి పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తాం. అన్ని శాఖల సమన్వయంతో అర్జీదారుడికి సత్వరమే న్యాయం జరిగేలా చూస్తాం. సివిల్ కేసుల పరిష్కారానికి మండల, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సహకారం తీసుకుంటాం. ఫీడ్ బ్యాక్ మెకానిజాన్ని కూడా ఏర్పాటు చేశాం. ఈ కార్యక్రమం దేశానికే రోల్‌మోడల్ అవుతుంది.

– అన్బురాజన్, వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ

## క్లుప్తంగా...

### అది ప్రైవేటు వెంచర్‌కాదు

- పేదలకు స్థలాలు ఇవ్వొచ్చు
- అమరావతి స్థలాల కేటాయింపుపై మంత్రి బొత్స



విజయనగరం అర్బన్: అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దన డానికి అది ప్రైవేటు వెంచర్ కాదని, అన్నివ ర్గాల ప్రజల నివాసయోగిత స్థలమని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఆయన మంగళవారం విజయనగరం కలెక్టరేట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. అమరావతి రాజధాని అయినంత మాత్రాన అక్కడ సామాన్యులు, మధ్యతరగతి వారు నివాసం ఉండకూడదని చెప్పడం సబబుకాదని విలేకరుల ప్రశ్నకు జవాబిచ్చారు. అమరావతిలో సాధారణ పౌరులు నివాసం ఉండకూడదా అని ప్రశ్నించారు. మణిపూర్‌లో చిక్కుకున్న 163 మంది తెలుగు విద్యార్థులను వారి స్వస్థలాలకు సురక్షితంగా చేర్చామని చెప్పారు. ప్రభుత్వం అన్ని జిల్లాలకు మంత్రులు, సీనియర్ అధికారులను పంపించి అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో అకాల వర్షాల వల్ల ఎలాంటి నష్టాలు జరగలేదని ఆయన చెప్పారు. ఆయన వెంట ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తదితరులున్నారు.

### ఆర్-5 జోన్ కేసులో కేవియట్

సాక్షి, న్యూఢిల్లీ: అమరావతిలో ఆర్-5 జోన్‌పై హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో దాఖలైన కేసులో కేవియట్ దాఖలైంది. గుంటూరు జిల్లాకు చెందిన మస్తాన్ వలీ తరఫు న్యాయవాది అభిజిత్‌సేన్ గుప్తా ఈ కేవియట్ దాఖలు చేశారు. తాను హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన కేసులో పార్టీని కాదని, సుప్రీంకోర్టులో దాఖలైన పిటీషన్‌లో తనను పార్టీ చేయాలని మస్తాన్‌వలీ కోరారు.

### బాబూ.. నువ్విక సీఎంవి కాలేవు

మంత్రి కారుమూరి



ఇరగవరం : 'చంద్రబాబూ.. నువ్వు ఇక ఎప్పటికీ ముఖ్యమంత్రి కాలేవు'.. అంటూ రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు స్పష్టంచేశారు. అధికారంలో ఉండగా వ్యవసాయం దండగన్న వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలంలోని యర్రాయి చెరువు, ఇరగవరం, వేండ్రవారిపాలెం, రాపాక గ్రామాల్లో మంగళవారం పర్యటించిన మంత్రి.. వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కోసిన ధాన్యం కోసినట్లు మిల్లులకు తరలించాలని సూచించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని ఆయన.. ఇప్పుడు వారి కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు.

# పనులు చకచకా

## ఆర్-5 జోన్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు

- పూర్తవుతున్న లేఅవుట్‌లు
- ప్లాట్లను గుర్తించేందుకు సరిహద్దు రాళ్ల ఏర్పాటు
- ఈ నెల 15 తర్వాత సీఎం చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు



నవులూరులో లేఅవుట్‌లో పాతిన రాళ్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు పనులు చకచకా సాగుతున్నాయి. లేఅవుట్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్లాట్ల సరిహద్దులు గుర్తించి రాళ్లు పాతే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వారం రోజుల్లో అన్ని పనులు పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. గుంటూరు జిల్లాలోని తాడేపల్లి, మంగళగిరి అర్బన్, రూరల్ ప్రాంతాలతోపాటు తుళ్లూరు, పెదకాకాని మండలాల్లో లబ్ధిదారులకు 23,192 మందికి రకరకాల కారణాలతో పట్టాలు పంపిణీ చేయలేదు. ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 25 వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు లబ్ధిదారులను గుర్తించారు. ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో-45 ద్వారా భూమిని కేటాయించడం జరిగింది. గుంటూరు జిల్లాకు 550.65 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాకు 583.94 ఎకరాలు మొత్తం కలిపి 1,134.,59 ఎకరాల భూమిని కేటాయించారు.

### ఇప్పటికే పట్టాలు సిద్ధం

లబ్ధిదారులకు సంబంధించి మళ్లీ ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేయించారు. ఎవరైనా లబ్ధిదారులు మరణిస్తే.. వారి వారసుల పేరిట పట్టాలిచ్చారు.తాత్కాలిక అవసరాల నిమిత్తం కొందరు, శాశ్వతంగా మరికొందరు వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. వీరందరినీ గుర్తించి అర్హులందరికీ ఇళ్ల పట్టాలు సిద్ధం చేయించారు. ఇప్పటికే పట్టాలను సైతం ప్రింట్ చేయించారు. అందులో లబ్ధిదారుల వివరాలన్నీ పొందుపరిచారు. ఇందులో ముఖ్యమంత్రి సందేశం, లబ్ధిదారుని వివరాలు, ఆధార్ నంబర్, గ్రామం, వివరాలు, రెండు పేజీలలో డి.పట్టా, లేఅవుట్, ప్లాట్ హద్దులు ఉండేలా ఏర్పాటు చేశారు. ఈ పట్టాలపై సంబంధిత తహసీల్దార్‌తో సంతకాలు చేయించి అందుబాటులో పెట్టారు. వీరందరికీ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చేందుకు వాటిని స్కాన్ చేసి ఆ వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించారు.

### 6 గ్రామాల్లో 20 లేఅవుట్లు

ఐనవోలు, మందడం, నవులూరు, నిడమర్రు, కృష్ణాయపాలెం, కురగల్లు గ్రామాల్లో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల లబ్ధిదారుల కోసం 20 లేఅవుట్లు వేశారు. సీఆర్‌డీఏకి భూమిని కేటాయించిన తర్వాత భూముల హద్దులు నిర్ధారించి.. ఆ భూమిని స్వాధీనం చేసుకున్న తర్వాత లేఅవుట్లు సిద్ధం చేశారు. టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు అనుగుణంగా లేఅవుట్లలో ఉండాల్సిన ఓపెన్ స్పేస్, రోడ్లు, డ్రైయిన్లు, పార్కింగ్, ఇతర అవసరాలకు కావాల్సిన భూమిని వదిలి ప్లాట్లు వేశారు. సీఆర్‌డీఏ టౌన్‌ప్లానింగ్ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నారు.



ఎర్రబాలెం లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

అనుమతులు వచ్చిన తర్వాత అభివృద్ధి బాధ్యతను సీఆర్‌డీఏకి ప్రభుత్వం అప్పగించింది. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేసి ప్రతి లేఅవుట్‌కు ఒక కాంట్రాక్టర్ ఉండేలా పనులు అప్పగించారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. లెవలింగ్ దాదాపు పూర్తయ్యింది. ప్రతి లేఅవుట్ పూర్తిస్థాయిలో రావడం కోసం లెవలింగ్, జంగిల్ క్లియరెన్స్, రోడ్ల ఏర్పాటు, సరిహద్దుల మార్కింగ్ చేశారు. సరిహద్దు రాళ్లు పాతి వాటికి తెల్లరంగు వేసి ప్లాట్ నంబర్లు వేసే పనులు చకచకా సాగుతున్నాయి. దీంతోపాటు రోడ్డు పక్కన డ్రైయిన్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి లేఅవుట్‌కు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని, ఒక ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను నియమించారు. మార్కింగ్ ఇవ్వడం కోసం 120 మంది సర్వేయర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను నియమించారు. వీరంతా మార్కింగ్ చేస్తున్నారు.

## పేదల ఇళ్ల కోసం మరో 268 ఎకరాలు

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్డీఏ పరిధిలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకానికి ప్రభుత్వం మరో 268 ఎకరాలను కేటాయించింది. ఇందులో బోరుపాలెం, పిచికలపాలెం, అనంతవరం గ్రామాల పరిధిలో 168 ఎకరాలను ఎన్టీఆర్ జిల్లాకు చెందిన లబ్ధిదారుల కోసం కేటాయించగా.. గుంటూరు జిల్లాకు చెందిన లబ్ధిదారుల కోసం మరో 100 ఎకరాలను నెక్కల్లులో కేటాయించింది. ఇప్పటికే పేదలందరికీ ఇళ్ల పథకానికి ప్రభుత్వం 1,134.58 ఎకరాలను కేటాయించి ప్లాట్లుగా వేస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలో సుమారు 50 వేల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వనుంది. గతంలో ఇక్కడ 48,218 మంది లబ్ధిదారులకు చోటు కల్పించారు. అయితే, కేటాయించిన భూమిలో 40,502 ప్లాట్లు సిద్ధమవుతున్నాయి. మిగిలిన లబ్ధిదారులకు కూడా ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అనువుగా అదనంగా భూమి ఇవ్వాలని రెండు జిల్లాల కలెక్టర్లు ప్రభుత్వాన్ని కోరారు. దాంతో మంగళవారం మరో 168 ఎకరాలను కేటాయించింది. ఈ ప్రాంతంలో పేదలందరికీ ఇళ్ల పథకంలో ఎన్టీఆర్ జిల్లాకు 26,739 మంది, గుంటూరు జిల్లాకు చెందిన 23,235 మంది లబ్ధిదారులకు మొత్తం 49,974 ప్లాట్లు ఇవ్వనున్నారు.

### సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీ

ఈ నెల 15వ తేదీ తర్వాత ఎప్పుడైనా సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా పట్టాల పంపిణీ జరుగుతుంది. సుమారు రెండు జిల్లాల్లో కలిపి 50 వేల మందికి పట్టాల పంపిణీ చేస్తాం. ఈ పట్టాలు పంపిణీ జరిగితే జిల్లాలో పట్టాల పంపిణీ ప్రక్రియ పూర్తి అవుతుంది.- ఎం.వేణుగోపాలరెడ్డి, కలెక్టర్

# ఎస్సీ గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి/కొల్లూరు: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులు సాధిస్తున్న అద్భుత ఫలితాలతో ఈసారి సీట్లకు తీవ్ర పోటీ ఏర్పడిందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. గతంలో వీటిలో సీట్లు భర్తీ కావడమే గగనంగా ఉండేదని గుర్తు చేశారు. అలాంటిది ఈసారి గురుకులాల్లో ఒక్కో సీటుకు ముగ్గురు విద్యార్థులు పోటీ పడ్డారన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష ఫలితాలను మంగళవారం బాపట్ల జిల్లా కొల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి నాగార్జున విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గురుకులాల్లో ఐదో తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాల కోసం పరీక్షలను నిర్వహించామన్నారు. ఐదో తరగతిలో 14,940 సీట్ల కోసం 55,485 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 46,019 మంది ప్రవేశ పరీక్షలు రాశారని వెల్లడించారు. అనంతపురానికి చెందిన పర్వత జనవై 50కి 50 మార్కులు సాధించి మొదటి ర్యాంకు సొంతం చేసుకుందన్నారు. అలాగే జూనియర్ ఇంటర్‌లో 14 వేల సీట్లకు 38,195 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 31,245 మంది ప్రవేశ పరీక్ష రాశారని వివరించారు. ఇందులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పొందూరు సూర్య నేత్రే 100కు 92.5 మార్కులు సాధించి మొదటి ర్యాంకును దక్కించుకుందన్నారు.

### టాపర్లకు నగదు బహుమతులు

ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఎస్సీ గురుకులాలకు చెందిన 1,370 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులను సాధించారని మంత్రి నాగార్జున తెలిపారు. కాకినాడ జిల్లా పి.వెంకటాపురానికి చెందిన విద్యార్థిని దడాల జ్యోత్స్న 600కు 589 మార్కులు సాధించి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. విశాఖపట్నం మధురవాడకు చెందిన ఎస్.మోద ప్రియాంక 588, ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన ఎం.ఇందిర, అనంతపురం జిల్లా బి.పప్పూరుకు చెందిన డి.మధుసూదన్‌లు 583 మార్కులతో రెండు, మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. మొదటి ర్యాంక్ సాధించిన జ్యోత్స్నకు రూ.లక్ష, మిగిలిన వారికి ర్యాంకుల ఆధారంగా నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పదో తరగతిలో 80.38 శాతం, ఇంటర్‌లో 74.33 శాతం ఉత్తీర్ణతను ఎస్సీ గురుకులాలు సాధించాయని వెల్లడించారు. ఇక జేఈఈ, నీట్‌లోనూ సత్తా చాటి అత్యధిక సంఖ్యలో సీట్లు కొల్లగొట్టారని ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురుకులాల్లో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టారని కొనియాడారు.

# నేడు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపీ పాలిసెట్-2023 పరీక్ష బుధవారం (నేడు) జరగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 61 పట్టణాల్లో 499 కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటల్లోపు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష రాసే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. పాలిసెట్‌కు మొత్తం 1,59,144 మంది దరఖాస్తు చేశారని వివరించారు. వీరిలో 96,429 మంది బాలురు, 62,715 మంది బాలికలు ఉన్నారన్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి 21 వేల దరఖాస్తులు పెరిగాయని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాలతో 26,698 మంది ఎస్సీ, 9113 మంది ఎస్టీ అభ్యర్థులు పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. పాలిటెక్నిక్ విద్యతో ప్రయోజనాలు, ఉపాధి అవకాశాల గురించి ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్‌ల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ద్వారా పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించినట్టు నాగరాణి తెలిపారు. రాష్ట్రంలో 84 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 9 వేల మంది విద్యార్థులకు పాలిసెట్‌కు ఉచితంగా కోచింగ్ అందించి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది కొత్తగా మరో మూడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తరగతులు ప్రారంభిస్తున్నామని తెలిపారు.

# పోలవరం తొలి దశ పూర్తికి రూ.16,952 కోట్లు అవసరం

- సత్వరమే పూర్తి చేయాలంటే నిధులు సకాలంలో ఇవ్వాలి
- ప్రాజెక్టు అథారిటీ సీఈవోకు జలవనరుల శాఖ లేఖ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు ముందస్తు ఫలాలను రైతులకు అందించడానికి సత్వరమే తొలి దశ పనులను పూర్తి చేయాలని, ఇందు కోసం రూ.16,952.07 కోట్లు తక్షణమే విడుదల చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ ఏప్రిల్ 10న జారీ చేసిన మార్గదర్శకాల మేరకు.. ప్రాజెక్టును 41.15 మీటర్ల వరకు పూర్తి చేయడానికి అంచనా వ్యయాన్ని సవరిస్తూ ప్రతిపాదన పంపినట్లు పేర్కొంది. వీటితో పాటు ప్రాజెక్టును 45.72 మీటర్ల వరకు సమగ్రంగా పూర్తి చేయడానికి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదించిన సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ఇచ్చి, నిధులు విడుదల చేయాలని కోరింది. ఈ మేరకు పీపీఏ సీఈవో శివ్‌నందన్‌కుమార్‌కు జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ లేఖ రాశారు. ఆ లేఖలో ప్రధానాంశాలు..

- పోలవరం ప్రాజెక్టును 41.15 మీటర్ల వరకు తొలి దశ పూర్తి చేయడానికి రూ.10,911.15 కోట్లు విడుదల చేయాలని 2022 జనవరి 10న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా, అందులో రూ.10,485.38 కోట్లు మంజూరు చేయాలని సీడబ్ల్యూసీ కేంద్ర జల్ శక్తి శాఖకు 2022 ఏప్రిల్ 21న సిఫార్సు చేసింది. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ డిజైన్లు ఖరారయ్యాక ప్రాజెక్టు తొలి దశ తుది ప్రతిపాదనలు పంపాలని గతేడాది జూన్ 15న సీడబ్ల్యూసీ (జాతీయ ప్రాజెక్టుల విభాగం) డైరెక్టర్ సూచించారు.
- ఈ ఏడాది మార్చి 4, 5న డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ) ప్రాజెక్టును సందర్శించి.. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2లలో గోదావరి వరదల ఉధృతికి ఏర్పడిన భారీ అగాధాలను పూడ్చటం, గ్యాప్-2లో డయాఫ్రమ్‌వాల్‌లో దెబ్బతిన్న ప్రదేశాల్లో సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించి.. పాత దానితో అనుసంధానం చేసే విధానాన్ని ఖరారు చేసింది. ఈ పనులకు రూ. 2,020.05 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది.
- డీడీఆర్పీ మార్గదర్శకాల మేరకు ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌తో సహా ప్రాజెక్టు తొలి దశ పూర్తి చేయడానికి ఎన్ని నిధులు అవసరమో ప్రతిపాదనలు పంపాలని ఏప్రిల్ 10న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ రాష్ట్ర జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు.
- ప్రధాన డ్యామ్‌తో సహా కాలువల్లో మిగిలిన పనులకు రూ.6,593.02 కోట్లు, డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణ, అగాధాలను పూడ్చటానికి రూ.2,020.05 కోట్లు, ప్రాజెక్టు నిర్వహణకు అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు రూ.945 కోట్లు అవసరం.
- 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో 123 ముంపు గ్రామాల్లో మిగిలిన భూమి సేకరణ, నిర్వాసితుల పునరావాసానికి రూ.2,177 కోట్లు, ఎడమ కాలువలో కుమ్మరలోవ గ్రామంలో భూసేకరణ, నిర్వాసితుల పునరావాసానికి రూ.90 కోట్లు అవసరం. ప్రాజెక్టు 41.15 మీటర్ల పరిధిలో అదనంగా ముంపునకు గురయ్యే 36 గ్రామాల్లోని 16,642 కుటుంబాల పునరావాసానికి రూ.5,127 కోట్లు ఖర్చవుతుంది. వెరసి తొలి దశ పనులను సమగ్రంగా పూర్తి చేయడానికి రూ.16,952.07 కోట్లు అవసరం. ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో పూర్తి స్థాయిలో పూర్తి చేయడానికి సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనలు కేంద్ర జల్ శక్తి శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

### నిధులు ఇస్తే సత్వరమే పోలవరం..

పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంతో జరుగుతున్నాయి. పనులు చేస్తున్న కాంట్రాక్టు సంస్థలకు సకాలంలో బిల్లులు చెల్లించడానికి, నిర్వాసితులకు పునరావాసం కల్పించడానికి నిధులు ఇస్తే షెడ్యూలు ప్రకారం ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయొచ్చు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించక ముందే రూ.4,730.71 కోట్లు ఖర్చు చేస్తే.. ఆ తర్వాత రూ.16,218.78 కోట్లు వెరసి.. రూ.20,949.49 కోట్లు ఖర్చు చేసింది. అంటే.. కేంద్రం 2013-14 ధరల ప్రకారం ప్రాజెక్టు నీటిపారుదల విభాగానికి అయ్యే రూ.20,398.61 కోట్లకంటే రాష్ట్ర ప్రభుత్వం అధికంగా రూ.550.88 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో పీపీఏ ఖర్చులతో కలిపి కేంద్రం రూ.14,418.89 కోట్లను రీయింబర్స్ చేసింది. ఈ నేపథ్యంలో సవరించిన అంచనా వ్యయ ప్రతిపాదనలను తక్షణమే ఆమోదించి.. ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి నిధులు విడుదల చేయాలి అని ఆ లేఖలో పేర్కొన్నారు.



కోపాన్ని శాంతంతో జయించాలి. చెడ్డతనాన్ని మంచితనంతో జయించాలి. అల్పత్వాన్ని ఉదారగుణంతో జయించాలి. నిజాయితీలేమిని సత్యంతో జయించాలి.

– బౌద్ధ ధర్మం



సాక్షి

బుధవారం, 10 మే 2023

# పాక్ సైన్యం ఆగడం

రాజకీయంగా తానే పెంచి పోషించి ప్రధానిగా చేసిన ఇమ్రాన్‌ఖాన్ తనపైనే తిరుగుబాటు చేయడాన్ని జీర్ణించుకోలేక నిరుడు ఏప్రిల్‌లో పదవీభ్రష్టుణ్ణి చేసిన సైన్యం చివరకు మంగళవారం ఆయన్ను అరెస్టు చేసి పగ చల్లార్చుకుంది. అధికారం పోగానే అవినీతి, ఉగ్రవాదం, మత దూషణ, హత్య, హింసాకాండను ప్రోత్సహించటం వంటి 140 ఆరోపణల్లో చిక్కుకుని వీలుదొరికినప్పుడల్లా తమపై విరుచుకుపడుతున్న ఇమ్రాన్‌పై సైన్యం ఆగ్రహావేశాలతో రగిలిపోతోంది. అదును కోసం ఎదురుచూస్తోంది. కొన్ని కేసుల్లో బెయిల్ తెచ్చుకుని ఒక అవినీతి ఆరోపణ కేసులో ఇస్లామాబాద్ హైకోర్టుకు హాజరైన ఇమ్రాన్‌ను ఆ కోర్టు ప్రాంగణంలోని గది తలుపులు బద్దలుకొట్టి పారామిలిటరీ బలగాలు తీసుకుపోగలిగాయంటే సైన్యం ఎంత బరితెగించిందో అర్థమవుతుంది. 'ఇది చట్టవిరుద్ధం కాదా? ఇది న్యాయవ్యవస్థ స్వతంత్రతపైనా, న్యాయస్థానంపైనా దాడి కాదా?' అంటూ ఇస్లామాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆమర్ ఫరూక్ ఆక్రోశించటం అక్కడి పరిస్థితికి అద్దం పడుతుంది. జనరల్ ముషార్రఫ్ ఏలుబడిలో దానికి వ్యతిరేకంగా దృఢంగా నిలబడిన న్యాయవ్యవస్థ ఇప్పుడు జస్టిస్ ఫరూక్ ఆక్రోశాన్ని వింటుందా, సైన్యంతో తలపడటానికి సిద్ధపడుతుందా అన్నది చూడాలి. నిరుడు నవంబర్‌లో జరిగిన హత్యాయత్నం నుంచి ఇమ్రాన్ క్షేమంగా బయటపడగా అప్పటినుంచీ పాక్ సైన్యం తనను చంపడానికి కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపిస్తున్నారు. తన అరెస్టుకు ముందు ఆయన ఒక వీడియో కూడా విడుదల చేశారు. నిరాధారమైన ఆరోపణలు చేయొద్దని పాక్ సైన్యం హెచ్చరించిన కొన్ని గంటలకే ఇమ్రాన్ అరెస్టయిన తీరు చూస్తే ఆ దేశం ఇంకా ఆటవిక న్యాయంలోనే బతుకీడుస్తోందని తెలుస్తుంది.

అధికారంలో ఉన్నవారిని కూలదోయటం, నచ్చినవారిని అందలం ఎక్కించటం సైన్యానికి కొత్త గాదు. అలాగే తమ బద్ధ శత్రువులుగా మారినవారిని అంతమొందించేందుకు కూడా వెనకాడదు. ఇందుకు మాజీ ప్రధానులు జుల్ఫికర్ అలీ భుట్టో, ఆయన కుమార్తె బేనజీర్ భుట్టో ఉదాహరణలు. భుట్టోను ఒక హత్యకేసులో ఇరికించి విచారణ తంతు నడిపించి 'చట్టబద్ధంగా' ఉరితీస్తే, బేనజీర్‌ను ఎన్నికల ర్యాలీలో ఉండగా కాల్చిచంపారు. పాకిస్తాన్ ఏర్పడ్డాక దాదాపు పదేళ్లు ఏదోమేరకు సవ్యంగానే గడిచింది. కానీ ఎన్నికైన ప్రభుత్వంపై 1958లో తొలిసారి అప్పటి సైనిక దళాల చీఫ్ జనరల్ అయూబ్ ఖాన్ తిరుగుబాటు చేసి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. ఆ తర్వాత జనరల్ యాహ్యాఖాన్, జనరల్ జియావుల్ హక్, జనరల్ పర్వేజ్ ముషార్రఫ్‌లు ఆ తోవనే పోయారు. మధ్య మధ్య పౌర ప్రభుత్వాలు ఏర్పడినా అవన్నీ అల్పాయుష్షు సర్కారులే. బేనజీర్ భుట్టో మూడు దఫాలు ప్రధానిగా చేసినా ఎప్పుడూ పూర్తి కాలం కొనసాగలేకపోయారు. ఆమాటకొస్తే నవాజ్ షరీఫ్ ఎంతోకొంత నయం. ఆయన తొలిసారి ప్రధాని అయిన కొంతకాలానికే ముషార్రఫ్ సైనిక తిరుగుబాటు జరిపి ప్రభుత్వాన్ని కూలదోశారు. చివరకు అంతర్జాతీయంగా ఒత్తిళ్లు పెరగటంతో 2008లో ఎన్నికలు నిర్వహించక తప్పలేదు. అప్పటినుంచీ సైన్యం పంథా మార్చుకుంది. అందువల్లే ఆ సంవత్సరం జరిగిన ఎన్నికల్లో అధికారంలోకొచ్చిన పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ అయిదేళ్లూ నిరాటంకంగా పాలించింది. అనంతరం 2013 ఎన్నికల్లో నెగ్గిన నవాజ్ షరీఫ్ సైతం పూర్తికాలం అధికారంలో కొనసాగారు. అలాగని ఆయన నిర్భయంగా పాలించారనడానికి లేదు. సైన్యం నీడలోనే పాలన సాగింది. భారత్‌తో చెలిమికి ఆయన ప్రయత్నించినప్పుడల్లా చొరబాటుదార్లను మన దేశంలో ప్రవేశపెట్టి విధ్వంసాలకు దిగటం, అధీనరేఖ వద్ద కాల్పులు జరపటం సైన్యానికి పరిపాటయింది. జనంలో అంతగా పలుకుబడిలేని ఇమ్రాన్ నేతృత్వంలోని పాకిస్తాన్ తెహ్రీకే ఇన్సాఫ్(పీటీఐ)కు అండదండలందించి 2018 ఎన్నికల్లో ఆ పార్టీ విజయానికి దోహదపడింది. ఆ ఎన్నికల్లో సైన్యం జరిపిన రిగ్గింగ్ వల్లే అదంతా సాధ్యమైందని ఆరోపణలొచ్చాయి. కానీ మూడేళ్లు గడిచేసరికే ఇద్దరికీ చెడింది. నిరుడు ఏప్రిల్‌లో తెరవెనక తతంగం నడిపి విపక్షాలను ఏకంచేసి ఇమ్రాన్‌పై జాతీయ అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం నెగ్గేలా చేసి ఆయన్ను పదవి నుంచి దించగలిగింది.

సైన్యం సాగించిన దౌష్ట్యాన్ని సామాజిక మాధ్యమాల్లో, కొన్ని చానెళ్లలో చూసిన పాక్ భగ్గుమంటోంది. పలు నగరాలు, పట్టణాలు నిరసనలతో హోరెత్తుతున్నాయి. లాహోర్‌లోని సైనిక కోర్ కమాండర్ నివాసంపై ఆందోళనకారులు దాడి చేయగా, అనేకచోట్ల విధ్వంసం చోటుచేసుకుంది. సైనిక తిరుగుబాటులో అధికారం చేజిక్కించుకుని, బూటకపు ఎన్నికల్లో దేశాధ్యక్షుడైన జియా తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవటానికి మతోన్మాదాన్ని ప్రోత్సహించిన నాటినుంచీ పాక్‌లో మతానిది పైచేయి అయింది. ఆ తర్వాత అధికారంలోకొచ్చినవారు సైతం ఆ బాటనే పోతున్నారు. మరోపక్క దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఐఎంఎఫ్ నుంచి రావాల్సిన 650 కోట్ల డాలర్ల రుణం గత నవంబర్‌నుంచి పెండింగ్‌లో పడింది. వచ్చే నెలలో అది మురిగిపోతుంది. ఇక విదేశీ మారక ద్రవ్యం నిల్వలు పాక్ వద్ద 445 కోట్ల డాలర్లు మించి లేవు. ఆ మొత్తం మహా అయితే ఒక నెల దిగుమతులకు సరిపోతుంది. ఈ సంక్షోభాన్ని అధిగమించడ మెలాగో తెలియక ప్రధాని షెహబాజ్ షరీఫ్ అయోమయంలో కూరుకుపోగా, సైన్యం ఇమ్రాన్ జోలికిపోయి చేజేతులా మంట రాజేసింది. తాజా పరిణామాల పర్యవసానంగా అది సైనిక పాలనలోకి జారుకున్నా ఆశ్చర్యం లేదు. మన పొరుగున్న దేశం కనుక మనం అత్యంత అప్రమత్తంగా ఉండకతప్పదు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.పంచమి ప.3.24 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: పూర్వాషాఢ సా.5.34 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.1.22 నుండి 2.54 వరకు, దుర్ముహూర్తం: ప.11.31 నుండి 12.21 వరకు, అమృతఘడియలు: ప.1.22 నుండి 2.52 వరకు

సూర్యోదయం : 5.35
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

# చర్చకు తావిచ్చే బోధన లేకపోతే...

విశ్లేషణ



అవిజిత్ పాఠక్

**ఎంపిక చేసిన అధ్యాయాలను, పేరాలను, చిత్రణలను ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల నుంచి తొలగించడానికి జ్ఞాన రాజకీయాలే దారి తీశాయి. కానీ అసలు సమస్యను విస్మరిస్తున్నాం. తరగతి గదులు ప్రేరణారహితంగా ఉండిపోవడాన్ని మనం విస్మరిస్తున్నాం. పాఠంలో పొందుపర్చిన జ్ఞాన గుళికను విద్యార్థులకు అందించడం కంటే మించిన పాత్ర టీచర్‌కి ఏమీ ఉండటం లేదు. ఘనీభవించిన పదాలను కంఠస్థం చేసే కళలో విద్యార్థులు నైపుణ్యం సాధించేలా చేయాలని టీచర్లను కోరుతున్నారు. కమలా దాస్ కవిత్వం, ఆర్కే లక్ష్మణ్ కార్టూన్ వంటి వాటిని బోధనా సాధనంగా చేసినప్పటికీ అవి కేవలం రెండు మార్కుల ప్రశ్నగా మాత్రమే కుదించబడతాయి. అర్థవంతమైన విద్య అంటే పాఠ్యపుస్తకాన్ని దాటి విద్యార్థిని ఎదిగేలా చేయాలి.**

భావజాలం, కరిక్యులమ్‌కి చెందిన గతిశాస్త్రం గురించి ఇప్పటికే చాలా చాలా చర్చ జరిగింది. ఎంపిక చేసిన అధ్యాయాలను, పేరాలను, చిత్రణలను, సమాచారాన్ని ఎన్సీఈఆర్టీ స్కూల్ పాఠ్యపుస్తకాల నుంచి తొలగించడానికి జ్ఞాన రాజకీయాలే దారి తీశాయి. రాజకీయంగా చేపట్టిన ఈ తొలగింపుపై ఉదారవాద వామపక్ష అకడెమిక్ సమాజం తన ఆగ్రహాన్ని, విచారాన్ని వ్యక్తం చేయగా, ఈ విషపూరిత సమయాల్లో ఎన్సీఈఆర్టీని నడుపుతున్న విద్యావిషయకమైన ఉన్నతాధికార వర్గం... హేతుబద్ధీకరణ పేరిట లేదా విద్యాపరమైన భారాన్ని తగ్గించడం, తీవ్ర ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులకు కాస్త ఉపశమనం కలిగించడం పేరిట ఈ చర్యను చట్టబద్ధం చేసింది.

అయితే, ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాలపై చర్చ తరగతి గది కమ్యూనికేషన్ నిజవాస్తవికతను మర్చిపోతున్నట్లు కనిపిస్తోంది. అవును, ఈ చర్చలో, జ్ఞాన విషయాలను నిర్వచించి, తీర్చిదిద్దడానికి హిందుత్వం దాని ఆధిపత్యపు త్వరిత లక్షణం వేగంగా పెరుగుతుండటంలోని ఆసక్తికరమైన ప్రతిఫలనాలను చూశాం. వీటన్నింటికి మించి, మన పిల్లలు ఏది నేర్చుకోవాలి, ఏది నేర్చుకోకూడదు అనే అంశాన్ని కొత్త బాస్‌లు నిర్ణయించే అధికారం కలిగి ఉన్నందున, అతి జాతీయవాద సిద్ధాంతకర్తలు ఉదారవాద వామపక్ష చరిత్రకారులను, సామాజిక శాస్త్రజ్ఞులను పక్కకు పెడుతున్న అధికార మార్పిడి పర్యవసానాలను కూడా అనుభూతి చెందాం.

తమతమ రాజకీయ దృక్పథాలు ఏవైనప్పటికీ మన అకడమిక్ బాస్‌లు కిక్కిరిసిపోయిన తరగతి గదుల్లో బోధన, అభ్యాసానికి చెందిన మూసపోత చర్యపై తగినంత శ్రద్ధ పెట్టలేదని అంగీకరించడానికి తగినంత నిజాయితీని మనం కలిగివుండాలి. నిజానికి, పాఠశాల అధ్యాపకులు కేవలం మధ్యవర్తుల పాత్రకు పరిమితమయ్యారు. టీచర్లు చెప్పేదేమీ ఉండదు, వారి విద్యార్థులు కూడా ఖాళీ పాత్రల్లాగ ఉండిపోతున్నారు. పైగా, పాఠ్యపుస్తకాల స్వభావాన్ని ప్రతిఫలించే కరిక్యులమ్ రూపకల్పనలో లేదా తగిన బోధనా కళను వికసింప చేయడంలో ఎలాంటి కీలకపాత్రను పోషించడానికి కూడా వారిని ప్రోత్సహించడం లేదు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు, స్కాలర్లు, ఉదార వాద మేధావులు వంటి పెద్ద హోదాకలిగిన వారు లేదా వర్తమాన భారత్‌లో మితవాద సిద్ధాంతకర్తలు పాఠశాల కరిక్యులమ్‌లో దేనిని పొందుపర్చాలనే విషయాన్ని నిర్ణయిస్తున్నారు.

పాఠంలో పొందుపర్చిన జ్ఞాన గుళికను విద్యార్థులకు అందించడం కంటే మించిన పాత్ర టీచర్‌కి ఏమీ లేదని భావిస్తున్నారంటే ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు. ఘనీభవించిపోయిన పదాలను కంఠస్థం చేసే కళలో విద్యార్థులు నైపుణ్యం సాధించేలా చేయాలని టీచర్లను కోరుతున్నారు. వల్లె వేయడం కంటే మరే ప్రాధాన్యతా లేని, ఏమాత్రం కల్పనాశక్తి లేని సమాధానాలను వారిచేత రాయించాలని మాత్రమే సూచిస్తున్నారు. పైగా, పాఠ్యపుస్తక నిరంకుశత్వం (లేదా వ్యూహాత్మక ఎంపికలాగా, గైడ్ బుక్స్) ఏది విలువైన బోధనో నిర్వచిస్తున్నప్పుడు, సిలబస్‌కి వెలుపల మరేదీ లేనప్పుడు, అధ్యాపక సృజనాత్మక వ్యవస్థ మెల్లగా కృశించిపోవడానికే దారితీస్తుంది.



అంతకుమించి, బ్రెజిలియన్ విద్యావేత్త పాలో ఫ్రియరీ చెప్పినట్లుగా, విద్యను ప్రధానంగా అధికారిక సిలబస్‌పై ఆధారపడిన పరీక్షలతో సమానం చేసి చూసే వ్యవస్థ... సమస్యలను ఎత్తిచూపే విద్యగా ఉంటుంది. ఇది విద్యా కళను ప్రాక్టీస్ చేసే టీచర్లను, విద్యార్థులను ప్రేరణా రహితులుగా చేస్తుంది. అందుచేత మహాత్మాగాంధీని చంపిన నాథూరాం గాడ్సే రాజకీయాలను యువ అభ్యాసకులు తెలుసుకోకూడదని మెరుగులు దిద్దిన ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకం భావిస్తున్నట్లయితే దాన్ని అలాగే చేయనివ్వండి. టీచర్, విద్యార్థి ఇరువురూ పాఠాన్ని దాటి తదుపరి విచారణ, పరిశీలనకు ప్రయత్నించి, ఆ పుస్తకం 'పవిత్రత'ను వివాదాస్పదం చేయడం, పాఠం దాచి పెట్టిన విషయం ఏమిటని చూడవలసిన అవసరం ఏమిటి? ఉదాహరణకు, ఎమర్జెన్సీ బీభత్సం, 2002 గుజరాత్ అల్లర్లు రేపిన హింసాకాండ, అభివృద్ధికీ, నిరాశ్రయులకూ సంబంధించిన సమస్య, నర్మదా బచావ్ ఆందోళన లేవనెత్తిన పర్యావరణ సమస్య వంటి సిలబస్‌కు వెలుపల ఉన్న వాటిని తెలుసుకోవడానికి వారెందుకు ఆరాటపడాలి?

పాఠ్యపుస్తకాలపై మితవాద దాడిని విమర్శించడానికి చాలా కారణాలు ఉంటున్నప్పటికీ, మన క్లాసు రూమ్‌లలో పరావర్తన రహిత, సంభాషణకు తావులేని ప్రస్తుత విద్యాభ్యాసంలో రొమిల్లా థాపర్, కృష్ణకుమార్ వంటి విద్యావేత్తల దృక్పథాలను ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చినప్పటికీ, వాటిని మౌలికంగా మార్పులకు గురిచేయవచ్చు. నిజానికి, ఎమ్సిక్యూ(బహుళైచ్ఛిక)–కేంద్రక ప్రామాణీకృత పరీక్షల యుగంలో లేదా బోర్డు పరీక్షల్లో 99 శాతం మార్కుల సాధనకోసం మానసిక ఒత్తిడి ఉంటున్న యుగంలో ప్రతి ఒక్కటీ తలకిందులుగా మారుతుంది. పాబ్లో నెరూడా లేక కమలా దాస్ కవిత్వం, లేదా ఆర్కే లక్ష్మణ్ కార్టూన్ వంటి వాటిని బోధనా సాధనంగా చేసినప్పటికీ అవి కేవలం రెండు మార్కుల ప్రశ్నగా మాత్రమే కుదించబడతాయి. వల్లె వేసే విద్యాభ్యాసం ద్వారా అవి సత్వరం వినియోగమయ్యే సరుకులుగా మారతాయి. ఒక విషయాన్ని అంగీకరించాలి. చింతనాపరులు, సమర్థులైన పరిశోధక విద్యార్థులు లేదా సృజనాత్మక మనస్సులతో పనిలేకుండా యాంత్రికంగా టాపర్ల ఉత్పత్తిని ఆరాధించే వ్యవస్థ ఇక్కడ ఉంది.

బోధనా వృత్తిలో, ప్రత్యేకించి పాఠశాల బోధనా వృత్తిలో నిజంగా స్ఫూర్తికలిగిన వ్యక్తులను రూపొందించడం, రిక్రూట్ చేయడం గురించి ఎవరు పట్టించుకుంటున్నారు? సృజనాత్మకంగా సూక్ష్మ విమర్శనాత్మక బోధన అభ్యాసం గురించి, గాంధీ లేదా సావర్కర్, ఔరంగజేబ్ లేదా శివాజీపై వామపక్ష లేదా మితవాద పక్ష పాఠాల విషయాలను దాటి చూడటానికి సాహసమున్న వారి గురించి ఎవరు పట్టించుకుంటున్నారు?

దీనికి బదులుగా, టీచర్స్‌ని ప్రోత్సహిస్తూ, ప్రతి పిల్లాడినీ ప్రభావితం చేసే సంభావ్యతను, ఉద్ధరణ వాద విద్యలోని సంభాషణ, సంక్లిష్ట చింతన ప్రభావాన్ని విశ్వసించే వ్యవస్థ కోసం మనం ప్రయత్నించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులు, టీచర్లు సంభాషిస్తూ, చర్చించుకుంటూ, అధికారిక సిలబస్‌ను దాటి చూసేటటువంటి సజీవమైన, శక్తిమంతమైన తరగతి గదిని ఊహించుకోండి. భగత్ సింగ్ డైరీని చదవమంటూ ఎనిమిదవ తరగతి విద్యార్థులకు చెబుతున్న టీచర్‌ని, 1947–48లో గాంధీ ప్రార్థనల సమావేశాలపై వ్యాసం రాయాలని కోరే టీచర్‌ని, లేదా మాంటో రాసిన కథనాన్ని ప్రతిఫలింపజేయాలంటూ కోరుతున్న టీచర్‌ని మీరు ఊహించుకోండి. లేదా, స్కూల్ లైబ్రరీ నుంచి రస్కిన్ బాండ్, ఆర్కే నారాయణ్ పుస్తకాలను తీసుకుంటున్న 7వ తరగతి యువ విద్యార్థిని ఊహించుకోండి. తమ సాహిత్య సృజనలపై చర్చ ప్రారంభించాలంటూ హైయర్ టీచర్‌ని కోరుతున్న విద్యార్థినీ విద్యార్థినులను ఊహించుకోండి. ఇది పాఠ్య పుస్తకాన్ని (మేటి రచయితలు రాసినవైనప్పటికీ) కేవలం ఉత్ప్రేరకంగా మాత్రమే చూస్తూ, తర్వాత దాన్ని దాటి పోవడం అన్నమాట! ఈ సృజనాత్మకమైన కీలకమైన ఫ్యాకల్టీని బలోపేతం చేసిన తర్వాత ప్రశ్నించే, విచారణ చేసే, సిలబస్‌ని దాటి చూసే మేధా, జ్ఞాన సామర్థ్యాన్ని పిల్లలు సహజంగా అభివృద్ధి చేసుకుంటారు.

అర్థవంతమైన విద్య గురించి, మన పిల్లల భవిష్యత్తు గురించి మనం నిజాయితీగా ఆలోచిస్తున్నట్లయితే, ఎన్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాల అధికారంపై వామపక్షవాదుల, మితవాదుల మధ్య రాజకీయ–సైద్ధాంతిక ఘర్షణను దాటి సమస్యను చూడాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త సోషియాలజిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### దోసె దోశం



దోసె తిందామని రెస్టారెంటుకు వెళ్లాను. రెండు దోసెలకు బిల్లు ఇవ్వడం చూసి ఆశ్చర్యపోయాను. వెయిటర్‌ను అడిగితే, టేబుల్‌కు అటుపక్కన కూర్చున్న వ్యక్తి నాతో కలిసి వచ్చానని చెప్పి మసాలా దోసె తీసుకున్నాడని తెలిసింది. బిల్లు వచ్చేలోగా అతడు వెళ్లిపోయాడు.

– అరుణ్ బోత్రా, పోలీస్ అధికారి

### తీవ్ర దేశం



పాకిస్తాన్‌లోని మదరసాల సంఖ్య: 40,000. విశ్వవిద్యాలయాల సంఖ్య: 218. ఫలితం: సాయుధ మతగురువులు, తీవ్రభావాల ప్రజలు, హింసాత్మక అతివాదం, మూక దాడులు, బలవంతపు మతమార్పిడులు, ప్రాణభయంలో మైనారిటీలు.

– సయ్యద్ ముజమ్మిల్ షా, రాజకీయ విశ్లేషకుడు

### ద్వంద్వ ప్రమాణాలు



పరిహాసం ఏమిటంటే- వాస్తవాల మీద ఆధారపడిన 'బీబీసీ డాక్యుమెంటరీ'ని నిషేధించాలని కోరినవాళ్లే, వాస్తవాలు లేని 'ద కేరళ స్టోరీ'ని నిషేధిస్తే బాధపడుతున్నారు.

– అర్ఫీ అల్వీ, కవయిత్రి

### ఎలా దిగజారింది!



బెంగాల్ 'ద కేరళ స్టోరీ'ని నిషేధించింది, నా పాత పుస్తకం 'ద్విఖండితో'ను నిషేధించింది. ఒకప్పుడు బెంగాల్ ప్రగతిశీల రాష్ట్రం. అది ఎందరో కళాకారులు, రచయితలు, మేధావులకు జన్మనిచ్చింది. ఇప్పుడు బెంగాల్ అత్యంత ఛాందస రాష్ట్రం. అది భావస్వేచ్ఛకు వ్యతిరేకం.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

### బతికే మార్గాలు



ఏ మతమూ శాస్త్రీయం కాదు. ఏ మతమూ శాస్త్రీయంగా ఉండాల్సిన పనిలేదు. హిందూయిజం, క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధం, సిక్కు, జైన, జుడాయిజం- ఏవీ శాస్త్రీయం కాదు. కానీ అవి మన జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాల్లో భాగం. వాటిని అలాగే చూడాలి. ఇది అర్థం కాకపోవడానికి ఇదేమీ క్వాంటమ్ ఫిజిక్సో, రాకెట్ సైన్సో కాదు.

– రాహుల్ ఈశ్వర్, రచయిత

### నమలడం ఆపాలి



చూయింగ్ గమ్ ప్రతి ఏటా లక్ష టన్నుల ప్లాస్టిక్ కాలుష్యానికి కారణం అవుతోంది. అది దంతక్షయాన్ని కూడా కలిగించవచ్చు. మా నగరం మిలాన్ (ఇటలీ) సైడ్‌వాక్స్ నమిలి ఊసిన చూయింగ్ గమ్స్ వల్ల నాశనం అయ్యాయి. వీటిని నిషేధించిన సింగపూర్‌ను మిగతా ప్రపంచం ఉదాహరణగా తీసుకోవాలి.

– అలెసాండ్రియా బొక్కి, జర్నలిస్ట్

### పాతరేశారు



పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అనాగరిక అరెస్టు వల్ల ఇదివరకే పాకిస్తాన్‌లో చచ్చిపోయివున్న ప్రజాస్వామ్యాన్ని గొయ్యితీసి పూడ్చిపెట్టినట్టయింది.

– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

ఇన్‌బాక్స్

## కరోనా బలహీనం!?

ప్రపంచ ఆరోగ్య సంస్థ కరోనా 'ఇక ఎమర్జెన్సీ అనారోగ్యం కాదం'టూ ప్రకటించడం విశేషం. దాదాపు మూడేళ్లకు పైగా ప్రపంచ స్థాయి అత్యయిక వ్యాధిగా కోరలు చాచి దేశాలను వణికించిన కరోనా తన స్థాయిని కోల్పోవడం మానవ విజయం. అయితే కోరలు పదును కోల్పోయినా ముప్పు పూర్తిగా తప్పిపోలేదని గుర్తించడం ఆవశ్యకం. కరోనా తన మహమ్మారి హోదాని కోల్పోవక పోవడం గమనార్హం. ధనిక, పేద దేశాల తారతమ్యం లేకుండా లక్షలాది ప్రాణాల్ని తోడేసిన కరోనా కోట్లాది కుటుంబాలను రోడ్డున పడేసింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. అలలు అలలుగా విజృంభించి ఎప్పటికప్పుడు రూపాలు మార్చుకుంటూ ఈ వైరస్ విస్తృతంగా వ్యాపించి ప్రజారోగ్య వ్యవస్థను కుప్పకూల్చింది.

అయితే మన దేశం సహా అగ్రదేశాలు దీటుగా స్పందించి త్వరితంగా దాని తీవ్రతను తగ్గించగలిగాయి. రానురాను వైరస్‌లో వచ్చిన మార్పులు కూడా ప్రమాద రహితంగా దాన్ని మార్చాయి. పరిస్థితులను ఎప్పటికప్పుడు బేరీజు వేస్తున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ కరోనాను ప్రమాదకారి కాదని తేల్చడం తాత్కాలికమైన ఊరట. ఎందుకంటే ఆ వైరస్‌లో వస్తున్న మార్పులు ప్రతీసారీ ప్రమాద రహితంగా ఉండనక్కరలేదు. ఆకస్మికంగా ప్రమాదకారి కావొచ్చు. అందుకనే గతంలో నేర్చిన పాఠాలను వివిధ దేశాల ప్రభుత్వాలు, ప్రజలు మరవరాదు. ప్రజారోగ్య వ్యవస్థను పటిష్ఠం చేసి, సన్నద్ధం గానే ఉండాలి. ఆ కేసుల సంఖ్యపై, అవి పెరిగే వేగంపై, తీవ్రతపై సరైన అవగాహనతోనే ఉండాలి. ప్రజలు కూడా అవసరమైన చోట మాస్కులు వాడడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం కొనసాగించాలి. వృద్ధులు, ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారు శ్వాస సంబంధిత లక్షణాలు కనబడితే మరింత జాగ్రత్త పడాలి. కరోనాపై యుద్ధంలో పైచేయి సాధించిన మానవాళి దాన్ని 'మట్టి కరిపించాం' అని ప్రకటించడానికి ఇంకా సమయం ఉంది. బలహీన పడ్డ మహమ్మారిపై ఓ కన్నేసి ఉంచడంతో ముప్పు తప్పుతుంది.

– డా. డి.వి.జి. శంకర రావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

# పోలవరం కల త్వరలోనే సాకారం

అభిప్రాయం



కొవ్వూరి త్రినాథరెడ్డి

బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఒప్పించి ధవళేశ్వరం వద్ద గోదావరి నదిపై 1847లో మొదలు పెట్టి 1952 నాటికి ఆనకట్టను పూర్తిచేసి గోదావరి జిల్లాల ప్రజలకు దేవుడయ్యాడు సర్ ఆర్థర్ కాటన్. అప్పుడే ఈ బ్యారేజీకి ఎగువన 50 సంవత్సరాల తర్వాత ఒక రిజర్వాయర్ కట్టుకోకపోతే ఈ డెల్టా పూర్వపు స్థితికి చేరుకొని పంటలకు నీరందడం కష్టంగా మారుతుందని చెప్పిన దార్శనికుడు కాటన్. అప్పటి నుండి పోలవరం దగ్గర రిజర్వాయర్ నిర్మాణం కోసం మద్రాసు ప్రభుత్వ కాలం నుంచీ ప్రయత్నాలు జరిగాయి. ఎంతోమంది సీఎంలు శంఖు స్థాపన రాళ్ళు వేసినా పోలవరం ప్రాజెక్టు ముందుకు సాగలేదు.

2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి అకుంఠిత దీక్షతో కేంద్రం నుండి అన్ని అనుమతులు తెచ్చి పోలవరం నిర్మాణాన్ని ముందుకు ఉరికించారు. సుమారు రూ. 5400 కోట్లు ఖర్చు పెట్టి కుడి, ఎడమ కాలువలకు భూమి సేకరించి, కాలువలను తవ్వించారు. దురదృష్టవశాత్తు 2009లో ఆయన అకాల మరణం పొందడంతో తరువాత వచ్చిన ప్రభుత్వాలు అరకొర పనులతో సరిపెట్టాయి. 2014లో వచ్చిన ప్రభుత్వం ప్రాజెక్టు పని ఎప్పుడు ఏది చెయ్యాలో తెలిసినా, పోలవరం ప్రాజెక్టు అథారిటీ చెప్పినా వినకుండా వారి సొంత లాభం కోసం ప్రాజెక్టుని ఏటీఎమ్‌లా వాడుకున్నారని స్వాక్షాత్తు ప్రధానమంత్రి అనడం ప్రాజెక్టులో అవినీతి ఏ రకంగా జరిగిందో అర్థమవుతుంది. 72 శాతం ప్రాజెక్టు పూర్తి చేశామని చెప్పడం హాస్యాస్పదం.

వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత తండ్రి ఆశయాన్ని నెరవేర్చడం కోసం పోలవరం నిర్మాణాన్ని శరవేగంగా నడిపిస్తున్నారు. ఒక రోజు కూడా పని మానకుండా చేసి స్పిల్‌వే నిర్మాణాన్ని పూర్తిచేశారు. అయితే గత ప్రభుత్వం స్పిల్‌వే పూర్తికాకుండానే పైన, కింద కాఫర్ డ్యామ్‌లు కట్టడం, తరువాత వచ్చిన వరదలకు కాఫర్ డ్యామ్‌పై ఉన్న గ్రామాలు మునిగిపోతుంటే కాఫర్ డ్యామ్‌కు అటుఇటు గ్యాప్‌లివ్వటం వలన అప్పర్ లోయరు కాఫర్ డ్యామ్‌ల మధ్యన 25 నుంచి 30 మీటర్ల లోతు గుంతలు పడ్డాయి. దీంతో మెయిన్ డ్యామ్ అడుగు భాగంలో గత ప్రభుత్వం నిర్మించిన డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. దానివల్ల ప్రాజెక్టు చాలా ఆలస్యం జరుగుతోంది.



ఇలాంటి పరిస్థితి ప్రపంచలో ఎక్కడా ఏ ప్రాజెక్టుకీ ఎదురుకాలేదు. ప్రాజెక్టు 72 శాతం పూర్తి చేశామని చెప్పుకుంటున్న గత ప్రభుత్వ పెద్దలు ఆడుతున్న అబద్ధాలకు అంతులేదు. గత ప్రభుత్వం హయాంలో 55 వేల కోట్ల నిర్మాణ వ్యయాన్ని నిర్ధారించినవారు 72 శాతం పూర్తి చేశామంటున్నారు కదా. అయితే ఇక 28 శాతం పనులే మిగిలి ఉన్నాయనేకదా అర్థం. వైసీపీ ప్రభుత్వం ఇప్పటికి దాదాపు 19 వేల కోట్లు ఖర్చు పెట్టింది. ఇంకా పనులు మిగిలే ఉన్నాయి. గత ప్రభుత్వ పెద్దలు చెప్పిన ప్రకారమైతే రూ. 15 వేల కోట్లు ఖర్చు పెడితే మొత్తం ప్రాజెక్టు పూర్తి అయిపోవాలి కదా? మరి రూ. 15 వేల కోట్లతో పోలవరం పూర్తి అవుతుందా? దీనికి సమాధానం టీడీపీ పెద్దలే చెప్పాలి.

పోలవరం ప్రాజెక్టు హెడ్ వర్క్స్‌లో చంద్రబాబు హయాంలో శిఖరాగ్ర స్థాయిలో జరిగిన అస్తవ్యస్త పనుల కారణంగా రెండు కాఫర్ డ్యామ్‌ల మధ్యలో ఏర్పడిన విధ్వంసకర స్థితిని సరిదిద్దేందుకు ఇటీవల పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ నేతృత్వంలో ఎన్‌హెచ్‌పీసీ సిఫార్సులు చేసింది. వాటిని అనుసరించి ప్రధాన ఆనకట్ట ప్రాంతంలో పనులు చేపట్టిన జగన్ ప్రభుత్వం... శరవేగంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి అన్ని చర్యలూ తీసుకుంటోంది.

జగన్ చిత్తశుద్ధితో ఈ ప్రాజెక్టు ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలన చేసి నిర్మాణాన్ని చేయిస్తున్నారనడంలో సందేహం లేదు. గత సీఎం లాగా 'వారం వారం పోలవరం' అని డంబాలు కొట్టుకోవడం లేదు. కేంద్రం సహకరించినా, సహకరించకపోయినా సర్ ఆర్థర్ కాటన్ ధ్యేయాన్నీ, వైఎస్ రాజశేఖరరెడ్డి కలనూ, గోదావరి రైతుల చిరకాల కోరికనూ నెరవేర్చుతూ... పోలవరం నిర్మాణాన్ని పూర్తి చేయడటం ఖాయం.

వ్యాసకర్త కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ రైతు విభాగం
మొబైల్: 94402 04323

## కడుపే కైలాసం

లోక వ్యవహారంలో 'కడుపే కైలాసం' అనే సామెత ఒకటి వినిపిస్తుంది. 'మనిషికి అన్నిటికంటే ముఖ్యమైన పని వీలైనన్ని రుచికరమైన పదార్థాలతో కడుపు నింపుకోవడం. ఆధ్యాత్మికంగా కైలాసం, వైకుంఠం ఇలాంటి ధ్యాసలు అనవసరం. ఇంద్రియ చాపల్యాలను తృప్తి పరచటమే జీవన పరమార్థం. శరీర సుఖాలే సర్వస్వం' అనే సంకుచిత భావంతో, భౌతిక విషయాలలో మాత్రమే మితి మీరిన ఆసక్తి ప్రదర్శించే వాళ్ళను, 'వాళ్ళకు కడుపే కైలాసం' అన్న జాతీయంతో ఈసడించటం లోకంలో కనిపిస్తుంది.

పూర్వకాలంలో అనేక కారణాల చేత, ఎప్పుడూ ఇంటిపనులూ, వంటపనులూ చూసుకుంటూ కాలం పుచ్చటం తప్ప తీర్థయాత్రలు వగైరాలు చేసే అవకాశాలే రాని వాళ్ళు, 'ఈ జన్మకు నేను ఎక్కడికీ వెళ్లగలిగింది లేదు. కాశీకి వెళ్లలేను, రామేశ్వరం చూడలేను. నాకు ఈ ఇల్లే వైకుంఠం, కడుపే కైలాసం. మరో తీర్థం, క్షేత్రం చూసేందుకు నేను నోచుకోలేదు' అని వాపోవటం వినిపించేది. ఇదొక వాడుక.



జ్యోతిర్మయం

నిజానికి, 'ఇల్లే వైకుంఠం, కడుపే కైలాసం' అనే జాతీయానికి శతాబ్దాల తరబడి వస్తున్న వాడుకలో, ఇంతకంటే ఉన్నతమైన ఉదాత్తమైన అర్థం ఇంకొకటి ఉంది.

'కేదారాది సమస్త తీర్థముల కోర్కిన్ చూడబోనేటికిన్?– కేదారనాథ్, కాశీ ఇత్యాది సమస్త పుణ్య క్షేత్రాలకు అంత ఆరాటపడి పోవటం ఎందుకు?– అని ప్రశ్నిస్తుంది కాళహస్తీశ్వర శతకం. 'కాదా ముంగిలి వారణాసి, కడుపే కైలాస శైలంబు? మీ / పాద ధ్యానము సంభవించునపుడే... శ్రీ కాళహస్తీశ్వరా' అని ఆ పరమ శివుడిని అడుగుతుంది. "స్వామీ, భక్తి తత్పరతతో మీ పాద ధ్యానం చేసే భక్తుడు మిమ్మల్ని తన హృదయంలో సాక్షాత్కరింప జేసుకొంటాడు గదా! మీరు సాక్షాత్కరిస్తే మీ కాశీ నగరం కూడా మీతో పాటు వచ్చి అతడి ముంగిట్లో నిలిచి ఉన్నట్టే! మీతో పాటు మీ నివాసమైన కైలాస శిఖరం కూడా ఆ భక్తుడికి హృదయగతమై ఉంటుంది' అంటాడు ధూర్జటి కవి. అటువంటి భక్తుడికి ఇక ప్రత్యేకంగా పుణ్యక్షేత్రాలకు వెళ్లవలసిన పని ఉండదు.

– ఎం. మారుతి శాస్త్రి

## బాలుడి కిడ్నాప్‌నకు యత్నం

- నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు
- చిత్తూరు జిల్లా కుప్పం మండలం, రామ్‌నగర్‌లో ఘటన

**కుప్పంరూరల్ (చిత్తూరు జిల్లా):** బాలుడిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన చిత్తూరు జిల్లా కుప్పం మండలం, రామ్‌నగర్‌లో మంగళవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం... కుప్పం మండలం, రామ్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్, దీపలకు కుమారుడు వైభవ్(4) ఉన్నాడు. చంద్రశేఖర్ ఆరోగ్యం సక్రమంగా లేకపోవడంతో దీప, వైభవ్‌లతో కలిసి పీఈఎస్ వైద్య కళాశాలకు వెళ్లారు. చంద్రశేఖర్, దీప పరీక్షలు చేయించుకునే పనిలో ఉన్నారు. ఇది గమనించిన తమిళనాడు రాష్ట్రం బాగలూరుకు చెందిన విజయ్‌కుమార్ బాలుడు వైభవ్‌ను తనతో తీసుకుని వెళ్లిపోతున్నాడు. ఆస్పత్రికి వచ్చిన రామ్‌నగర్ గ్రామస్తులు గమనించి విజయ్‌కుమార్ వెంటపడి పట్టుకున్నారు. బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చి, కిడ్నాపర్‌ను గుడుపల్లె పోలీసులకు అప్పగించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

## సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

**పరవాడ(అనకాపల్లి జిల్లా):** సింహాద్రి ఎన్టీపీసీలో 1, 3, 4 యూనిట్లను ఇటీవల అండర్ రిజర్వ్ షట్‌డౌన్ చేసిన విషయం తెలిసిందే. వాటిలో మూడో యూనిట్‌లో మంగళవారం మధ్యాహ్నం విద్యుదుత్పత్తిని పునరుద్ధరించారు. మొదటి యూనిట్‌ను మంగళవారం అర్ధరాత్రి లైటాప్ చేస్తారని సంస్థ అధికారులు తెలిపారు. నాలుగో యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తిని పునరుద్ధరించడానికి కొంత సమయం పట్టవచ్చని పేర్కొన్నారు. రెండో యూనిట్ ద్వారా 500 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్న విషయం తెలిసిందే.

## మహిళ పొట్టలో 13 లీటర్ల నీటి తిత్తి తొలగింపు


వెలికితీసిన నీటి తిత్తి

**మైసూరు:** మహిళ పొట్టలో ఏర్పడిన సుమారు 13 లీటర్ల నీటి తిత్తిని మైసూరులోని ఒక కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. 45 ఏళ్ల మహిళ ఒకరు సుమారు రెండేళ్ల నుంచి కడుపు నొప్పితో బాధపడుతోంది. పడుకుంటే శ్వాస కూడా ఆడేది కాదు. ఆమె చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చారు. అక్కడ అల్ట్రా సౌండ్ స్కాన్ చేయగా ఫుట్‌బాల్ కంటే పెద్ద పరిమాణంలో నీటి తిత్తి ఏర్పడినట్లు గుర్తించారు. దీంతో ఆపరేషన్ చేసి ఆ తిత్తిని బయటకు తీశారు. అందులో సుమారు 13 లీటర్ల నీరు ఉన్నట్లు కనుగొన్నారు. మహిళ ఆరోగ్యం కుదుటపడడంతో డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ రమ్యకృష్ణ తెలిపారు.

# తిరుపతి గంగమ్మ జాతర మొదలైందహో..

## అర్ధరాత్రి నగర పొలిమేరల్లో ఆనవాయితీ ప్రకారం చాటింపు

- నేటి నుంచి 16వ తేదీ వరకు వైభవంగా జాతర
- తొలిరోజు బైరాగి వేషంతో జాతర ప్రారంభం
- అమ్మవారిని దర్శించుకున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

**తిరుపతి కల్చరల్:** ''ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.. తిరుపతి గంగజాతర చాటింపుతో నేటి నుంచి ప్రారంభమైంది. వారం రోజుల పాటు ఈ జాతర కొనసాగుతుంది. కనుక నగరవాసులెవరూ ఊరు వదలి వెళ్లరాదు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు రాత్రి పూట ఇక్కడ బస చేయకుండా వెళ్లిపోవాలి. జాతర ప్రారంభమైనందున అమ్మవారి అనుగ్రహం పొందేందుకు పూజలు నిర్వహించుకోవాలహో.'' అంటూ సంప్రదాయం ప్రకారం కైకాల వంశస్తులు తిరుపతి గంగజాతర మంగళవారం అర్ధరాత్రి తర్వాత చాటింపు వేశారు. భేరి వీధిలో తొలి చాటింపు పూజ నిర్వహించిన అనంతరం నాటి నగర శివారు ప్రాంతాలైన నాలుగు కాళ్ల మండపం, హెడ్‌పోస్టాఫీస్, కృష్ణాపురం ఠాణా, పాత మెటర్నిటీ ఆసుపత్రి సర్కిల్ ప్రాంతాల్లో అష్టదిగ్బంధనం చేసి చాటింపుతో జాతరకు శ్రీకారం చుట్టారు. ఆ చాటింపుతో తిరుపతి శ్రీతాతయ్యగుంట చిన్నగంగమ్మ (తిరుపతి గ్రామదేవత) జాతర అత్యంత వేడుకగా ఆరంభమైంది. భక్తకోటి కోర్కెలు తీర్చే కల్పవల్లి, తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర బుధవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనుంది.

### కొడిస్తంభానికి అభిషేకం, ఒడిబాలు సమర్పణ

జాతర ప్రారంభ సన్నాహకాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం 8 గంటలకు ఆలయ ఆవరణలోనున్న అమ్మవారి విశ్వరూప కొడిస్తంభానికి అర్చకులు అభిషేకం చేసిన అనంతరం కొడిస్తంభానికి ఒడిబాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయరెడ్డి హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని ఒడిబాలును నెత్తినపెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షిణతో కొడిస్తంభం వద్దకు చేరుకొని పూజలు చేసి ఆ ఒడిబాలు సమర్పించారు. ఆలయంలో అమ్మవారి మూలవిరాట్టుకు అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణలో కొలువు తీర్చారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి పొంగళ్ల నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, పాలక మండలి సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాలకగిరి ప్రతాప్‌రెడ్డి, ఆలయ అర్చకుడు రామకృష్ణ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.


గంగమ్మ ఆలయంలో అమ్మవారికి హారతి ఇస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ, చిత్రంలో ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి

### నేడు బైరాగి వేషం

గంగజాతర ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు బుధవారం బైరాగి వేషంతో జాతర ఆరంభమవుతుంది. బైరాగి వేషాలు వేసిన వారు గుంపులు గుంపులుగా బయలుదేరి మొదట వేషాలమ్మను, తర్వాత శ్రీతాళ్లపాక పెద్దగంగమ్మను దర్శించుకొని తర్వాత శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి చేరుకుంటారు. కేరింతలు కొడుతూ ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారి పాదాల వద్ద ప్రణమిల్లి మొక్కులు తీర్చుకుంటారు.

### శ్రీవారి ఆవిర్భావంతోనే గంగావతరణ: గణపతి సచ్చిదానందస్వామి

సాక్షాత్తు శ్రీమహావిష్ణువే ఏడుకొండలపై శ్రీవేంకటేశ్వరునిగా ఆవిర్భవించడంతోనే తిరుపతిలో గంగమ్మ వెలసిందని గురుదత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి తెలిపారు. మంగళవారం ఆయన శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగమ్మ ఆలయానికి చరిత్రతో పనిలేదని, అమ్మవారి మహిమలే చరిత్రకు ఆధారమన్న విషయాన్ని గుర్తించాలన్నారు. గ్రామదేవతగా అవతరించిన గంగమ్మ.. సాక్షాత్తు తిరుమల శ్రీవారి చెల్లెలుగా యావత్ భక్తకోటికి కల్పవల్లిగా విరాజిల్లుతోన్న మహిమాన్విత శక్తి స్వరూపిణి అని తెలిపారు. అమ్మవారి ఆలయం అద్భుత రాతి శిల్పాలతో నేడు నూతన ఆలయంగా పునఃప్రారంభించడం ఆ శ్రీవారు, అమ్మవారి కృపాకటాక్షాలేనన్నారు. ఈ అమ్మవారి విశిష్టత గురించి దేశ వ్యాప్తంగా ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇందులో తాము సైతం భాగస్వాములమవుతామన్నారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ విశిష్టత, వైభవాన్ని దశదిశలా చాటేందుకు వారం రోజుల పాటు ఈ గంగమ్మ ఆలయంలో ప్రవచనం అందిస్తానని తెలిపారు.

## రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబే అడ్డంకి

### 954వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



**తాడికొండ:** రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి చంద్రబాబు అడ్డుగా నిలిచి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సెస్ జంక్షన్ రోడ్డులో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 954వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. పేదల ఎదుగుదలకు చంద్రబాబే అడ్డంకి అని, తమకు రాజ్యాంగబద్ధ హక్కులు అందకుండా తప్పుడు కేసులు వేస్తున్న బాబు అండ్ కోను రాష్ట్రంలో తిరగనీయబోమని హెచ్చరించారు. రాజధాని అంటే తమ సామాజిక వర్గానికే సొంతం కావాలనే ఎత్తుగడతో బాబు చేస్తున్న అక్రమాలను ఎండగట్టేందుకే 954 రోజులుగా ఉద్యమం చేస్తున్నామన్నారు. తమపై దాడులకు ఉసిగొలిపి దళిత దళారులను అడ్డుపెట్టుకుని ఎల్లోమీడియాలో తప్పుడు ప్రచారాలకు దిగడం దుర్మార్గమని చెప్పారు. చంద్రబాబుపై ఉన్న కేసుల్లో స్టేలు ఎత్తివేసి పునర్విచారణ జరిపితే జైలు ఊచలు లెక్కపెట్టడం ఖాయమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం , సుభాషిణి, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, కొల్లి దాసు, బొలిమేర శామ్యూల్, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

## ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌లు


విద్యార్థులతో ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు

**నూజివీడు:** ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ విభాగానికి చెందిన ఏడుగురు క్యాడెట్లు జాతీయస్థాయి స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. అఖిల భారత స్థాయిలో క్యాడెట్ వెల్ఫేర్ సొసైటీ నుంచి ఏటా చదువులో ముందున్న ఎన్‌సీసీ క్యాడెట్‌లకు స్కాలర్‌షిప్‌ను అందజేస్తారు. ఈ ఏడాది నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన 17వ ఆంధ్రా బెటాలియన్ సీనియర్ విభాగం నుంచి ఏడుగురు క్యాడెట్‌లు రోహిత్ రాయల్, వి.వెంకట అను, సురేంద్ర, ప్రసాద్, వరప్రసాద్, గోపాల్, పి.రవిశంకర్ ఎంపికయ్యారు. సీఎస్సీ బ్రాంచ్‌కు చెందిన వీరికి ఈ ఏడాది క్యాడెట్ వెల్ఫేర్ సొసైటీ ఒక్కొక్కరికి రూ.6 వేలు చొప్పున స్కాలర్‌షిప్ కింద అందజేస్తుంది. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రదీప్, డీన్ లక్ష్మణరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ సీహెచ్ ఎస్ఆర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ పోర్టు చైర్మన్‌గా అంగముత్తు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న అంగముత్తు

**దొండపర్తి (విశాఖ దక్షిణ):** విశాఖ పోర్టు ట్రస్ట్ అథారిటీ నూతన చైర్మన్‌గా డాక్టర్ మథేయన్ అంగముత్తు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. 2027 వరకు ఆయన చైర్మన్‌గా కొనసాగనున్నారు. 2002 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన అస్సాం మేఘాలయా క్యాడర్ అధికారి. జాయింట్ సెక్రటరీ స్థాయిలో ఆయన పోర్టు ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

## ఆటోను ఢీకొన్న లారీ

### ఇద్దరు మృతి, మరో నలుగురికి తీవ్ర గాయాలు

**కశింకోట:** అనకాపల్లి జిల్లా కశింకోట వద్ద ఆగి ఉన్న ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో మంగళవారం ఇద్దరు దుర్మరణం చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. అదనపు ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు అందించిన వివరాల మేరకు.. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వేగంగా వస్తున్న లారీ కశింకోట బస్ స్టేషన్ ముందు జాతీయ రహదారిపై ఆగి ఉన్న ప్రయాణికుల ఆటోను వేకువజామున 5 గంటల ప్రాంతంలో వెనుకగా బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో పక్కనున్న జాతీయ రహదారి డ్రైనేజీపైకి దూసుకుపోయి బోల్తా పడింది. బయ్యవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శనివాడ తలుపులరాజు (32), ఆటో ఎక్కుతున్న కశింకోటలోని ఇందిరా కాలనీకి చెందిన మునగపాక లక్ష్మి (52) అక్కడికక్కడే మృతి చెందారు. బయ్యవరం గ్రామానికి చెందిన మామిడి లక్ష్మి, గుర్రం దుర్గునాయుడు, ధనలక్ష్మి, చలపురెడ్డి సత్యవతి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108లో అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు లక్ష్మి కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

## సీఐతో ఎమ్మెల్యే నిమ్మల దురుసు ప్రవర్తన

### పాలకొల్లులో అనుమతిలేని కార్యక్రమాన్ని అడ్డుకున్నందుకు ఆగ్రహం


సీఐని ఏకవచనంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు

**పాలకొల్లు సెంట్రల్:** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో స్థానిక టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మంగళవారం సీఐ, పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. అనుమతిలేని కార్యక్రమాలు నిర్వహించరాదని అడ్డుకున్న సీఐని ఏకవచనంతో సంబోధించడమేగాక మా ఇష్టం వచ్చింది చేసుకుంటామంటూ మాట్లాడారు. రైతుల సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తామని ఎమ్మెల్యే పోలీసులకు తెలిపారు. ఎమ్మెల్యే నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ తదితరులు తహసీల్దారు కార్యాలయం వద్దకు వచ్చారు. టీడీపీ నేతలు తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న చెట్టు కొమ్మలను విరగ్గొట్టి రైతుకు ఉరి అనే నినాదంతో రెండు కర్రలను ఏర్పాటు చేసి చెట్టుకు కట్టారు. ప్లకార్డులు, ఉరితాళ్లతో నిరసన తెలిపేందుకు సిద్ధపడ్డారు. దీన్ని పట్టణ సీఐ డి.రాంబాబు అడ్డుకున్నారు. వినతి పత్రం ఇస్తామని అనుమతి తీసుకుని ఈ కార్యక్రమాలు చేయడమేమిటని ప్రశ్నించారు. దీంతో ఎమ్మెల్యే నిమ్మల పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐ రాంబాబునుద్దేశించి.. నీకు సంబంధం ఏమిటి? మా ఇష్టం వచ్చింది చేసుకుంటాం. రోడ్డుపై ఏది చేసుకున్నా నీకు అనవసరం. నీ తహసీల్దార్ కార్యాలయంలో చేస్తే నువ్వు ప్రశ్నించు.. అంటూ మాట్లాడారు. దీనిపై సీఐ స్పందిస్తూ.. సార్ నేను గౌరవంగా మాట్లాడుతున్నాను.. మీరు మర్యాదగా మాట్లాడండి.. అని సూచించారు. దీంతో మీ మంత్రి రైతులను ఉద్దేశించి ఎర్రిపప్ప అన్న మాటలకు మాకు బాధేసింది అంటూ ఎమ్మెల్యే టాపిక్‌ను డైవర్ట్ చేసేందుకు ప్రయత్నించారు. సీఐ ఆధ్వర్యంలో పోలీసులు ఉరితాళ్లను తొలగించారు. అనంతరం టీడీపీ నేతలు తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోకి వెళ్లి అక్కడున్న ఆర్డీవో దాసి రాజుకు వినతిపత్రం అందజేశారు.

## వరికుచ్చుల మహాలక్ష్మి కన్నుమూత

### వరికుచ్చులు అల్లడంలో నేర్పరి • 50 ఏళ్లుగా మూగప్రాణుల సేవకు అంకితం


మహాలక్ష్మి (ఫైల్)

**కడియం:** దాదాపు 50 సంవత్సరాలుగా మూగ ప్రాణులకు ఎనలేని సేవలు చేసిన పెనుమాక మహాలక్ష్మి (73) మంగళవారం కన్నుమూశారు. తూర్పుగోదావరి జిల్లా కడియంకు చెందిన ఆయన వరిచేలల్లో కంకులు సేకరించి తీసుకువచ్చి తన ఇంటి సమీపంలో ఉన్న రామాలయం వద్ద కుచ్చులుగా తయారు చేసేవారు. ఆ కుచ్చులను ఆలయాలు తదితర చోట్ల కట్టేవారు. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి వరి కుచ్చులు తయారు చేయమంటే ఎంతిస్తే అంత తీసుకుని వాటిని తయారు చేసి ఇచ్చేవారు. కుటుంబం మొత్తం వ్యవసాయ కూలీలుగా పనిచేసేవారు. మహాలక్ష్మి మాత్రం వరి కుచ్చులు తయారు చేసి పక్షులకు ఆహారంగా పెడుతుండేవారు. పక్షులకు మనం కాకపోతే ఎవరు పెడతారయ్యా.. అంటూ మూగప్రాణులపై తన ప్రేమను వ్యక్తం చేసి పదిమందికీ స్ఫూర్తిగా నిలిచేవారు. ఆయన సేవా దృక్పథం, వరి కుచ్చులు కట్టడంలో నైపుణ్యం చూసి మీడియాలో సైతం పలు కథనాలు ప్రచురితమయ్యాయి. తెలంగాణ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పుస్తకంలో కూడా మహాలక్ష్మి సేవలను పాఠ్యాంశంగా చేర్చారు. ఆయన సేవలకు మెచ్చి గ్రామస్తులు ఘన సత్కారం చేశారు. పదేళ్ల కిందటే మహాలక్ష్మి భార్య మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

## మాదక ద్రవ్యాల బారి నుంచి యువతకు విముక్తి

- దేశంలో 3.12 కోట్ల మంది.. వీరిలో 2.06 కోట్ల మంది మహిళలకు కూడా..
- నషా ముక్త్ భారత్ అభియాన్ కింద చర్యలు
- 372 జిల్లాల్లో 8,000 యువ వలంటీర్లతో కమ్యూనిటీ ఔట్‌రీచ్ నిర్వహణ
- 10–17 ఏళ్లలోపు 86 లక్షల మంది యువత మాదకద్రవ్యాల వినియోగం
- 10–75 ఏళ్లలోపు 52.59 లక్షల మంది మహిళలు వినియోగం
- యువత డ్రగ్స్ బారిన పడకుండా తరచూ అవగాహన
- మూడేళ్లలో 1.24 లక్షల కేసులు.. 1.30 లక్షల మంది అరెస్టు
- 2018లో నిర్వహించిన సర్వేలో తేలినట్లు కేంద్ర హోంశాఖ వెల్లడి

**సాక్షి, అమరావతి:** దేశంలో మాదక ద్రవ్యాల బారి నుంచి యువత, మహిళలకు విముక్తి కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తున్నాయని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. జాతీయ స్థాయిలో నషా ముక్త్‌భారత్ అభియాన్ కింద మాదక ద్రవ్యాల వినియోగం నుంచి యువతను, మహిళలను దూరం చేయడానికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని తెలిపింది. దీని కింద దేశంలో అత్యధికంగా మాదక ద్రవ్యాలు వినియోగించే 372 జిల్లాల్లో 8,000 మంది యువ వలంటీర్ల ద్వారా పెద్దఎత్తున కమ్యూనిటీ ఔట్‌రీచ్ నిర్వహించినట్లు తెలిపింది. తద్వారా 3.12 కోట్ల మంది యువతను మాదక ద్రవ్యాల వినియోగం నుంచి దూరం చేసినట్లు ప్రకటించింది. ఇందుకు సంబంధించి కేంద్ర హోంశాఖ తెలిపిన ఇతర వివరాలు ఏమిటంటే..

- 2.06 కోట్ల మంది మహిళలను కూడా మాదక ద్రవ్యాల వినియోగం నుంచి దూరం చేశాం.
- డ్రగ్స్ డిమాండ్‌ను తగ్గించడం ద్వారా యువత, మహిళలను వాటి నుంచి దూరం చేయడానికి జాతీయ కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తున్నాం.
- మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి కోసం 340 ఇంటిగ్రేటెడ్ పునరావాస కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. తద్వారా చికిత్సను అందించడమే కాకుండా విద్యపై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.
- డీటాక్సిఫికేషన్, డీఅడిక్షన్ తర్వాత సామాజిక ప్రధాన స్రవంతిలోకి తీసుకొస్తున్నాం.
- మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక డీఅడిక్షన్ కేంద్రాలకు ప్రభుత్వం సహాయం అందిస్తోంది.
- ప్రభుత్వాస్పత్రుల్లో 46 మాదక ద్రవ్యాల వ్యసన చికిత్సలను ఏర్పాటుచేశాం.
- అలాగే, ప్రాథమిక కౌన్సెలింగ్, తక్షణ సహాయం అందించడానికి, డీఅడిక్షన్ కోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 14446 నిర్వహిస్తున్నాం.
- స్వయం ప్రతిపత్తి సంస్థ అయిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్‌తో పాటు ఎస్‌సీఈఆర్‌టీ, కేంద్రీయ విద్యాలయాల ద్వారా క్రమం తప్పకుండా మాదక ద్రవ్యాల వినియోగంవల్ల కలిగే నష్టాలు, హానిపై అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సెన్సిటైజేషన్ సెషన్‌లు నిర్వహిస్తున్నాం.
- గత మూడు సంవత్సరాల్లో డ్రగ్స్ వినియోగిస్తున్న వారిపై 1,24,891 కేసులను నమోదు చేయడంతో పాటు 1,30,458 మందిని అరెస్టుచేశాం.
- అలాగే, గత మూడేళ్లుగా 18 ఏళ్లలోపు డ్రగ్స్ వినియోగిస్తూ అరెస్టయిన వారి గణాంకాలను పరిశీలిస్తే పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నారు.
- ఇక 18 ఏళ్లలోపు డ్రగ్స్ వినియోగిస్తున్న 935 మంది గత మూడేళ్లలో అరెస్టు కాగా.. ఇదే సమయంలో 9,077 మంది మహిళలు అరెస్టయ్యారు.
- 2018లో నిర్వహించిన సర్వే ప్రకారం.. దేశంలో 10–17 ఏళ్లలోపు 86 లక్షల మంది పిల్లలు మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తేలింది.
- అలాగే, దేశంలో 10–75 ఏళ్ల వయస్సు గల 52.59 లక్షల మంది మహిళలు మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తేలింది.

## సిమ్ వెరిఫికేషన్‌లో కృత్రిమమేధ

- మోసపూరిత ఏజెన్సీలపై డీటీఓ చర్యలు

**సాక్షి, హైదరాబాద్:** నిబంధనలకు విరుద్ధంగా సిమ్‌కార్డులు పొందుతున్న వారికి సిమ్ కనెక్షన్లను ఇస్తున్న కొన్ని మోసపూరిత ఏజెన్సీలను కనిపెట్టేందుకు కృత్రిమమేధను వినియోగిస్తున్నట్లు టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ (డీఓటీ) వెల్లడించింది. సాధారణ ప్రజలు మోసాలకు గురికాకుండా అడ్డుకునేందుకు డీఓటీ ఈ డ్రైవ్ చేపట్టినట్టు అధికారులు తెలిపారు. నకిలీ కనెక్షన్లను జారీ చేస్తున్న ఏజెన్సీలపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అలాంటి ఏజెన్సీలను గుర్తించడంతోపాటు నకిలీ ధ్రువపత్రాలతో సిమ్‌కార్డులు పొందే వారిని గుర్తించేందుకు డీఓటీ అధికారులు ఫేస్ రికగ్నిజేషన్ సొల్యూషన్స్ వాడుతున్నట్టు తెలిపారు. మొత్తం 72 నకిలీ టెలికాం సర్వీస్ ప్రొవైడర్స్‌ను గుర్తించి వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా తప్పుడు వివరాలతో ఇప్పటికే పొందిన సిమ్ కనెక్షన్లను సైతం డిస్‌కనెక్ట్ చేసినట్లు వెల్లడించారు. ఈ తరహాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రాల్లో కలిపి మొత్తం 50,825 కనెక్షన్లను రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

## జమ్మూలో జూన్ 8న శ్రీవారి ఆలయ మహాసంప్రోక్షణ

- పనులను పరిశీలించిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి


జమ్మూలోని శ్రీవారి ఆలయంలో పనులను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తదితరులు

**తిరుమల:** జమ్మూలోని మజీన్ గ్రామంలో నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ మహాసంప్రోక్షణ జూన్ 8న నిర్వహించనున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. జమ్మూలోని ఆలయంలో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి తిరుమలకు రాలేని భక్తుల కోసం దేశవ్యాప్తంగా ప్రముఖ ప్రాంతాల్లో ఆలయాలు నిర్మిస్తున్నామని చెప్పారు. జమ్మూ ప్రభుత్వం 62 ఎకరాల స్థలం కేటాయించగా.. రూ.30 కోట్ల వ్యయంతో శ్రీవారి ఆలయం, ఉప ఆలయాలు, పోటు ఇతర సదుపాయాలు కల్పించామని తెలిపారు. జూన్ 3 నుంచి 8 వరకు విగ్రహ ప్రతిష్ఠ, మహాసంప్రోక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. 8వ తేదీ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు మహాసంప్రోక్షణ జరుగుతుందని.. 12 గంటలకు భక్తులకు ఉచిత దర్శనం ప్రారంభమవుతుందని చెప్పారు. శ్రీ వైష్ణోదేవి ఆలయానికి వెళ్లే జమ్మూ–కాట్రా మార్గంలో ఈ ఆలయం ఉన్నందున.. భక్తులు శ్రీవారి ఆశీస్సులు కూడా అందుకోవచ్చన్నారు. ఆలయానికి 24 గంటల పాటు శాశ్వత భద్రత ఏర్పాటు చేయాలని జమ్మూ ప్రభుత్వాన్ని కోరినట్లు వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. త్వరలో ముంబైలో ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని.. అహ్మదాబాద్, రాయ్‌పూర్‌లలో కూడా స్వామివారి ఆలయాల నిర్మాణానికి చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ రాహుల్, టీటీడీ అధికారులు నరసింహ కిశోర్, నాగేశ్వరరావు, టీవీ సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, మనోహర్, టి.రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.5,160 కోట్లతో విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ

- రాష్ట్రంలోనే అత్యధికంగా గతేడాది 78,739 వ్యవసాయ కనెక్షన్లు
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



**తిరుపతి రూరల్:** దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్, కర్నూలు, నంద్యాల, సత్యసాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాల పరిధిలో రూ.5,160 కోట్లతో విద్యుత్ వ్యవస్థను ఆధునికీకరిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ సంతోషరావు తెలిపారు. ఎస్పీడీసీఎల్ రెగ్యులర్ సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల పరిధిలో పాత విద్యుత్ లైన్ల వ్యవస్థే ఉందని పేర్కొన్నారు. ఆ రెండు జిల్లాలతో పాటు కంపెనీ పరిధిలోని అన్ని జిల్లాల్లోనూ విద్యుత్ వ్యవస్థను ఆధునికీకరించేందుకు రూ.5,160.63 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఇందులో రూ.3,096.38 కోట్లు గ్రాంట్‌గా వచ్చాయని పేర్కొన్నారు. ఈ నిధులతో ఇప్పటికే 3,015 వ్యవసాయ ఫీడర్లు, 33కేవీ 117 ఓవర్ లోడ్ ఫీడర్లను వేరు చేస్తున్నామన్నారు.

### ఇకపై ప్రీపెయిడ్ సర్వీసులు

డిస్కం పరిధిలోని 24.14 లక్షల విద్యుత్ సర్వీసులను ప్రీపెయిడ్ సర్వీసులుగా మార్చనున్నామని సంతోషరావు తెలిపారు. త్వరలోనే ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం రూ.1,657.66 కోట్లను కేటాయించామని చెప్పారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో రైతులకు గతేడాది రికార్డు స్థాయిలో 78,739 వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని, రూ.1,413 కోట్ల అంచనాలతో ఇప్పటికే 62,694 సర్వీసులను మంజూరు చేశామని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో డిస్కంకు రూ.5,517.10 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు డిస్కం పరిధిలోని 9 జిల్లాల్లో రూ.292.50 కోట్లతో 117 విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నామన్నారు. వార్డు/గ్రామ సచివాలయాల్లో సైతం విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించే ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి అర్జీకి ట్రాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు.

## వక్ఫ్‌బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు కల్పిస్తాం

- మద్యం షాపుల్లో గీత కార్మికులకు రిజర్వేషన్ ఇస్తాం
- టీడీపీ నేత నారా లోకేశ్

**కర్నూలు(అర్బన్):** టీడీపీ అధికారంలోకి వస్తే వక్ఫ్‌బోర్డుకు జ్యుడీషియల్ అధికారాలు కల్పిస్తామని ఆ పార్టీ నేత నారా లోకేశ్ చెప్పారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం కోడుమూరు నియోజకవర్గం వెంకాయపల్లె, సూదిరెడ్డిపల్లె, పూడూరు గ్రామాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మైనారిటీల ఆస్తులకు రక్షణ కరువైందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఖబరస్థాన్‌లకు ప్రహరీలు నిర్మించి రక్షణ కల్పిస్తామని చెప్పారు. గీత కార్మికులకు ఉపాధి హామీని అనుసంధానం చేస్తామన్నారు. మద్యం షాపుల్లో గీత కార్మికులకు రిజర్వేషన్ అమలు చేస్తామని.. అన్ని నియోజకవర్గాల్లో నీరా కేఫ్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. టీడీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో 25 వేల కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు వేశామని, 30 లక్షల వీధి దీపాలు ఏర్పాటు చేశామన్నారు. గత నాలుగేళ్లలో రూ.28,147 కోట్ల ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారని ఆరోపించారు.

## క్లుప్తంగా

### ప్రత్యక్ష ప్రసారాలతో కోర్టు ఇళ్లలోకి..
## జనం మనసుల్లోకి వెళ్లింది
**సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్య**

**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రత్యక్ష ప్రసారాల ద్వారా సర్వోన్నత న్యాయస్థానం ప్రజల నివాసాల్లో, వారి మనసుల్లో స్థానం సంపాదించుకుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. స్వలింగ సంపర్కుల వివాహానికి చట్టబద్ధత కోరుతూ దాఖలైన కేసులపై వాదనలను వరసగా ఎనిమిదో రోజు ఆలకించిన సందర్భంగా మంగళవారం సుప్రీంకోర్టు సీజే జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'కోర్టు ప్రత్యక్ష ప్రసారాలపై జనంలో చర్చ నడుస్తోంది. లైవ్ స్ట్రీమింగ్ అనేది సరైన దిశలో ముందడుగు. అయితే ఇంగ్లిష్‌లో సాగే వాదనలను గ్రామాల్లోని చాలా మంది జనం అర్థం చేసుకోలేకపోతున్నారు' అని మధ్యప్రదేశ్ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది కోర్టులో వ్యాఖ్యానించారు. దీంతో సీజేఐ ' నిజమే. లైవ్ స్ట్రీమింగ్‌తో సుప్రీంకోర్టు సాధారణ ప్రజల ఇళ్లలోకి, మనసుల్లోకి చేరింది. ఇదొక నిరంతర ప్రక్రియ. జనం మాట్లాడే భాషల్లో వాదనలు అందుబాటులో ఉండేలా సాంకేతికతను వాడేందుకు మావైపు నుంచీ ప్రయత్నిస్తున్నాం ' అని అన్నారు. 2018లో కోర్టు కార్యకలాపాల ప్రత్యక్షప్రసారానికి సూత్రప్రాయంగా అనుమతించిన సుప్రీంకోర్టు.. 2022 నుంచి ప్రసారం మొదలుపెట్టింది. 2023 ఫిబ్రవరి నుంచి ప్రత్యక్ష ప్రసారాలకు కృత్రిమ మేధ సాయంతో ఇతర భాషల్లో ట్రాన్స్‌స్క్రిప్ట్ (రాసిన లేదా ముద్రించిన కాపీలు) అయ్యేలా చూస్తోంది.

### ఐశ్వర్య కుటుంబానికి సహకరిస్తున్నాం
**అమెరికాలోని ఇండియన్ కాన్సులేట్ వెల్లడి**

**హ్యూస్టన్:** టెక్సాస్ అలెన్ ప్రీమియం ఔట్‌లెట్ మాల్‌లో దుండగుడి కాల్పుల్లో మృతిచెందిన తెలుగు యువతి తాటికొండ ఐశ్వర్య(26) మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు ఆమె కుటుంబానికి సహకరిస్తున్నామని అమెరికాలోని ఇండియన్ కాన్సులేట్ తెలియజేసింది. శనివారం టెక్సాస్ మాల్ కాల్పుల్లో మరో ఇద్దరు భారతీయులు గాయపడ్డారని, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించింది. ఐశ్వర్య మృతదేహాన్ని స్వస్థలానికి చేర్చడానికి అవసరమైన ప్రక్రియ పూర్తి చేయడానికి తమ వంతు సాయం అందిస్తున్నామని హ్యూస్టన్‌లోని కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా అసీమ్ మహాజన్ చెప్పారు. కాల్పుల్లో ఐశ్వర్య మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఐశ్వర్య పార్థివ దేహాన్ని భారత్‌కు తరలించేందుకు ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) ప్రతినిధి అశోక్ కోర్ల కృషి చేస్తున్నారు.

### కారు అద్దాలు బద్దలు కొట్టి, కాలర్ పట్టుకొని లాక్కెళ్లి..
# ఇమ్రాన్ అరెస్టు

- ఇస్లామాబాద్ హైకోర్టు ఎదుట అదుపులోకి తీసుకున్న పారామిలటరీ రేంజర్లు
- సొంత ట్రస్టుకు భూమి బదిలీ కేసులో అరెస్టు చేసినట్లు అధికారుల ప్రకటన
- కస్టడీలో ఇమ్రాన్‌ను హింసిస్తున్నారని పీటీఐ నేతల ఆరోపణలు



**ఇస్లామాబాద్/లాహోర్:** అధికారంలో ఉన్నప్పుడు భారీగా అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి, పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ చైర్మన్ ఇమ్రాన్ ఖాన్(70)ను పారామిలటరీ రేంజర్లు మంగళవారం అరెస్టు చేశారు. ఇదే కేసులో ఇస్లామాబాద్ హైకోర్టులో విచారణకు హాజరైన ఆయనను న్యాయస్థానం ఎదుటే అదుపులోకి తీసుకున్నారు. తనను హత్య చేసేందుకు పాకిస్తాన్ సైన్యం కుట్ర పన్నుతోందంటూ ఆరోపించిన మరుసటి రోజే ఇమ్రాన్‌ను అరెస్టు చేయడం గమనార్హం. కోర్టుకు హాజరయ్యేందుకు ఆయన లాహోర్ నుంచి ఇస్లామాబాద్‌కు చేరుకున్నారు. కోర్టులో ప్రవేశించేందుకు తన వాహనంలో కూర్చొని బయోమెట్రిక్ ప్రక్రియ నిర్వహిస్తుండగా పారామిలటరీ రేంజర్లు రంగప్రవేశం చేశారు. వాహనం గ్లాస్ డోర్‌ను పగులగొట్టి, ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ భద్రతా సిబ్బందిని, లాయర్లను రేంజర్లు దారుణంగా కొట్టారని పీటీఐ సీనియర్ నేత షిరీన్ మజారీ ఆరోపించారు. ఇమ్రాన్ పట్ల రేంజర్లు అనుచితంగా ప్రవర్తించినట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వా రా వెల్లడయ్యింది. కాలర్ పట్టుకొని బలవంతంగా లాక్కెళ్లి, జైలు వ్యాన్‌లోకి విసిరేసినట్లు తెలుస్తోంది.

**ఈ నెల 1న అరెస్టు వారెంట్**

ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా బీబీకి చెందిన అల్-ఖదీర్ ట్రస్టుకు బాహ్రియా పట్టణంలో రూ.53 కోట్ల విలువైన భూమిని బదిలీ చేసిన కేసులో ఇమ్రాన్‌ను అరెస్టు చేసినట్లు ఇస్లామాబాద్ పోలీసులు ప్రకటించారు. మంగళవారం ఉదయమే అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు వెల్లడించారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం ఆయనను నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో(ఎన్‌ఏబీ)కు అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఇమ్రాన్ అరెస్టు వారెంట్‌ను ఈ నెల 1న జారీ చేసినట్లు దానిపై ఉన్న తేదీని బట్టి తెలుస్తోంది. అవినీతి వ్యవహారాల్లో ఆయన నిందితుడని అందులో పేర్కొన్నారు. అరెస్టు తర్వాత ఇమ్రాన్‌ను ఎలాంటి ఇబ్బందులకు గురి చేయలేదని, పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి రాణా సనావుల్లా ట్విట్టర్‌లో వెల్లడించారు. ఇమ్రాన్‌ను హింసించారంటూ వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ విచారణకు హాజరు కాలేదని, అందుకే ఎన్‌ఏబీ ఆయనను అదుపులోకి తీసుకుందని తెలియజేశారు.



ఇమ్రాన్ మద్దతుదారులు పెషావర్‌లో నిప్పుపెట్టిన దృశ్యం



ఇమ్రాన్ మద్దతుదారుడిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

**140కి పైగా కేసులు**

ఇమ్రాన్ అరెస్టు పట్ల పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు ప్రాంగణంలోనే లాయర్లపై రేంజర్లు దాడి చేశారని, దేశంలో అరాచకం రాజ్యమేలుతోందని మండిపడ్డారు. కస్టడీలో ఉన్న ఇమ్రాన్‌ను దారుణంగా హింసిస్తున్నారని ఆరోపించారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఇమ్రాన్ పదవి కోల్పోయారు. ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. అవినీతి, ఉగ్రవాదం, దైవదూషణ, హత్య, హింసకు ప్రేరేపించడం వంటి ఆరోపణల కింద ఇమ్రాన్‌పై 140కిపైగా కేసులు నమోదయ్యాయి. ఇమ్రాన్ అరెస్టు నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో పోలీసులు 144 సెక్షన్ విధించారు. నిరసనలు, ఆందోళనలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

**జైలుకు వెళ్లడానికి సిద్ధం: ఇమ్రాన్**

ఇమ్రాన్ అరెస్టయిన తర్వాత.. ముందుగా రికార్డు చేసిన ఓ వీడియోను పీటీఐ విడుదల చేసింది. ''నా మాటలు మీకు చేరుకునేలోపు ఎలాంటి ఆధారాల్లేని కేసులో నన్ను అరెస్టు చేస్తారు. పాకిస్తాన్‌లో ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్యానికి సమాధి కట్టినట్లు దీనిద్వారా తేటతెల్లమవుతుంది. అవినీతికి పాల్పడినట్లు నేను అంగీకరించాలని వారు(పాక్ పాలకులు) కోరుకుంటున్నారు. దిగుమతి అయిన ప్రభుత్వాన్ని బలవంతంగా ప్రజలపై రుద్దారు. వారెంట్ ఉంటే నన్ను అరెస్టు చేసుకోండి. జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నా'' అని ఆ వీడియోలో ఇమ్రాన్ ఖాన్ పేర్కొన్నారు.



అరెస్టుకు ముందు హైకోర్టులో ఇమ్రాన్

**ఇమ్రాన్ అనుచరుల విధ్వంసం**

పాకిస్తాన్‌లో అవాంఛనీయ దృశ్యాలు కనిపించాయి. ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ పీటీఐ పార్టీ నేతలు, కార్యకర్తలు, ఆయన అనుచరులు వీధుల్లోకి వచ్చారు. విధ్వంసానికి పాల్పడ్డారు. రావల్పిండిలోని పాక్ సైనిక ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రధాన గేటును ధ్వంసం చేశారు. సైన్యానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్ ప్రధాన గేటును ధ్వంసం చేయడం ఇదే మొదటిసారి. లాహోర్‌లో సైనిక కమాండర్ నివాసాన్ని సైతం నిరసనకారులు దిగ్బంధించారు. సైనిక కంటోన్మెంట్‌లో గుమికూడి నినాదాలు చేశారు. రహదారులపై బైఠాయించడంతో లాహోర్ నుంచి చాలాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఇమ్రాన్ అరెస్టు వార్త ఉదయమే దావానలంగా వ్యాపించింది. వెంటనే ఆయన అనుచరులు వివిధ నగరాలు, పట్టణాల్లో ఆందోళనకు దిగారు. నిరసన ప్రదర్శనలు చేపట్టారు. వాహనాలకు నిప్పు పెట్టారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. ఇమ్రాన్‌ను పారామిలటరీ రేంజర్లు శారీరకంగా హింసిస్తున్నారని ఆరోపించారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని నినదించారు. నిరసనలు హింసాత్మకంగా మారాయి. పెషావర్, కరాచీ, హైదరాబాద్, క్వెట్టా తదితర ప్రాంతాల్లో పరిస్థితి అదుపు తప్పింది. భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి, ఇమ్రాన్ మద్దతుదారులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

## నదిలో పడిన బస్సు
**మధ్యప్రదేశ్‌లో 24 మంది దుర్మరణం**

**ఖర్గోన్/భోపాల్:** కిక్కిరిసిన ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అదుపుతప్పి నదిలో పడింది. ఈ ప్రమాదంలో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. 40 మందికిపైగా గాయపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో మంగళవారం ఉదయం ఈ దుర్ఘటన జరిగింది. జిల్లాలోని దొంగర్‌గావ్ గ్రామ సమీపంలో బొరాద్ నదిపై నిర్మించిన వంతెన మీదుగా బస్సు ప్రయాణిస్తుండగా డ్రైవర్ ఒక్కసారిగా బస్సుపై నియంత్రణ కోల్పోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో బస్సు వంతెన రెయిలింగ్‌ను బద్దలుకొడుతూ నదిలో పడింది. బస్సు పడిన చోట నీటిప్రవాహం లేదు. 37 మందికే సీటింగ్ సామర్థ్యమున్న బస్సులో ఏకంగా 70 మంది ప్రయాణిస్తున్నారని, ఫిట్‌నెస్ లేని బస్సు వేగంగా ప్రయాణించడమూ ప్రమాదానికి కారణమని ప్రభుత్వం తెలిపింది. ఫిట్‌నెస్‌లేని బస్సుకు అనుమతినిచ్చిన అసిస్టెంట్ రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్‌ను ప్రభుత్వం సస్పెండ్‌చేసింది. ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ విచారం వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ.4 లక్షల నగదు పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50వేల ఆర్థికసాయం అందిస్తామన్నారు. మృతుల కుటుంబాలకు తలా రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా అందిస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు.

## రష్యాపై 'రియల్ వార్'
**విక్టరీ డే పరేడ్‌లో పుతిన్ వ్యాఖ్యలు**

**మాస్కో:** స్వప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి పశ్చిమ దేశాలు రష్యాపై అసలైన యుద్ధం(రియల్ వార్) ప్రారంభించాయని దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆరోపించారు. రాజధాని మాస్కోలోని చరిత్రాత్మక రెడ్ స్క్వేర్‌లో మంగళవారం పటిష్టమైన భద్రత మధ్య నిర్వహించిన విక్టరీ డే పరేడ్‌లో ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. నాగరికత నేడు మరోసారి ఒక నిర్ణయాత్మకమైన కీలక మలుపులో ఉందని వ్యాఖ్యానించారు. స్వార్థపరులు తమ మాతృదేశంపై అసలైన యుద్ధానికి తెరలేపారని ఆరోపించారు. తమ పొరుగు దేశం ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణకు పశ్చిమ దేశాల స్వార్థపూరిత ఆకాంక్షలు, అహంకారమే కారణమని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి ఈ పరేడ్‌లో పాల్గొంటున్న రష్యా సైనికులకు పుతిన్ సాదర స్వాగతం పలికారు. రష్యాకు, మన సైనిక దళాలకు, విజయానికి స్వాగతం అని పేర్కొన్నారు. తాజాగా రష్యా సైన్యం ఉక్రెయిన్‌పై విరుచుకుపడింది. క్రూయిజ్ క్షిపణులు ప్రయోగించింది.

## మరో చీతా మరణం

**భోపాల్:** దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన చీతాల్లో మరొకటి మృతి చెందింది. మంగళవారం ఈ విషయం బయటపడింది. చీతాలను ఫిబ్రవరిలో మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కులో వదిలిపెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా దక్ష అనే ఆడ చీతా ప్రాణాలు కోల్పోయింది. రెండు మగ చీతాలతో జరిగిన పోరాటంలో గాయపడి, మరణించినట్లు ప్రాథమిక ఆధారాలను బట్టి గుర్తించారు.

## నేడే కర్ణాటకలో పోలింగ్
**పూర్తి ఏర్పాట్లు, భద్రతతో సర్వం సిద్ధం**



**సాక్షి, బెంగళూరు:** కర్ణాటకలో రాష్ట్రాధికారమే ధ్యేయంగా ప్రధాన పార్టీలుసహా చిన్నాచితక పార్టీలు సాగించిన ప్రచారపర్వం ముగిశాక ఎన్నికల పండుగ కీలకఘట్టంలోకి అడుగుపెట్టింది. బుధవారం 224 శాసనసభ స్థానాల్లో పోలింగ్ కోసం పూర్తి ఏర్పాట్లు, భద్రతతో రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఉదయం ఏడింటి నుంచి సాయంత్రం ఆరింటిదాకా పోలింగ్ నిర్వహిస్తారు. ఈసారి అన్ని నియోజకవర్గాల్లో కలిపి 2,615 మంది అభ్యర్థులు తమ అదృష్టం పరీక్షించుకోబోతున్నారు. 58,545 పోలింగ్ కేంద్రాల్లో రాష్ట్రవ్యాప్తంగా 5,31,33,054 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లలో 2,67,28,053 మంది పురుషులుకాగా, 2,64,00,074 మంది స్త్రీలు. 80 ఏళ్లుపైబడిన వృద్ధులు కొందరు ఇప్పటికే ఇంటివద్ద ఓటు హక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థుల్లో 2,430 మంది పురుషులుకాగా, 184 మంది స్త్రీలు బరిలో నిలిచారు. దాదాపు నాలుగు లక్షల మంది ఎన్నికల సిబ్బంది విధుల్లో కొనసాగనున్నారు. ఓటింగ్ ప్రక్రియలో 75,603 బ్యాలెట్ యూనిట్లు, 70వేలకుపైగా కంట్రోల్ యూనిట్లు, 76వేలకుపైగా వీవీప్యాట్లు వినియోగించనున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మొహరించారు. వారాంతంలో పోలింగ్ తేదీ ఉంటే ఓటర్లు చిన్నపాటి విహారయాత్రకు ప్లాన్ చేస్తారని, దానికి చెక్ పెట్టేందుకే వారం మధ్యలో(బుధవారం) పోలింగ్ తేదీని ఖరారుచేసినట్లు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఇటీవల మీడియాతో వ్యాఖ్యానించడం తెల్సిందే.

## ఇక నుంచి మీ కలే నా కల

- ఉమ్మడి లక్ష్యంగా ముందుకెళ్తే ప్రపంచంలో ఆపేవారే లేరు
- కన్నడ ప్రజలకు రాసిన లేఖలో ప్రధాని మోదీ

**బెంగళూరు:** తమ ఓటు ద్వారా భవిష్యత్తు ప్రభుత్వాన్ని కొలువు తీర్చేందుకు సమాయత్తమవుతున్న కన్నడ ప్రజలకు ప్రధాని మోదీ లేఖ రాశారు. ఎన్నికల సందర్భంగా కొద్ది రోజులుగా రాష్ట్రంలో ప్రచారం చేస్తున్న తన పట్ల ప్రజలు చూపిన ప్రేమాభిమానాలు అనుపమానమైనవని ఆయన అభివర్ణించారు. లేఖలోని విషయాలను ప్రస్తావిస్తూ ట్విట్టర్‌లో ఒక వీడియోను పోస్ట్‌చేస్తూ ట్వీట్లు చేశారు. ' కర్ణాటకలోని సోదరసోదరీమణులకు నమస్కారం. రాష్ట్రంలో ప్రచారం వేళ నాపై మీరు చూపిన ఆదరాభిమానాలు సాటిలేనివి. అన్ని రంగాల్లో కర్ణాటకను అగ్రస్థానంలో నిలపాలన్న నా సంకల్పానికి మీ ప్రేమానురాగాలు మరింత శక్తిని అందించాయి. దేశంలో కర్ణాటకను నంబర్ వన్ రాష్ట్రంగా మార్చే యజ్ఞంలో మీ ఆశీస్సులు నాకు కావాలి. రాష్ట్ర ఉజ్వల భవిత గురించే నా విజ్ఞప్తి. మీ కుటుంబాలు, ముఖ్యంగా యువత భవిష్యత్తు గురించే నా విన్నపం. కన్నడనాట ఈసారి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం రావాలి అనే నినాదాలు ఇంకా నా చెవిలో ప్రతిధ్వనిస్తున్నాయి' అని పేర్కొన్నారు.

**నేడు 90వేల కోట్లు.. నాడు 30వేల కోట్లే..**

''నేడు మనం అమృతకాలంలో పయనిస్తున్నాం. 'ఆజాదీ కా అమృత్ కాల్'లో భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని దృఢ సంకల్పంతో ముందుకెళ్తున్నాం. ఈ ఉద్యమాన్ని కర్ణాటక ముందుండి నడిపించి ఈ కలకు నిజం చేయాలి. ప్రస్తుతం ప్రపంచంలో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంది. ఇకపై మూడో స్థానమే మన లక్ష్యం. ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా కర్ణాటక ఎదిగినప్పుడే ఇది సాధ్యం. ఇక్కడ బీజేపీ హయంలో ఏటా రూ.99వేల కోట్ల విదేశీ పెట్టుబడులొచ్చాయి. గత సర్కార్‌ల కాలంలో ఇవి కేవలం రూ.30వేల కోట్లే. అత్యంత అనువైన జీవనం, వ్యాపార అనువైన రాష్ట్రంగా కర్ణాటక నంబర్‌వన్ స్థానంలో నిలిచేలా డబుల్ ఇంజన్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంది. జగత్‌జ్యోతి బసవేశ్వర, కెంపెగౌడ, శ్రీ కనకదాస వంటి మహానుభావులు చూపిన మార్గంలో నడుస్తూ అభినవ కర్ణాటకను నిర్మించే మహాక్రతువులో బీజేపీ నిమగ్నమైంది. ఇకపై మీ కల నా కల. మీ సంకల్పాన్ని నాదిగా భావిస్తున్నా. ఆలోచనలు కలిసి నిర్దేశించుకున్న మన ఉమ్మడి లక్ష్య సాధనను ప్రపంచంలో మరెవరూ ఆపలేరు'' అని లేఖలో మోదీ పేర్కొన్నారు.

# నువ్వా.. నేనా..!

**భారీ రోడ్ షోలతో మోదీ, జనంతో మమేకమై రాహుల్ • కర్ణాటక ప్రచారంలో ఇద్దరు నేతల భిన్న శైలి**

ఈసారి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీకి ప్రధాని మోదీ, కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ పోస్టర్ బోయ్స్‌గా మారారు. ఇతర నేతలూ రంగంలో నిలిచి ముమ్మరంగా కలియదిరిగినా మొత్తం భారాన్ని దాదాపుగా వారిద్దరే తమ భుజస్కంధాలపైనే మోశారు. తమ పార్టీల జయాపజయాలకు ప్రధానంగా వారే బాధ్యులు కానున్నారు...

\- సాక్షి, నేషనల్ డెస్క్



**మోదీ ఇలా...**

కర్ణాటకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారం భిన్న శైలిలో సాగింది. ముఖ్యంగా రాజధాని బెంగళూరులో ఓటర్లను ఆకర్షించడానికి వారు చెరో మార్గం అనుసరించారు. బీజేపీ, కాంగ్రెస్‌లకు చావోరేవోగా మారిన ఈ ఎన్నికల్లో ప్రచార గడువు ముగియడానికి మూడు రోజుల ముందు నుంచి వారిద్దరూ రాజధానిపై ప్రధానంగా దృష్టి సారించారు. శని, ఆదివారాల్లో అట్టహాసంగా మోదీ 30 కిలోమీటర్లకు పైగా భారీ రోడ్ షోలు నిర్వహిస్తే, రాహుల్ మాత్రం సామాన్యుడిలా అందరితోనూ కలిసిపోతూ ప్రచారం చేశారు. మోదీ జేపీ నగర్ నుంచి మల్లేశ్వరం వరకు 26 కి.మీ. పొడవునా, న్యూ తిప్పసంద్ర రోడ్డు నుంచి ట్రినిటి సర్కిల్ దాకా 6.5 కి.మీ. మే చేసిన రోడ్ షోలకు జనం పోటెత్తారు. దారి పొడవునా ఆయనపై పూల వర్షం కురిపించారు. డబుల్ ఇంజన్ సర్కారుతో ప్రయోజనాలు, బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ మేనిఫెస్టోను ఎండగడుతూ బెంగళూరులో మోదీ ప్రసంగాలు సాగాయి.

**రాహుల్ అలా...**

రాహుల్ మాత్రం ఆది, సోమవారాల్లో రాజధాని జనంలో కలిసిపోయి ప్రచారం చేశారు. ఫుడ్ డెలివరీ బోయ్‌తో పాటు అతని మోటార్ సైకిల్‌పై ప్రయాణించారు. డెలివరీ యాప్‌ల బాయ్స్‌తో మాట్లాడారు. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. దారిన పోయే వారిని పలకరిస్తూ సాగారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి వాటిపై చర్చించారు. సోమవారం కాఫీ డేలో కాఫీ తాగుతూ సందడి చేశారు. బస్టాప్‌లో ఉన్న వారితో మాట్లాడారు. బస్సెక్కి ప్రయాణికులతో మాటలు కలిపారు. బొమ్మై ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఇమేజ్‌నే పెట్టుబడిగా పెట్టి ఎన్నికల్ని తన భుజస్కంధాలపై వేసుకున్నారు. రాహులేమో పెరిగిపోతున్న ధరలనే అస్త్రంగా చేసుకొని ఎన్నికల ప్రచారాన్ని ముగించారు.

**కర్ణాటకలో బీజేపీ ప్రచారం**

**మోదీ**
6 రోడ్ షోలు
19 బహిరంగ సభలు, ర్యాలీలు

**అమిత్ షా**
15 రోడ్ షోలు
16 సభలు

**జేపీ నడ్డా**
16 రోడ్ షోలు
10 సభలు

## కర్ణాటక విజయం బీజేపీ, కాంగ్రెస్‌లకు ఎందుకు కీలకమంటే...

**బీజేపీ**

- కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టమైన విజయం బీజేపీ, కాంగ్రెస్ రెండింటికీ ఎంతో కీలకం.
- అధికారాన్ని నిలబెట్టుకోవడం ద్వారా దక్షిణాదిన తమ చేతిలో ఉన్న ఏకైక రాష్ట్రం చేజారకుండా చూసుకోవడం బీజేపీకి చాలా ముఖ్యం.
- కర్ణాటక గెలుపు అజేయుడైన నాయకునిగా మోదీ స్థానాన్ని మరింత సుస్థిరం చేస్తుంది. ఆయన కరిష్మాను మరింతగా పెంచుతుంది.
- అంతేగాక కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల వేళ కర్ణాటక వంటి ప్రధాన రాష్ట్రంలో ఓటమి చవిచూస్తే విపక్షాలు దూకుడు పెంచుతాయి.
- గత 38 ఏళ్లలో ఏ పార్టీనీ వరుసగా రెండోసారి గెలిపించని కర్ణాటక ఆనవాయితీని తిరగరాయాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది.
- బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ హామీ, ముస్లిం కోటా రద్దుపై ఆ పార్టీ వైఖరి సహా ఏ అవకాశాన్ని వదలుకోకుండా ప్రచారాంశంగా మలచుకుంది.

**కాంగ్రెస్**

- కొన్నేళ్లుగా వరుసగా ఎన్నికల ఓటములతో బాగా డీలా పడి ఉన్న కాంగ్రెస్‌కు కర్ణాటక గెలుపు ప్రాణావసరమనే చెప్పాలి.
- లోక్‌సభ ఎన్నికల్లో విపక్ష కూటమి ప్రయత్నాలకు ఊపు తెచ్చేందుకు కూడా ఇది టానిక్‌లా ఉపయోగపడుతుంది.
- జనాకర్షక నేతగా ప్రధాని మోదీకి దీటుగా రాహుల్ ఎదగాలంటే ఈ ఎన్నికల్లో ఆయన చేసిన ప్రచారం ఓట్లు రాల్చి పార్టీని గెలిపించడం తప్పనిసరి అవసరం.
- ఇక కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సొంత రాష్ట్రం కావడంతో ఆయనకూ ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి.
- పచారంలో కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డింది. అన్నాచెల్లెళ్లు రాహుల్, ప్రియాంక కాళ్లకు బలపం కట్టుకుని రాష్ట్రమంతా కలియదిరిగారు. ప్రచారం చివరి దశలో సోనియా కూడా ఒక సభలో పాల్గొన్నారు.
- ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్నెన్నో హామీలు గుప్పించింది. రాష్ట్రంలో మొత్తం రిజర్వేషన్లను ఏకంగా 75 శాతానికి పెంచుతామని కూడా చెప్పింది.
- అయితే పోలింగ్ మరో వారం ఉందనగా వేళ మే 2న ఉన్నట్టుండి బజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న హామీతో బీజేపీకి చేజేతులా అస్త్రాన్ని అందించింది. కానీ కోస్తా కర్ణాటక మినహా మిగతా రాష్ట్రమంతటా ఈ హామీ తమకు తప్పకుండా ఓట్లు రాలుస్తుందని కాంగ్రెస్ ఆశపడుతోంది.

### బొగ్గుపై సుంకం స్కామ్‌లో
## ఈడీ దూకుడు



**ఛత్తీస్‌గఢ్‌లో రూ.51 కోట్ల ఆస్తులు అటాచ్**

**న్యూఢిల్లీ:** ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గుపై అదనంగా అక్రమ పన్ను కేసులో మనీ లాండరింగ్ కోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణను వేగవంతం చేసింది. తాజాగా రూ.51.4 కోట్లకుపైగా విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేసినట్లు ఈడీ మంగళవారం తెలిపింది. వీటిలో రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దేవేందర్ యాదవ్, చంద్రదేవ్ ప్రసాద్ రాయ్, పీసీసీ కోశాధికారి రాంగోపాల్ అగర్వాల్‌లకు సంబంధించిన స్థిరాస్తులు, విలాసవంత వాహనాలు, ఆభరణాలు, నగదు ఉన్నాయి. మహిళా ఐఏఎస్ అధికారి, నాటి రాయ్‌గఢ్ జిల్లా కలెక్టర్ రాణు సాహూ, బొగ్గు వ్యాపారి, కేసులో ప్రధాన నిందితుడు సూర్యకాంత్ తివారీ, కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ ఆస్తులనూ ఈడీ అటాచ్ చేసింది. రాష్ట్రంలో రూ.2,000 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందంటూ కాంగ్రెస్ నేత, రాయ్‌పూర్ మేయర్ సోదరుడు అన్వర్ ధేబర్‌ను ఈడీ అరెస్ట్‌చేసిన కొద్దిరోజులకే ఈ ఆస్తుల జప్తు జరగడం గమనార్హం. ఈడీని బీజేపీ ఏజెంట్‌గా పేర్కొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్ దీనిని తప్పుడు కేసుగా అభివర్ణించారు.

## గెహ్లోత్ వర్సెస్ పైలెట్

**జైపూర్:** రాజస్తాన్ రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్‌పై అసంతృప్త నేత సచిన్ పైలెట్ వ్యాఖ్యల్ని తీవ్రతరం చేశారు. కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీని కాకుండా బీజేపీ నేత వసుంధర రాజెను తమ నాయకురాలిగా ఆయన భావిస్తారని మండిపడ్డారు. బీజేపీ హయాంలో జరిగిన అవినీతి, ప్రభుత్వ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో పదే పదే పేపర్ల లీకేజీపై విచారణకు డిమాండ్ చేస్తూ గురువారం నుంచి జన్ సంఘర్ష్ యాత్రను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీకి, గెహ్లోత్‌కు రహస్య ఒప్పందాలున్నాయని ఆరోపించారు. ధోల్‌పూర్‌లో ఆదివారం సీఎం అశోక్ గెహ్లోత్ మాట్లాడుతూ 2020లో సచిన్ పైలెట్ కొంతమంది ఎమ్మెల్యేలతో తిరుగుబాటు చేసినప్పుడు మాజీ సీఎం వసుంధరా రాజె తమ ప్రభుత్వాన్ని కాపాడిందని ప్రశంసించారు. డబ్బులు ఎరవేసి తమ ప్రభుత్వాన్ని కూల్చడానికి రాజె ముందుకు రాలేదన్నారు.



ప్రఖ్యాత పులిట్జర్ అవార్డు కింద బ్రేకింగ్ న్యూస్ ఫొటోగ్రఫీ విభాగంలో అవార్డులు పొందిన ఫొటోలు ఇవీ. శ్రీలంక ఆర్థిక సంక్షోభం వేళ ఆగ్రహంతో ప్రజలు కొలంబోలో ప్రధాని రణిల్ కార్యాలయాన్ని ముట్టడించడం, రష్యా దురాక్రమణ నుంచి ఖర్కీవ్‌ను స్వాధీనం చేసుకున్నపుడు ఉక్రెయిన్ సేనలకు స్వాగతం పలికిన మృతదేహం తదితర ఫొటోలకు అవార్డు దక్కింది.



సాక్షి 24|7
తమిళనాడు
TAMILNADU
బుధవారం । 10 । మే । 2023



## రోజూ ప్రభుత్వ కార్యాలయాల్లో తిరుక్కురళ్ సూక్తి

సాక్షి, చెన్నై : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ రోజూ ఓ తిరుక్కురళ్ సూక్తి.. దాని తాత్పర్యాన్ని తప్పనిసరిగా వివరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరైయన్బు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమిళ మహాకవి తిరువళ్లువర్ రచించిన తిరుక్కురళ్ ఖ్యాతిని మరింత పెంచడంతో పాటు ఆయన సూక్తులను ప్రజలందరూ తెలుసుకుని సన్మార్గంలో ప్రయాణించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అన్ని శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లకు మంగళవారం ఓ సర్క్యులర్ పంపించామన్నారు. తిరుక్కురళ్ సూక్తిని ప్రతిరోజూ నల్లబోర్డుపై రాయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది దీన్ని పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

## న్యూస్‌రీల్

### అవిన్ నుంచి కొత్తగా ఊదారంగు పాల ప్యాకెట్లు

అన్నానగర్: మిల్క్ ప్రొడ్యూసర్స్ కో–ఆపరేటివ్ నెట్‌వర్క్ రాష్ట్రంలోని 27 జిల్లా యూనియన్‌ల ద్వారా గ్రామీణ సహకార సంఘాల నుంచి పాలను సేకరించి ప్రాసెస్ చేస్తోంది. వాటిని రాష్ట్రమంతటా వినియోగదారులకు పంపిణీ చేస్తోంది. ప్రస్తుతం ఆవిన్ ఫ్యాక్టరీలో రోజుకు 30 లక్షల లీటర్ల పాల విక్రయాలు చేపడుతున్నారు. గతేడాది సగటు పాల విక్రయాల కంటే ఇది 3 లక్షల లీటర్లు ఎక్కువ. విటమిన్ ఏ సమృద్ధిగా ఉన్న ఈ పాలు రోగనిరోధక శక్తిని పెంచడంలో పాటు, కంటి చూపును మెరుగుపరచడంలో, ఎముకలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. తాజాగా జాతీయ ఆహార భద్రత ప్రమాణాల కమిషన్ సూచన మేరకు విటమిన్ ఎ, డి మరింతగా ఉండే పాల ప్యాకెట్లను ప్రవేశ పెట్టాలని అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తమిళనాడు పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం కొత్తగా పర్పుల్ (ఊదారంగు)ఆవు పాల ప్యాకెట్‌లను మంగళవారం విడుదల చేసిందని అధికారులు తెలిపారు.

### వేడుకగా వేణుగోపాలుడి గరుడోత్సవం



గరుడ వాహనంపై సంతాన వేణుగోపాలస్వామి

తిరుత్తణి: సంతాన వేణుగోపాలస్వామి ఆలయ చైత్రమాస బ్రహ్మోత్సవ వేడుకల్లో గరుడ సేవ సోమవారం కోలాహలంగా నిర్వహించారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో చైత్రమాస బ్రహ్మోత్సవాలు 3న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు సందర్భంగా స్వామి రోజు వాహన సేవల్లో కొలువుదీరి గ్రామ వీధుల్లో ఊరేగిస్తున్నారు. అదే సమయంలో మూలవర్లకు ప్రత్యేక అభిషేక ఆరాధన పూజలు చేపడుతున్నారు. ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన గరుడ సేవ సోమవారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా పుష్పాలతో అలంకరించి గరుడ వాహనంలో సంతాన వేణుగోపాలసామికి సర్వాంగసుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. ఆలయ అర్చకులు దీపరాధన పూజలు చేపట్టి గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులిచ్చి కొబ్బరికాయలు కొట్టి స్వామిని దర్శించుకున్నారు. ఉభయదారులుగా గ్రామానికి చెందిన చిరంజీవులు, జానకిరామన్, హరి, అయ్యప్ప, ప్రవీణ్‌తేజ వ్యవహరించారు.

### ది కేరళ స్టోరీ కి కుష్బూ మద్దతు



తమిళసినిమా: వివాదాస్పద కథా చిత్రం కేరళ స్టోరీకి సీనియర్ నటి, బీజేపీ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు కుష్బూ మద్దతు పలికారు. 32 వేల మంది బాలికలను బలవంతంగా ఇస్లామిక్ మతస్తులుగా మార్చి వారిని ఉగ్రవాదులుగా మార్చినట్లు కేరళలో జరిగిన యదార్థ ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం కేరళ స్టోరీ. ఈ చిత్రంపై ఇప్పటికే పెద్దఎత్తున పలుచోట్ల వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. బీజేపీయేతర రాష్ట్రాలు ఈ చిత్రంపై నిషేధం విధించాలని డిమాండ్ కూడా చేస్తున్నాయి. పశ్చిమబెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాలు ప్రదర్శనను రద్దు చేశాయి. అయితే బీజేపీ నేతలు మాత్రం ఈ చిత్రానికి మద్దతు పలుకుతున్నారు. ఈకోవలోనే నటి కుష్బు మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఏ చిత్రాన్ని చూడాలో, చూడకూడదో ప్రేక్షకులు నిర్ణయించుకుంటారని, ఇతరుల నిర్ణయాన్ని ప్రేక్షకుల మీద రుద్దడం తగదన్నారు. కేరళ స్టోరీ చిత్రాన్ని బ్యాన్ చేయడానికి తమిళనాడు ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోందని ఆరోపించారు.

### రాణిపేటలో 'ఎర్ర' దుంగలు స్వాధీనం

వేలూరు: రాణిపేట మున్సిపాలిటీ పరిధిలోని పాత పోస్టల్ వీధిలో నివశిస్తున్న రామన్ ఇంటి వెనుక వైపున గుర్తు తెలియని వ్యక్తులు ఎర్రచందనం దాచి ఉంచినట్లు అటవీశాఖ అధికారులు రహస్య సమాచారం అందింది. దీంతో అటవీ శాఖ రేంజర్ శరవణన్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆ సమయంలో దాచి ఉంచిన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ దుంగలతో తనకు సంబంధం లేదని రామన్ చెప్పడంతో వాటిని ఎవరు తీసుకొచ్చేరనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. ఇక స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగల విలువ రూ. 3 లక్షలకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. రాణిపేట ఏపీ సరిహద్దు ఉండడంతో ఆంధ్ర రాష్ట్రం నుంచి ఎవరైనా తీసుకొచ్చారనే విషయంపై కూడా దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పందాలు చేసుకుంటున్న అధికారులు, మిత్సుబిషి ప్రతినిధులు



క్రీడా వేడుకల లోగోను ఆవిష్కరిస్తున్న సీఎం స్టాలిన్, చిత్రంలో ధోని తదితరులు




# పెట్టుబడులే లక్ష్యంగా.. !

రాష్ట్రంలోకి పెట్టుబడులను మరింత ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం స్టాలిన్ విదేశీ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈనెల 23 నుంచి జపాన్, సింగపూర్ తదితర దేశాల్లో పర్యటించనున్నారు. ఇక దేశంలోనే ప్రథమంగా తమిళనాడులో జపాన్‌కు చెందిన మిత్సుబిషి సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. రూ. 1,800 కోట్లతో గుమ్మిడి పూండి మహీంద్ర సిటీలో చేపట్టనున్న ప్లాంట్ పనులకు తాజాగా ఒప్పందాలు కుదిరాయి. సీఎం స్టాలిన్ ఈ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు.

- 23న జపాన్, సింగపూర్ పర్యటనకు వెళ్లనున్న సీఎం స్టాలిన్
- రాష్ట్రంలో అడుగుపెట్టిన మిత్సుబిషి సంస్థ
- రూ. 1,800 కోట్లతో ఒప్పందం




గుమ్మిడి పూండి ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడును చెన్నై వేదికగా 2024 జనవరిలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే విధంగా మంత్రుల విదేశీ పర్యటనలు గత నెల ఉంచి చేపడుతున్నాయి. ప్రస్తుతం సీఎం స్టాలిన్ సైతం విదేశీ పర్యటనకు రెడీ అయ్యారు. ఈనెల 23వ తేదీ నుంచి వారం పాటు ఆయన జపాన్, సింగపూర్ వంటి దేశాలలో పర్యటించనున్నారు. ఆయా దేశాలలోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడి దారులు, సంస్థల ప్రతినిధులతో సమావేశం కానున్నారు. పెట్టుబడిదారుల మహానాడుకు తరలి రావాలని పిలుపునివ్వనున్నారు. సీఎం టూర్‌కు సంబంధించిన వివరాలు మంగళవారం వెలువడ్డాయి. అలాగే. పెట్టుబడి దారుల మహానాడు ఏర్పాట్లపై మంత్రుల బృందం దృష్టి సారించింది.

**అంతర్జాతీయ టోర్నీలకు వేదికగా తమిళనాడు**

సోమవారం రాత్రి చెన్నైలో క్రీడలు, యువజన సంక్షేమ శాఖ నేతృత్వంలో తమిళనాడు చాంపియన్స్ ఫౌండేషన్ ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించారు. అలాగే సీఎం కప్ మ్యాచ్–2023 కోసం వీరన్ లోగో ఆవిష్కరణ జరిగింది. అలాగే థీమ్ సాంగ్, టీ షర్టుల ఆవిష్కరణ జరిగింది. ఇందులో సీఎం స్టాలిన్, మంత్రి ఉదయనిధి స్టాలిన్, మాజీ క్రికెటర్, చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ధోని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ, తమిళనాడు చాంపియన్స్ ఫౌండేషన్ గురించి వివరించారు. క్రీడా అభివృద్ధి, క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం గురించి తెలియజేశారు. తమిళనాడు చాంపియన్స్ ట్రస్ట్ ద్వారా అందించనున్న సహకారాన్ని వివరించారు. ఇందుకు ప్రచార కర్తగా ధోని రావడం ఆనందంగా ఉందన్నారు. తాను ధోనికి పెద్ద అభిమాని అని సీఎం తెలిపారు. తమిళనాడును అంతర్జాతీయ క్రీడలకు వేదికగా మారుస్తామన్నారు. దేశంలోనే తమిళనాడు క్రీడా నగరంగా అవతరించే రోజులు రానున్నాయని, ఈ మేరకు క్రీడాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నామన్నారు.

**మిత్సుబిషితో ఒప్పందాలు**

గుమ్మిడి పూండి సమీపంలోని మహీంద్ర సిటీలో తమ ప్లాంట్‌ను నెలకొల్పేందుకు జపాన్‌కు చెందిన మిత్సుబిషి సంస్థ ముందుకొచ్చింది. రూ. 1,800 కోట్లను ఇక్కడ పెట్టుబడి పెట్టనున్నారు. మంగళవారం సీఎం స్టాలిన్ సమక్షంలో ఈ పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. ఇక్కడి పనులకు సీఎం స్టాలిన్ శంకుస్థాపన చేశారు. ఎక్కడ మిత్సుబిషి సంస్థ ఏసీలు, ఏసీ కంప్రాజర్లు, విడి భాగాల తయారీపై దృష్టి పెట్టనుంది. 2025లో ఇక్కడ ఉత్పత్తి మొదలు కానుంది. 2 వేల మందికి ప్రత్యక్షంగానూ, 5 వేల మందికి పరోక్షంగానూ ఉద్యోగాలు దక్కనున్నాయి. ఈ కార్యక్రమంలో సీఎం స్టాలిన్‌తో పాటు మంత్రులు, అధికారులు, మిత్సుబిషి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇకపై భానుడి భగభగలే!

- రేపటి నుంచి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం

సాక్షి, చెన్నై : రాష్ట్రంలో భానుడి సెగ గురువారం (11వ తేదీ) నుంచి తీవ్ర కానుంది. వివరాలు.. ఈ ఏడాది వేసవిలో అకాల వర్షం రాష్ట్రంలోని అనేక జిల్లాలపై ప్రభావం చూపుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో మంగళవారం ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సమీపంలో అల్పపీడనం ఏర్పడింది.ఇది సాయంత్రం వాయుగుండంగా మారింది. బుధవారం తుపాన్‌గా మారి బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల వైపుగా పయనించనుంది. ఈ తుపాన్ ప్రభావం తమిళనాడు మీద పెద్దగా ఉండదని వాతావరణ పరిశోధకులు పేర్కొంటున్నారు. అయితే ఈ తుపాన్ వెళ్తూ వెళ్తూ తమిళనాడు వ్యాప్తంగా గాల్లోని తేమను తీసుకెళ్లనుందని వివరించారు. గాలిలో తేమ తగ్గడం, వేడిమి పెరగడం కారణంగా ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నట్లు హెచ్చరిస్తున్నారు. 11వ తేదీ లేదా 12వ తేదీ నుంచి రాష్ట్రంలో ఎండలు మరింతగా మండబోతున్నట్టు వాతావరణ పరిశోధకుడు ప్రదీప్ జైన్ తెలిపారు. సాధారణ రోజుల కంటే నాలుగు డిగ్రీలు అధికంగా భానుడి భగ భగలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని వివరించారు. ఈ దృష్ట్యా, రోజు వారి ఉష్ణోగ్రత 38 నుంచి 40 డిగ్రీల వరకు ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**8 రోజుల్లో 16.5 సెంటీమీటర్ల వర్షం**

ఈనెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు అకాల వర్షాల రూపంలో తమిళనాడులో 16.5 సె.మీ వర్ష పాతం నమోదైంది. గత ఏడాది మేలో కేవలం 6 సె.మీ మాత్రమే వర్షం కురవడం గమనార్హం. ఇక సోమవారం రాత్రి , మంగళవారం ఉదయం కోయంబత్తూరు, నీలగిరి, దిండుగల్, కరూర్, నామక్కల్ జిల్లాల్లో మోస్తరు వర్షం పడింది. కొడైకెనాల్‌లో అయితే వాతావరణం ఆహ్లాదకరంగా మారింది.

## రెండేళ్లుగా ఇంట్లోనే స్వీయ నిర్బంధం



గ్రిల్ గేట్ లోపలి నుంచి అధికారులతో మాట్లాడుతున్న అలెగ్జాండర్ కుటుంబం

- ఆన్‌లైన్‌లోనే ఆహారం, వస్తువుల కొనుగోలు
- నాగర్‌కోయిల్‌లో ఓ కుటుంబం వింత ప్రవర్తన

సాక్షి, చెన్నై : నాగర్‌కోవిల్‌లో రెండు సంవత్సరాలుగా తమకు తామే నిర్బంధం విధించికుని ఓ కుటుంబం వింతగా ప్రవర్తిస్తోంది. దీంతో వారిని ఎలాగైనా బయటకు రప్పించి ఆస్పత్రిలో చికిత్స అందించాలని అధికారులు యత్నిస్తున్నారు. వివరాలు.. నాగర్‌కోవిల్ పాతస్టేట్ బ్యాంకు కాలనీ వీధిలో నివాసం ఉంటున్న పోర్షియస్ అలెగ్జాండర్(70). ఇతనికి భార్య, ఉద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ నలుగురు గత రెండేళ్లకు గాపై ఇంటి నుంచి బయటకు రాలేదు. తమను తామే ఖైదు చేసుకున్నారు. ఆ ఇంటిలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియలేదు. ఈ విషయాన్ని స్థానికులు జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారికి తెలియజేశారు. ఈక్రమంలో అధికారులు సరోజిని, నేసమణి నగర్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జయలక్ష్మి, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులు మంగళవారం ఆ ఇంటి వద్దకు చేరుకుని ఎన్నిసార్లు పిలిచినా ఎవరూ ఇంటి నుంచి బయటకు రాలేదు. చివరికి గేటు పగులగొట్టి లోపలికి వెళ్లారు. ఇంటిలో పోర్షియస్ అలెగ్జాండర్, ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారు తలుపులు తెరవకుండా గ్రిల్ ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నట్లు గుర్తించారు. నాగర్ కోవిల్ మణిమేడై వారి స్వగ్రామమని తెలిపారు. అక్కడ దుకాణాలు ఉన్నాయని, వాటిని అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. ప్లాట్‌ఫారాలపై దుకాణాలు నిర్మించారంటూ.. తమను పోలీసులు బెదిరించారని తెలిపారు. అలాగే తాము ఇంటి నుంచి బయటకు వస్తే వెంటనే హత్య చేయడానికి కొందరు పొంచి ఉన్నారని వెల్లడించారు. ఇంట్లో అందరూ ఆరోగ్యంగానే ఉన్నట్లు పేర్కొన్నారు. తమకు ఎలాంటి సమస్య లేదన్నారు. ఈ మేరకు వారి వద్ద లిఖితపూర్వకంగా సమాధానం తీసుకుని అధికారులు వెనుదిరిగారు. అనంతరం అధికారులు మీడియాతో మాట్లాడుతూ.. ఇంటిలో ఉన్న ఆ నలుగురు ఏదో మానసిక సమస్యతో బాధపడుతున్నట్లు భావిస్తున్నామని వెల్లడించారు. వారికి తగిన కౌన్సెలింగ్, వైద్య చికిత్స అందజేయడంతో పాటు వారి బంధువులకు సమాచారం ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. వారు గత రెండేళ్లుగా అన్ని వస్తువులను ఆన్‌లైన్ ద్వారానే వీరు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. అప్పుడప్పుడు బయట వారిని బైనాక్యులర్ ద్వారా చేస్తున్నట్లు తెలిపారు.

## రోడ్డెక్కిన ఆటోడ్రైవర్లు

– సీఐటీయూ నిరసనల హోరు

సాక్షి, చెన్నై: సీఐటీయూ నేతృత్వంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు రోడ్డెక్కారు. తమ డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా నినదిస్తూ ఆందోళనలు నిర్వహించారు. ఇక డీఎంకే కూటమిలోని వామ పక్షాలకు చెందిన సీఐటీయూ, ఏఐటీయూసీ వంటి కార్మిక సంఘాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరుబాట చేపట్టడం రాష్ట్రంలో రాజకీయ చర్చకు దారి తీసి ఉంది. తాజాగా మంళవారం సీఐటీయూ నేతృత్వంలోని ఆటో కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ఒక రోజు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెన్నైలో ఎగ్మూర్ రాజరత్నం స్టేడియం వద్ద ఈ ఆందోళన చేపట్టారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలోనే ఇంత వరకు కేంద్రం తీసుకొచ్చిన మోటారువెహికల్ చట్టాన్ని అమలు చేయలేదని ఆటో కార్మికులు గుర్తు చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తమిళనాడులో ఆగమేఘాలపై అమలు చేయడానికి ఉత్సాహం చూపిస్తుండడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వీడాలని లేని పక్షంలో, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఆటో మీటర్ చార్జీలు నిర్ణయించి పదేళ్లకు పైగా అవుతోందని, కొత్త చార్జీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఓలా వంటి ప్రైవేటు సంస్థలకు కళ్లెం వేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వ నేతృత్వంలోని ఆటో యాప్‌ను ఆవిష్కరించాలని, దీని నిర్వహణకు ప్రత్యేక అధికారుల బృందాన్ని నియమించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

## టాపర్ నందినికి సీఎం అభినందన



నందినికి బహుమతులు అందజేస్తున్న సీఎం

జ్ఞాపికను అందజేసి అభినందిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

సాక్షి, చెన్నై: ప్లస్–2 ఫలితాల్లో 600లకు 600 మార్కులను సాధించిన విద్యార్థి నందినిని సీఎం స్టాలిన్ మంగళవారం అభినందించారు. దిండుగల్ అన్నామలయార్ మిల్స్ బాలికల మహోన్నత పాఠశాలకు చెందిన నందిని రాష్ట్రంలో తొలి ర్యాంకర్‌ను కైవసం చేసుకుంది. ఈ బాలికను సీఎం స్టాలిన్ అభినందించాలని నిర్ణయించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి రాత్రికి రాత్రే ఆ బాలిక చెన్నైకు చేరుకుంది. ఉదయాన్నే సీఎం క్యాంప్ ఆఫీసులో స్టాలిన్‌ను నందిని కలిశారు. ఆబాలికను అభినందించడమమే కాకుండా ఉన్నత విద్యకు అవసరం అయ్యే ఏర్పాట్లు చేస్తానని సీఎం స్టాలిన్ హామీ ఇచ్చారు. సీఎంను కలిసినాంతరం నందిని మీడియాతో మాట్లాడుతూ, తాను ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహంతోనే చదువుకున్నట్లు వెల్లడించారు. సీఎం స్టాలిన్ తనను అభినందించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కాగా తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు నందినికి బంగారు పెన్‌ను బహుమతిగా అందజేశారు. అలాగే మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా నందినికి జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

## కామెర్ల టీకాలు తప్పనిసరి

– ప్రజా ఆరోగ్య శాఖ ఆదేశాలు

కొరుక్కుపేట: విదేశాలకు వెళ్లే వారు కామెర్ల టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలని ప్రజా ఆరోగ్య శాఖ అధికారులు స్పష్టం చేశారు. ఈమేరకు రాష్ట్ర ప్రజారోగ్య, అంటు వ్యాధుల నివారణ విభాగం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో ఆఫ్రికా, దక్షిణ అమెరికా ఖండాలకు వెళ్లే ప్రయాణికులు కామెర్ల టీకాలను కచ్చితంగా వేయించాలన్నారు. ప్రస్తుతం ఆఫ్రికా, దక్షిణ అమెరికాలో కామెర్ల వ్యాధి వ్యాప్తి అధికంగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. టీకా వేసుకున్న ప్రయాణికుల విమానాశ్రయాల్లోనే ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ టీకాలు చెన్నై గిండిలోనే కింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోనూ, రాజాజీ రోడ్‌లోని హార్బర్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్, తూత్తుకుడిలోని న్యూ పోర్ట్ ప్రాంగణంలో వేస్తామని పేర్కొన్నారు. తమిళనాడులో కేవలం ఈ మూడు ప్రదేశాలు మాత్రమే ప్రస్తుతం కామెర్ల టీకా కేంద్రాలు ఉన్నాయని ఇతర ప్రాంతాల్లో లేవని స్పష్టం చేశారు.

# ఎన్ఐఏ అటాక్

- పీఎఫ్ఐ నేతలే టార్గెట్
- అదుపులో ముగ్గురు అనుమానితులు



సాధిక్‌ను విచారణకు తీసుకువెళుతున్న అధికారులు

సాక్షి, చెన్నై : నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాకు చెందిన మాజీ నేతలను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) మంగళవారం టార్గెట్ చేసింది. రాష్ట్రంలోని పలు నగరాల్లో ఆ సంస్థకు చెందిన మాజీ సభ్యులు, సానుభూతిపరుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టారు. ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల కాలంగా తరచూ ఎన్ఐఏ సోదాలు విస్తృతంగా జరుగుతున్న విషయం తెలిసిందే. విదేశాల నుంచి దొడ్డిదారిలో నిధులు సమీకరించి, దేశంలో అల్లకల్లోలం సృష్టించే వ్యూహంతో ఉన్నారనే సమాచారంతో గత ఏడాది పాపులర్‌ఫ్రంట్ ఆఫ్ ఇండియాతో పాటు దాని అనుబంధ సంస్థలపై గత ఏడాది నిషేధం విధించారు. తమిళనాడులోని ఈ సంస్థల కార్యాలయాలన్నీ మూతపడ్డాయి. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వారిని తరచూ ఎన్ఐఏ టార్గెట్ చేస్తూ వస్తోంది.

**ముమ్మరంగా సోదాలు..**

మంగళవారం ఉదయాన్నే ఎన్ఐఏ అధికారులు మరోసారి రంగంలోకి దిగారు. చెన్నైలోని తిరువొత్తియూరు , ఓట్టేరిలో పెద్దఎత్తున తనిఖీలు చేపట్టారు. తిరువొత్తియూరుకు చెందిన అబ్దుల్ రజాక్‌ను ప్రశ్నిస్తున్నారు. అలాగే, న్యూ వాషర్‌మెన్ పేటలోనూ సోదాలు చేశారు. మదురై నెల్‌పేటలో అబ్బాస్, తెప్పకులం ముజీర్, పళనిలో మహ్మద్ కైషర్, తేనిలో సాధిక్ నివాసాలలో తనిఖీలు నిర్వహించి కీలక పత్రాలు, వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వీరంతా పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాకు చెందిన మాజీ నేతలు కావడం గమనార్హం. మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు సమాచారం. అలాగే షార్జా నుంచి తంజావూరుకు వచ్చిన మహ్మద్ అజారుద్దీన్ అనే యువకుడిని కూడా ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. వీరి ఇళ్లల్లో జరిగిన సోదాలలో ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్ హార్డ్ డిస్క్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నారు.

# త్వరలో చిన్నమ్మతో భేటీ

- పన్నీరు సెల్వం



పన్నీరు సెల్వం

సాక్షి, చెన్నై : మరికొద్ది రోజుల్లో చిన్నమ్మ శశికళతో భేటీ కానున్నట్లు అన్నాడీఎంకే సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం తెలిపారు. అన్నాడీఎంకేను సమష్టిగా కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అన్నాడీఎంకేను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో పళనిస్వామి తన గుప్పెట్లోకి తెచ్చుకున్న విషయం తెలిసిందే. అయితే, ఎలాగైనా పార్టీని తన వశం చేసుకునే దిశగా సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం ఎత్తుకు పైఎత్తు వేస్తున్నారు. అన్నాడీఎంకేలో చీలిక కారణంగా ఆవిర్భవించిన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్‌తో పన్నీరు సెల్వం సోమవారం రాత్రి చేతులు కలిపారు. ఈ ఇద్దరు నేతలు ఏకం కావడంతో రాష్ట్రంలోని దక్షిణ తమిళనాడులో ఉన్న బలమైన ఓ సామాజిక వర్గం అంతా ప్రస్తుతం వీరి వెంట నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. అన్నాడీఎంకేలో బలంగా ఉన్న ఈ సామాజిక వర్గానికి చెందిన ద్వితీయశ్రేణి నేతల చూపు ప్రస్తుతం ఈ ఇద్దరి కలయికపై పడింది. అలాగే దివంగత సీఎం జయలలిత నెచ్చెలి, చిన్నమ్మ శశికళ సైతం వీరితో చేతులు కలిపిన పక్షంలో దక్షిణ తమిళనాడులో పళని స్వామిని అన్నాడీఎంకే పరంగా బలహీనుడు చేయవచ్చు అనే యోచనలో ఆ సామాజిక వర్గం ఉండడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అదే సమయంలో దినకరన్‌తో భేటీ సంతృప్తికరంగా జరిగిందని, ఇక, చిన్నమ్మ శశికళను కూడా తాను కలవబోతున్నట్లు పన్నీరు సెల్వం ప్రకటించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, త్వరలో లేదా మరికొద్ది రోజుల్లో చిన్నమ్మ శశికళను కలవనున్నట్లు తెలిపారు. అందరం కలిసి సమష్టిగా ముందుకెళ్తామని, ఐక్యంగా అన్నాడీఎంకేను కైవసం చేసుకుంటామని పన్నీరు సెల్వం ధీమా వ్యక్తం చేయడం గమనార్హం.

## క్లుప్తంగా

### ఉద్యోగం పేరుతో మోసం

• ఇద్దరికి ఆరు నెలల జైలు శిక్ష

**తిరువొత్తియూరు:** చెన్నై అంబత్తూరుకు చెందిన రవికుమార్ (48), అరక్కోణానికి చెందిన నవీన్ (33) నుంగంబాక్కంలోని ఓ ప్రైవేటు సంస్థలో అధికారులుగా పనిచేస్తున్నట్లు స్థానికులను నమ్మించారు. తమ సంస్థలో ఉద్యోగాలు తీసిస్తామని చెప్పి పలువురి వద్ద రూ. 6.25 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు తేలింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ పూందమల్లి క్రైమ్ కోర్టులో సాగుతూ వచ్చింది. సోమవారం విచారణ అనంతరం మేజిస్ట్రేట్ స్టాలిన్ రవికుమార్, నవీన్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ. 6.25 లక్షల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

### ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

**అన్నానగర్:** అలంగనల్లూరులో సోమవారం సాయంత్రం ప్లస్–1 విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. మదురై జిల్లా అలంగనల్లూరు మునియాండిపురానికి చెందిన మాడస్వామి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతని కుమార్తె గోమతి (16). ఈమె ఆ ప్రాంతంలోని ఓ పాఠశాలలో ప్లస్–1 చదివి వేసవి సెలవుల కారణంగా ఇంట్లోనే ఉంటోంది. ఈనేపథ్యంలో సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గోమతి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అలంగనల్లూరు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కమలముత్తు ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గోమతి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా గోమతి ఆత్మహత్యకు గల కారణాలు వెల్లడి కాలేదు.

### చేపలు పట్టేందుకు వెళ్లి రైతు మృతి

**అన్నానగర్:** వేప్పందట్ట సమీపంలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ రైతు బురదలో కూరుకుపోయి మృతి చెందాడు. వివరాలు.. పెరంబలూరు జిల్లా వేప్పందట్ట సమీపంలోని వెంగళం గ్రామానికి చెందిన కుమార్ (40) రైతు. మంగళవారం ఉదయం తాలుదాలైలోని పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఆధీనంలోని ఓ కుంటలో చేపల వేటకు వెళ్లాడు. నీటిలోకి దిగి చేపల కోసం వల వేసినప్పుడు అనూహ్యంగా బురదలో కూరుకుపోయి మరణించాడు. సమాచారం అందుకున్న అరుంబవూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెరంబలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో రైతు కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 'ఏలగిరి వేసవి ఉత్సవం' ఏర్పాట్లు వేగవంతం


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ భాస్కర పాండియన్

**వేలూరు:** ఏలగిరి వేసవి ఉత్సవం ఏర్పాట్లను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ భాస్కర పాండియన్ అధికారులను ఆదేశించారు. తిరుపత్తూరు జిల్లాలోని ఏలగిరి కొండపై వేసవి ఉత్సవాలు ఏటా రెండు రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. కరోనా కారణంగా గత కొన్నేళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహించలేదు. ఈ సంవత్సరం వేడుకలు పెద్దఎత్తున నిర్వహించడంపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వేసవి ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పర్యాటకులు అధిక సంఖ్యలో రానున్నందున కొండపై అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రారంభోత్సవం రోజున వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, పుష్పాలతో ప్రదర్శన, అన్ని శాఖ అధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై ఫొటో ప్రదర్శన, పారాగ్లైడింగ్ పోటీలు, చిన్న పిల్లలకు ఆట వస్తువులు, క్రీడా పోటీలు వంటివి నిర్వహించాలన్నారు. అదే విధంగా పర్యాటకులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలన్నారు. మహిళా సంఘాలచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, అటవీ ప్రాంతంలో పండించే పంటలను ప్రదర్శనగా ఉంచే విధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఉత్సవాలకు జిల్లా నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, పర్యాటకులకు తాగునీరు, భోజన వసతి తదితర వాటిని సిద్ధం చేయాలన్నారు. అధికారులు సెలవులు పెట్టకుండా విధులు నిర్వహించాలన్నారు. ఉత్సవాలను ఈనెల 27,28వ తేదీల్లో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వలర్‌మది, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్టు అధికారి సెల్వ అరసు, సబ్ కలెక్టర్ విల్సన్ రాజశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహానికి అంత్యక్రియలు

**అన్నానగర్:** పులియంగుడి సమీపంలో ఓ ప్రమాదంలో మృతి చెందిన వృద్ధురాలి మృతదేహానికి స్థానిక ముస్లిం యువకుల సహకారంతో పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. తెన్‌కాశి జిల్లా కడయనల్లూరు సమీపంలోని పులియంగుడి పవర్‌బోర్డు సమీపంలోని డైలీ నిమ్మ మార్కెట్ ముందు 65 ఏళ్ల గుర్తు తెలియని మహిళ నడుచుకుంటూ వస్తోంది. అటువైపుగా వచ్చిన ప్రభుత్వ బస్సు ఢీకొని మృతి చెందింది. చొక్కంపట్టి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ వడయార్ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఇంత వరకు ఎవరూ రాకపోవడంతో సబ్‌ఇన్‌స్పెక్టర్ వడయార్‌సామి ముస్లిం యువకుల సాయంతో వృద్ధురాలి మృతదేహాన్ని ఖననం చేశారు.

## మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు సాయం



ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేస్తున్న వెంకటేషన్

• కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం

**తిరువళ్లూరు:** ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన సెప్టిక్ ట్యాంక్‌ను శుద్ధి చేసే సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు పారిశుధ్య కార్మికులకు సాయం అందించాలని అధికారులు నిర్ణయించారు. మొదటి విడతలో రూ.11 లక్షల ఆర్థిక సాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తున్నట్లు పారిశుధ్య కార్మికుల సంక్షేమ జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేషన్, కలెక్టర్ ఆల్బీ జాన్‌వర్గీష్ ప్రకటించారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా మీంజూరు అత్తిపట్టులో ఇమ్మాను యేల్ మెట్రిక్ పాఠశాల ఉంది. ఈ పాఠశాలను అదే ప్రాంతానికి చెందిన విక్టర్ నిర్వహిస్తున్నాడు. పాఠశాలకు మే1న సెలవు కావడంతో సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం మీంజూరు మున్సిపాలిటీలో పారిశుధ్య శాశ్వత కార్మికులు గోవిందన్, సుబ్బరాయలును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఇద్దరు కార్మికులు సెప్టిక్ ట్యాంకర్‌ను శుభ్రం చేసే సమయంలో విషవాయువు పీల్చి ఊపిరాడక అక్కడిక్కడే మరణించారు. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. కాగా పారిశుధ్య కార్మికులు మృతి చెందిన నేపథ్యంలో వారి కుటుంబాలను ఆదుకోవాలని అధికారులు నిర్ణయించారు.

### తాటి చెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి

**అన్నానగర్:** తిరుమయం సమీపంలో సోమవారం సాయంత్రం తాటి చెట్టుపై నుంచి పడి ఓ డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. పుదుకోట్టై తిరుమయం సమీపంలోని పరాయంబట్టి గ్రామానికి చెందిన మురుగేశన్ (52) డ్రైవర్. సోమవారం సాయంత్రం తిరుమయం తామరైకణ్మాయి ఒడ్డున తాటిచెట్టు ఎక్కాడు. అయితే అనూహ్యంగా పట్టుతప్పి 40 అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోయాడు. ఆ తర్వాత ఇరుగుపొరుగు వారు అతడిని రక్షించి తిరుమయం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మురుగేశన్ మృతి చెందినట్లు తెలిపారు. తిరుమయం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### జల్లికట్టు ఎద్దు పొడిచి యజమాని..

**అన్నానగర్ :** మేలూరు సమీపంలో మంగళవారం జల్లికట్టు ఎద్దు పొడిచి యజమాని మృతి చెందాడు. వివరాలు..మదురై జిల్లా మేలూరు సమీపంలోని డి.అండిపట్టికి చెందిన మునిస్వామి (33). ఇతను సిమెంట్ మిక్సర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అలాగే జల్లికట్టు ఎద్దును పెంచుతున్నాడు. ఈ ఎద్దు వివిధ పోటీల్లో పాల్గొంది. ఈక్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో కట్టేసిన ఎద్దు తాడు తెంపుకుని పారిపోయింది. ఎద్దును పట్టుకునేందుకు వెళ్లిన మునిస్వామిని ఆ ఎద్దు కుమ్మడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇరుగుపొరుగు వారు రక్షించి 108 అంబులెన్స్‌లో మేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గంమధ్యలో అతడు మృతి చెందాడు. ఈ ఘటనపై మేలూరు పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆనందజ్యోతి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# దంత వైద్య విధానంలో ప్రతిభ


ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న విద్యార్థి

**సాక్షి, చెన్నై:** సవీత డెంటల్ కాలేజీలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థి లింగం సాయి చరణ్, డైనమిక్ నావిగేషన్ సిస్టమ్‌ని ఉపయోగించి గైడెడ్ ఎండోంటిక్ యాక్సెస్ ఓపెనింగ్‌ను విజయవంతం చేశారు. ఈ విధానంలో మొదటి అండర్ గ్రాడ్యుయేట్‌గా అతడు సాధించిన ఘనతకు ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కింది. కన్జర్వేటివ్ డెంటిస్ట్రీ, ఎండోడాంటిక్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. ఎ. హిమ సందీప్ మార్గనిర్దేశం ఈ విధానాన్ని పూర్తి చేశారు. డైనమిక్ నావిగేషన్ సిస్టమ్‌ని ఉపయోగించి, ఈ విద్యార్థి పూర్తి నోటి పునరావాస కేసులో 3 డైమెన్షనల్ గైడెడ్ ఎండోడోంటిక్ యాక్సెస్ ప్రిపరేషన్‌ను ప్రదర్శించారు. సీమట్స్ చాన్స్‌లర్ డాక్టర్ ఎన్.ఎమ్. వీరయ్యన్‌సహా పలువురు ప్రముఖ అతిథుల సమక్షంలో ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ డైరెక్టర్ డాక్టర్.కె.సాధమ్ హుస్సేన్ ఈ అవార్డును లింగం సాయి చరణ్‌కు మంగళవారం అందజేశారు. అకడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ దీపక్ నల్లస్వామి, రిజిస్ట్రార్ డాక్టర్ షీజా ఎస్.వర్గీస్, డీన్ డా.ఎస్.అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ట్రో, లివర్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ జాయ్ వర్గీస్, డాక్టర్ రాజేష్

**కొరుక్కుపేట:** చెంగల్పట్టు జిల్లా కాట్టాన్కుళత్తూరులోని ఎస్ఆర్ఎం గ్లోబల్ ఆసుపత్రిలో గ్యాస్ట్రో, లివర్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం నగరంలో ఏర్పాటైన కార్యక్రమంలో కాలేయ చికిత్సా విభాగాధిపతి డాక్టర్ జాయ్ వర్గీస్, ఆ ఆసుపత్రి సీఈఓ చంద్రశేఖర్ పాల్గొని కాలేయ మార్పిడి, గ్యాస్ట్రోఎంటరాలజీ సేవలను ఘనంగా ప్రారంభించారు. 200 పడకల సదుపాయం కలిగిన ఆసుపత్రిలో కాలేయి మార్పిడి చికిత్సలకు అవసరమైన అంతర్జాతీయ స్థాయి పరికరాలు కూడా ఉన్నాయని డాక్టర్ రాజేష్ తెలిపారు. కాలేయ చికిత్సా విభాగంలో రోజూ వైద్యనిపుణులు నిర్విరామ సేవలందిస్తారని, అత్యవసర కేసులకు హాజరయ్యేందుకు శస్త్రచికిత్స నిపుణులు సిద్ధంగా ఉంటారని చెప్పారు. సమావేశంలో డాక్టర్ పద్మిని రాగిణి, డాక్టర్ మైథిలి పాల్గొన్నారు.

## వెటర్నరీ ఆసుపత్రి ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నా


అధికారులతో స్థానికుల వాగ్వాదం

**వేలూరు:** వేలూరు తొరపాడి సెంట్రల్ జైలు వెనుక వైపున ఉన్న రామ్‌సెట్ నగర్‌లో సుమారు 300 కుటుంబాలకు పైగా జీవిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని ముఖ ద్వారంలోనే ప్రభుత్వానికి సొంతమైన స్థలంలో ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రి నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు మంగళవారం ఉదయం సర్వే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానికులు అధిక సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ఇక్కట వెటర్నరీ ఆసుపత్రి నిర్మించడం వల్ల ఈ ప్రాంతంలోని పశువులు, మేకలు అధిక సంఖ్యలో రోజూ ఇక్కడ చేరడంతో దుర్వాసనతో పాటు దోమల బెడద అధికమై వింత వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆరోపిస్తూ స్థానికులు రోడ్డుపై బైటాయించారు. వెటర్నరీ ఆసుపత్రిని వేరే ప్రాంతంలో నిర్మించాలని లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకోవడంతో స్థానికులు వారితో వాగ్వివాదానికి దిగారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆసుపత్రి నిర్మాణ పనులను నిలిపివేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# సిద్ధి ఇద్నాని వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు


సిద్ధి ఇద్నాని

**తమిళసినిమా:** ఒక్కోసారి సినిమాతో పాటు అందులో నటించిన తారలు చిక్కుల్లో పడుతుంటారు. ప్రస్తుతం నటి సిద్ధ్ ఇద్నాని పరిస్థితి ఇదే. ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన చిత్రం ది కేరళ స్టోరి. వివాదాస్పద కథాంశంతో రూపొందిన ఈ చిత్రం వ్యతిరేక సెగల్లో గిల గిల్లాడుతోంది. రాజకీయ మంటలు రేపుతోంది. దేశంలో అధికార పార్టీ మద్దతుగా నిలిచినా, ప్రతి పక్షాలు మండిపడుతున్నాయి. కారణం కేరళలో జరిగిన యదార్ధ సంఘటన ఇతివృత్తంతో ఈ చిత్రం రూపొందడమే. అదీ 32 వేల మందిని బలవంతంగా ఇస్లామిక్ మతస్తులుగా మార్చి ఉగ్రవాదులుగా తయారు చేసినట్లు చూపడంతో చిత్రంపై ఆగ్రహ జ్వాలలు ఎగసి పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆ చిత్రంలో గీతాంజలి అనే ఒక ప్రధాన పాత్రలో సిద్ధి ఇద్నాని నటించింది. ఈమె నటుడు శింబు కథానాయకుడిగా నటించిన వెందు తనిందది కాడు చిత్రం ద్వారా కథానాయికగా పరిచయం అయ్యింది. నటుడు హరీష్ కల్యాణ్‌కు జంటగా నటించిన నూరు కోడి వానవిల్ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఆర్యకు జంటగా ఖాదర్ భాషా చిత్రంలో నటిస్తోంది. కాగా అగ్నికి ఆజ్యం పోసినట్లు ఒక పక్క కేరళ స్టోరీ చిత్రంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్న పరిస్థితుల్లో నటి సిద్ధి ఇద్నాని తన ఇన్ స్టాగామ్ కేరళ స్టోరీ వివాదాస్పద కథా చిత్రం కాదని, అవగాహన కలిగించే చిత్రం అని పేర్కొంది. ఇది ఏ మతాన్ని వ్యతిరేకించే చిత్రం కాదని, తీవ్రవాదాన్ని ఖండించే కథా చిత్రం అని, అలాంటి చిత్రంలో నటించడం బాధ్యతగా భావించానని పేర్కొంది. ఈ అమ్మడి వ్యాఖ్యలు ఇప్పుడు మరింతగా ప్రకంపనాలు పుట్టిస్తున్నాయి. కొందరు ఈమె వ్యాఖ్యలపై మండి పడుతుండగా.. మరికొందరు మద్దతు ఇస్తున్నారు.

## కోలీవుడ్ టాక్స్

# కమలహాసన్ సంస్థలో శింబు


కమలహాసన్, శింబు

**తమిళసినిమా:** విశ్వ నటుడు కమల్ హాసన్ కథానాయకుడిగా నటించి తన రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించిన విక్రమ్ చిత్రం ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కమలహాసన్ నటుడిగా, నిర్మాతగా బిజీ అయిపోయారు. ప్రస్తుతం ఆయన శంకర్ దర్శకత్వంలో నటిస్తున్న ఇండియన్– 2 చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. తదుపరి మణిరత్నం దర్శకత్వంలో తన 234వ చిత్రంలో నటించడానికి సిద్ధమవుతున్నారు. అదేవిధంగా నిర్మాతగాను వరుసగా చిత్రాలు నిర్మిస్తున్నారు. ఇటీవలే కమలహాసన్ తన సంస్థలో శివకార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటిస్తున్న చిత్ర షూటింగ్ ప్రారంభమైంది. కాగా వెనువెంటనే మరో చిత్రాన్ని నిర్మించడానికి సిద్ధమవుతున్నారన్నది తాజా సమాచారం. నటుడు శింబు హీరోగా కమల్ హాసన్ ఓ చిత్రాన్ని నిర్మించనున్నట్లు ఇప్పటికే ప్రచారం జరిగింది. ఆ క్రేజీ చిత్రం జూన్ ఒకటో తేదీ నుంచి సెట్ పైకి వస్తునట్లు సమాచారం. దీనికి దేశింగు పెరియ సామి దర్శకత్వం వహించనున్నారు. ఈచిత్ర యూనిట్ ప్రస్తుతం లొకేషన్ ఎంపికలో ఉన్నట్లు తెలుస్తోంది. మరికొద్ది రోజుల్లో ఆ పని పూర్తి చేసుకుని షూటింగ్‌కు సిద్ధమవుతారని సమాచారం. చిత్ర పూజా కార్యక్రమం చెన్నైలో ప్రారంభించి తొలి షెడ్యూల్ ఇక్కడే నిర్వహించనున్నట్లు తెలిసింది. చిత్రం ఫ్లాష్‌బ్యాక్ శింబు పోరాట వీరుడిగా నటించే సన్నివేశాలు ఉంటాయని ఆ గెటప్‌కు మారడం కోసం శింబు తగిన కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. కాగా దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# లియోలోకి యాక్షన్ కింగ్

**తమిళసినిమా:** సినీ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తున్న చిత్రం లియో. దీనికి ప్రధాన కారణం నటుడు విజయ్, దర్శకుడు లోకేష్ కనకరాజ్ కాంబోలో తెరకెక్కుతున్న భారీ చిత్రం కావడమే. వీరి కాంబినేషన్లో ఇంతకుముందు రూపొందిన మాస్టర్ చిత్రం సూపర్ హిట్ అయ్యింది. అదేవిధంగా దర్శకుడు కమల్ హాసన్ కథానాయకుడిగా తెరకెక్కించిన విక్రమ్ చిత్రం ఘన విజయం సాధించింది. ఇక విజయ్ నటించిన తాజా చిత్రం వారీసు కూడా సక్సెస్ అయ్యింది. దీంతో లియో చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. నటి త్రిష, ప్రియా ఆనంద్, నటుడు అర్జున్, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, మన్సూర్ అలీఖాన్, దర్శకుడు మిష్కిన్, గౌతమ్ మీనన్, మ్యాథ్యూ థామస్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ పతాకంపై లలిత్ కుమార్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది ఇప్పటికే కాశ్మీర్లో భారీ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. కాగా మంగళవారం నుంచి లియో చిత్ర షూటింగ్లో యాక్షన్ కింగ్ అర్జున్ పాల్గొంటున్నట్లు సమాచారం. ఈ చిత్రం కోసం వేసిన భారీ సెట్లో అర్జున్‌కు సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లు తెలిసింది.. కాగా ఈ చిత్రంలో నటుడు అర్జున్ గెటప్ కోసం ప్రత్యేకంగా ఇటీవల లుక్ టెస్ట్ చేసినట్లు చిత్రవర్గాలు వెల్లడించాయి.


విజయ్, యాక్షన్ కింగ్ అర్జున్




# భూటాన్‌లో విహార యాత్ర

**తమిళసినిమా:** నా జీవితం నా ఇష్టం అంటూ స్వేచ్ఛగా జీవించే వాళ్లలో నటి ఆండ్రియా ఒకరు. కథానాయకి పాత్రలోనే నటిస్తాను అంటూ అలాంటి చట్రంలో ఇరుక్కోకుండా, తనను వెతుక్కుంటూ వచ్చిన పాత్రలకు ఎలా న్యాయం చేయాలి అని భావించే నటి ఈ బ్యూటీ. అలా కథానాయకిగా, ప్రతినాయకిగా తనదైన శైలిలో నటించి ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానాన్ని పొందిన నటి ఆండ్రియా. ఇంకా వివాదాస్పద పాత్రలోనూ నటించడానికి వెనుకాడని నటి ఈమె. అలా తంగమీన్ గల్, వడచెన్నై, ఆయిరత్తిల్ ఒరువన్, విశ్వరూపం, అరణ్మణై వంటి విజయవంతమైన చిత్రాల్లో నటిగా తనదైన ముద్ర వేసుకుంది. ప్రస్తుతం మిష్కిన్ దర్శకత్వంలో నటించిన పిశాచి– 2 చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పుడు ఈమె చేతిలో మాళిగై, కి చిత్రాలు ఉన్నాయి. గాయనీ గానూ బిజీగా ఉన్న ఆండ్రియా ప్రస్తుతం భూటాన్ దేశంలో విహార యాత్ర చేస్తోంది. అక్కడ ఆమె అందమైన ప్రదేశాల్లో దిగిన ఫొటోలను తన ఇన్ స్టాగామ్‌లో పోస్ట్ చేసింది. అందులో భూటాన్ దేశంలో అనుభవించడానికి అద్భుతమైన మూడు విషయాలు ఉన్నాయని పేర్కొంది. ఇక్కడ హిమాలయ పర్వతాలను, వాటి పరిసర ప్రాంతాలను తిలకించవచ్చని చెప్పింది. అదే విధంగా ఇక్కడ కాలిబాటలో స్వచ్ఛమైన గాలిని శ్వాసించవచ్చు అని పేర్కొంది. ఇక మూడో విషయం బౌద్ధ భూమి అయిన ఈ భూటాన్ లో ఆధ్యాత్మిక భావనను ఆస్వాదించవచ్చని వెల్లడించింది.


ఆండ్రియా

# వీరన్ విడుదల తేదీ ఖరారు

**తమిళసినిమా:** కోలీవుడ్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకుని సక్సెస్‌ఫుల్ పయనాన్ని సాగిస్తున్న నటుడు హిప్ హాప్ తమిళా ఆది. మొదట సంగీత దర్శకుడిగా పరిచయం అయిన ఈయన ఆ తర్వాత కథానాయకుడిగా అవతారమెత్తి చిత్రం తర్వాత చిత్రం చేసుకుంటూ పోతున్నారు. తాజాగా ఈయన కథానాయకుడిగా నటించిన చిత్రం వీరన్. బాలీవుడ్ నటి అధిర రాజ్ నాయకిగా నటించిన ఇందులో శశీ, కాళీ వెంకట్, మునిష్కాంత్, మృగానందం తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. సత్య జ్యోతి ఫిలిమ్స్ పతాకంపై టీజీ త్యాగరాజన్ సమర్పణలో సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మరకత నాణియం చిత్రం ఫేమ్ ఏఆర్ కె.శరవణన్ దర్శకత్వం వహిస్తున్నారు. హిప్ హాప్ తమిళ ఆది సంగీతాన్ని, డి.మీనన్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. కాగా ఈ చిత్రాన్ని జూన్ 2వ తేదీన శక్తి ఫిలిం ఫ్యాక్టరీ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఇది సూపర్ హీరో ఇతివృత్తంతో సాగే రూరల్ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా వీరన్ చిత్రం ఉంటుందన్నారు.


వీరన్ చిత్రంలో హిప్ హాప్ తమిళా ఆది

## క్లుప్తంగా

### బావిలో పడి రెండేళ్ల బాలుడి మృతి

**అన్నానగర్:** పాలకోడ్ సమీపంలో సోమవారం సాయంత్రం బావిలో పడి రెండేళ్ల బాలుడు మృతి చెందాడు. ధర్మపురి జిల్లా పాలకోడ్ సమీపంలోని కట్టంపట్టి గ్రామానికి చెందిన రాజశేఖర్ నిర్మాణ కార్మికుడు. ఇతని భార్య సాలా. వీరికి 7 ఏళ్ల కుమార్తె, 2 ఏళ్ల కుమారుడు రంజిత్ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ పిల్లలను అమ్మమ్మ వద్ద వదిలి భవన నిర్మాణ పనుల నిమిత్తం బెంగళూరు వెళ్లారు. సోమవారం సాయంత్రం ఇంటి దగ్గర ఆడుకుంటున్న రంజిత్ అక్కడున్న వ్యవసాయ బావిలో పడిపోయాడు. కొద్దిసేపటికే నీటిలో మునిగి చనిపోయాడు. దీనిపై సమాచారం అందుకున్న పాలకోడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బావిలో బాలుడు మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం పాలకోడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్లస్ టులో ఫెయిల్..

- వేర్వేరు చోట్ల నలుగురు విద్యార్థుల బలవన్మరణం

**తిరువొత్తియూరు:** ప్లస్ టు పరీక్షలో ఫెయిల్ అయి మనస్తాపంతో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్లస్ టు పబ్లిక్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. చెన్నై ఆవడి, గోవర్ధనగిరి భారతీనగర్ ఒకటో వీధికి చెందిన కనకరాజు కుమారుడు దేవ (17), విల్లుపురం జిల్లా వానూరు సమీపంలోని ఒమందురు గ్రామానికి చెందిన రమణి (19), వానూరు సమీపంలోని శివమంగళం గ్రామానికి చెందిన అరుంధతి (18), తేని జిల్లా పెరియకులం పట్టాలం ఆలయం వీధికి చెందిన ప్రియదర్శిని (17) ఫెయిల్ అవడంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

### అప్పుల బాధతో వివాహిత..

**తిరువొత్తియూరు:** అప్పుల బాధతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. చెన్నై సమీపంలోని తాంబరం ముడిచూర్‌రోడ్డు శక్తి నగర్‌కు చెందిన వెంకటేశన్ అదే ప్రాంతంలో ప్రొవిజన్ దుకాణం నడుపుతున్నాడు. ఇతని భార్య ప్రేమ (39). ఈమె చెన్నై హార్బర్ కార్యాలయంలో పనిచేస్తోంది. ఈ దంపతులు దీపావళి చిట్‌ఫండ్ నడిపేవారు. ఇందులో రూ. 8 లక్షల వరకు నష్టపోవడంతో మనస్తాపం చెందిన ప్రేమ సోమవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుంది. గమనించిన భర్త వెంటనే ఆమెను కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అయితే మార్గ మధ్యలోనే ప్రేమ ప్రాణాలు కోల్పోయింది. ప్రేమ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పీర్కాంగరనై పోలీసులు విచారణ చేస్తున్నారు.

### ఎడ్లబండిపై నుంచి పడి రైతు మృతి

**తిరువొత్తియూరు:** ఎడ్ల బండి తోలుకోస్తున్న సమయంలో ఎద్దులు బెదిరి వేగంగా పరుగెత్తడంతో ప్రమాదవశాత్తూ ఓ రైతు కిందపడి మృతి చెందాడు. వివరాలు.. మదురై జిల్లా సాప్పూర్‌కు చెందిన పాన్‌రాజ్ (28) రైతు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి తన వ్యవసాయ పొలంకు ఎద్దుల బండిని తోలుకొని పోతున్నాడు. ఆ సమయంలో కొత్తగా కొన్న ఎద్దులు హఠాత్తుగా బెదిరి అటూఇటూ పరిగెత్తాయి. దీంతో అదుపుతప్పి బండిపైనుంచి పారాజ్ తీవ్ర గాయలపాలయ్యాడు. అదే సమయంలో బండిచక్రం అతడిపై ఎక్కి దిగడంతో తల ఛిద్రమై మరణించాడు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


### ప్రియుడి మృతుని తట్టుకోలేక..

**తిరువొత్తియూరు:** ప్లస్ టు పరీక్షలో ఫెయిల్ కావడంతో ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంగతి తెలుసుకున్న ప్రియురాలు(16) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చెన్నై పూందమల్లి సమీపంలోని చెంబరంబాక్కానికి చెందిన ఢిల్లీ ఆటో డ్రైవర్. భార్య శాంతి, కుమార్తె నందిని. ఈమె పూందమల్లిలోని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో ప్లస్ వన్ చదువుతోంది. సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో చెన్నై ఆవడి గోవర్ధనగిరి వీధికి చెందిన దేవా (17) ప్లస్ టు పరీక్షలో ఫెయిల్ కావడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మృతిని తట్టుకోలేక నందిని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

### వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని..

**తిరువొత్తియూరు:** వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కన్న బిడ్డనే ప్రియుడితో కలిసి హత్య చేసిన తల్లిని పోలీసులు అరెస్టు చేశారు. సేలం జిల్లా చిక్కంపట్టిలోని ఇటుకల బట్టీలో మల్లేష్, కలైవాణి పనిచేస్తూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. అంతకు ముందే కలైవాణికి వివాహమై ఏడాది కుమార్తె ఉంది. కొద్ది రోజుల క్రితం బిడ్డ ఏడుపులు విన్న ఇరుగుపొరుగు వాళ్లు అక్కడికి వచ్చి చూడగా బిడ్డకు ఆరోగ్యం బాగాలేదని ఆ జంట తెలిపింది. దీంతో బిడ్డను సేలం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చి వారిద్దరూ పరారయ్యారు. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిడ్డ సోమవారం ఉదయం మృతి చెందింది. దారామంగళం పోలీసులు కేసు నమోదు చేసి మల్లేష్, కలైవానిలను అరెస్టు చేశారు. విచారణలో ఈరోడ్ జిల్లా వాడపల్లికి చెందిన కలైవాణి (27) ఏడాది బిడ్డతో భర్త నుంచి విడిపోయి కృష్ణగిరి జిల్లా డెంకనికోటకు చెందిన మల్లేష్‌తో వివాహత సంబంధం ఏర్పడినట్లు తెలిసింది. ఉల్లాస జీవితానికి బిడ్డ అడ్డుగా ఉందని తీవ్రంగా కొట్టినట్లు ఒప్పుకున్నారు. ఈ కారణంగా బిడ్డ మృతి చెందినట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు.

# తిరుత్తణిలో విషాదం



మృతదేహాలను వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది



మృతులు హేమలత, గోమతి (ఫైల్)

- ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిన మనవరాళ్లు
- వారిని రక్షించేందుకు నీటిలో దిగిన నాన్నమ్మ
- ముగ్గురూ మృతి
- రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం

**తిరుత్తణి:** ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఇద్దరు బాలికలు.. వారిని రక్షించేందుకు నీటిలో దిగిన నాన్నమ్మ మృతిచెందిన విషాదకర ఘటన తిరుత్తణిలో మంగళవారం జరిగింది. తిరుత్తణి పెరియార్ నగర్‌కు చెందిన బాబు ఇంట్లో అశుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరువణ్ణామలై జిల్లా ఆరణి సమీపంలోని పార్వతి అగరం గ్రామానికి చెందిన బంధువు మల్లిక (55) తన మనవరాళ్లు (కుమారుడి కూతుళ్లు) హేమలత(15), గోమతి(14)తో కలిసి తిరుత్తణికి వచ్చారు. మంగళవారం ఉదయం పెరియార్‌నగర్‌లోని నీటి కుంటలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాలికలు దిగారు. కాలుజారి ఇద్దరూ నీటిలో పడిపోయారు. ఇది గమనించిన నాన్నమ్మ వారిని రక్షించేందుకు ఆమె కూడా నీటిలో దిగింది. లోతు ఎక్కువగా ఉండడంతో ముగ్గురు నీటిలో మునిగిపోయారు. అక్కడున్న వారు కాపాడే ప్రయత్నం చేసినా వీలుకాలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే వారు వచ్చేలోగా ముగ్గురు మృతిచెందారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది గంటపాటు శ్రమించి మృతదేహాలను బయటకు తీశారు. తిరుత్తణి పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**సీఎం సంతాపం**

నీటి కుంటలో పడి అవ్వ, ఇద్దరు మనవరాళ్లు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

**అన్నానగర్:** బైక్‌ను కారు ఢీకొనడంతో దంపతులు మృతిచెందారు. ఈ ఘటన సుల్తాన్‌పేటలో మంగళవారం జరిగింది. కోయంబత్తూరు జిల్లా వాల్పారై సమీపంలోని మలుకుపరై ప్రాంతానికి చెందిన పాల్‌దురై (42). ఇతని భార్య ఆశా(40). సుల్తాన్‌పేట పరిధిలోని పల్లడం–పొల్లాచ్చి ప్రధాన రహదారిపై భార్యాభర్తలిద్దరూ మంగళవారం ఉదయం బైక్‌పై వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న కారు అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఇందులో పాల్ దురై, ఆశ ఇద్దరూ బైకు నుంచి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన వారిని వాహనదారులు చికిత్స నిమిత్తం పల్లడం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఇద్దరూ మృతిచెందారు. సుల్తాన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇద్దరిని బలిగొన్న నది

**తిరువొత్తియూరు:** స్నేహితుని వివాహ వేడుకలో పాల్గొనడానికి వచ్చి తామ్రభరణి నదిలో దిగిన ఇద్దరు యువకులు మృతిచెందారు. మరో వ్యక్తి ఒడ్డుకు చేరుకున్నాడు. చెన్నై రాయపేటకు చెందిన పుష్పరాజు కుమారుడు శక్తి (25) చెన్నై రైల్వే మెయిల్ సర్వీసులో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తున్నాడు. ఇతను తన తల్లి, కుటుంబంతో నెల్‌లైలో ఉన్న బంధువు ఇంటికి కొద్ది రోజుల క్రితం వచ్చాడు. అక్కడ శక్తికి వివాహ ఏర్పాట్లు చేస్తున్నారు. శక్తి స్నేహితుడైన చెన్నై థౌజండ్‌లైట్‌కు చెందిన బాలకృష్ణన్ కుమారుడు శ్రీరామ్ (25), ఆటో డ్రైవర్ అరుణ్ (24), వినోద్ (24) సోమవారం ఉదయం శక్తి వివాహ కార్యక్రమానికి వెళ్లారు. మధ్యాహ్నం శక్తి, అతని తమ్ముడు మురళి, స్నేహితులు శ్రీరామ్, అరుణ్, వినోద్ వెంకటనాదపురం తామరబరణి నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతైన ప్రాంతానికి వెళ్లడంతో శ్రీరామ్, అరుణ్, వినోద్ ముగ్గురు నీటిలో మునిగిపోయారు. శక్తి, అతని తమ్ముడు మురళి కలిసి వినోద్‌ను కాపాడారు. అయితే శ్రీరామ్, అరుణ్ నీట మునిగిపోయారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని గంట పాటు శ్రమించి మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు. పాళయంకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## టన్ను గుట్కా స్వాధీనం

**తిరువొత్తియూరు:** కోయంబేడు ప్రాంతంలో పోలీసులు జరిపిన తనిఖీలో టన్ను మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. చెన్నై కోయంబేడు 100 అడుగుల రోడ్డు మార్గంగా రెండు మినీ లారీల్లో గుట్కా తరలిస్తున్నట్లు కోయంబేడు డిప్యూటీ కమిషనర్‌కు రహస్య సమాచారం అందింది. ఈ మేరకు సోమవారం రాత్రి కోయంబేడు వంద అడుగుల రోడ్డులో డిప్యూటీ కమిషనర్ కుమార్ నేతృత్వంలో పోలీసులు నిఘా ఉంచారు. ఆ సమయంలో వచ్చిన రెండు మినీ లారీలను పోలీసులు పట్టుకున్నారు. డ్రైవర్ తప్పించుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు అతడిని వెంబడించి అరెస్టు చేశారు. విచారణలో అతను కోయంబేడు మన్నడి వీధికి చెందిన సురేష్ (32) అని తెలిసింది. మరో మినీ లారీ డ్రైవర్ తప్పించుకుని పారిపోయాడు. రెండు మినీ లారీల్లో తనిఖీ చేయగా సుమారు రూ. 5 లక్షల విలువైన మత్తు పదార్థాలు ఉన్నట్లు తెలిసింది. బెంగళూరు నుంచి రోజు మినీ లారీ ద్వారా తీసుకొస్తూ కోయంబేడు మార్కెట్‌లో ఉన్న దుకాణాలకు, తిరుమంగళం, అన్నానగర్, అమైందకరై తదితర ప్రాంతాల్లో సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. రెండు మినీ లారీలతో సహా టన్ను గుట్కాను స్వాధీనం చేసుకున్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు వైద్య సేవలు



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్

**వేలూరు:** వేలూరు కార్పొరేషన్‌లోని మొదటి జోన్‌లో ప్రజల వద్దకే వైద్యం పథకంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా వైద్య సేవలు అందజేయనున్నట్లు కార్పొరేషన్ మొదటి జోన్ ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 15వ వార్డు విరుదంబట్టులో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్పొరేషన్ కమిషనర్ రత్నస్వామి ఆదేశాల మేరకు విరుదంబట్టులో మొదటి విడతగా వైద్య శిబిరాన్ని ప్రారంభించామని తెలిపారు. అన్ని వార్డుల్లోనూ ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, పంపు ఆపరేటర్‌లు, చెత్తను వేరు చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు సహా సుమారు 400 మంది కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేయనున్నట్లు తెలిపారు.

## స్కూటర్‌లో పాము

**అన్నానగర్:** స్కూటర్‌లో చేరిన ఆరు అడుగుల పామును చాకచక్యంగా బయటకు తీశారు. వివరాలు.. తేని సమీపంలోని మీనరసు పట్టణానికి చెందిన ఆనంది (21) మంగళవారం ఉదయం స్కూటర్ పై మీనరసు నగర్ నుంచి తేనికి వెళ్తోంది. పళనిశెట్టిపట్టి బస్‌స్టాప్ వద్దకు చేరుకోగానే స్కూటర్ నుంచి ఏవో కదలికలు గమనించింది. కొద్దిసేపటి తర్వాత స్కూటర్ ముందు భాగం నుంచి పాము తలను బయటకు తీసింది. ఇది చూసిన ఆనంది భయంతో స్కూటర్‌పై నుంచి కిందపడి గాయపడింది. ఆమెను స్థానికులు అదే ప్రాంతంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పళనిశెట్టిపట్టికి చెందిన పాములు పట్టే కన్నన్‌కు సమాచారం అందించారు. అతను అక్కడికి చేరుకుని స్కూటర్‌లో దాక్కున్న 6 అడుగుల పొడవున్న పామును పట్టుకున్నాడు. అనంతరం అటవీశాఖ కార్యాలయానికి తీసుకెళ్లాడు. అటవీ శాఖ సిబ్బంది సాయంతో పామును అల్లినగరం వీరప్ప అయ్యనార్ కుడి కొండపైకి తీసుకెళ్లి వదిలారు.



పట్టుబడిన పాము

## పుస్తకావిష్కరణ



చెన్నై ఎక్స్‌ప్రెస్ అవెన్యూలోని క్రాస్‌వర్డ్ బుక్ స్టోర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జైశ్రీ శరద్ రచించిన ‘ది స్కిన్‌కేర్ ఆన్సర్ బుక్’ని ప్రముఖ నటి కల్యాణి ప్రియదర్శన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

- సాక్షి చెన్నై

### బాలుడి ప్రాణం తీసిన గాలిపటం

**అన్నానగర్:** విద్యుత్ తీగలో ఇరుక్కున్న గాలిపటం తీయడానికి ప్రయత్నిస్తుండగా విద్యుదాఘాతానికి గురై బాలుడు మృతి చెందాడు. చెన్నైలోని నంగనల్లూరు కేకేనగర్‌కు చెందిన అశోక్‌కుమార్ కుమారుడు కుల్దీప్ (12) వేసవి సెలవుల కోసం కృష్ణగిరి జిల్లా చూళగిరి సమీపంలోని కమంతోట్టిలో ఉన్న తన మేనమామ ఇంటికి వచ్చాడు. సోమవారం సాయంత్రం బాలుడు తన ఇంటి డాబాపై ఆడుకుంటున్నాడు. అనూహ్యంగా గాలిపటం విద్యుత్ తీగలో ఇరుక్కుపోయింది. దానిని తీయడానికి కుల్దీప్ ప్రయత్నించగా, విద్యుత్ తీగను తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై కుల్దీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న చూళగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### శ్రీవారి సేవలో పళనిస్వామి



తిరుమల ఆలయం వెలుపల పళనిస్వామి

**తిరుమల:** తిరుమల శ్రీవారిని తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

### శ్రీవారి దర్శనానికి 10 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,904 మంది స్వామివారిని దర్శించుకోగా.. 29,290 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.57 కోట్లు లభించాయి. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

## లారీ బోల్తా.. కార్మికుడి మృతి



బోల్తాపడిన లారీ, ఇన్‌సెట్ మృతుడు గోపి (ఫైల్)

**అన్నానగర్:** సిమెంట్ మిక్సింగ్ లారీ బోల్తాపడి కార్మికుడు మృతిచెందిన ఘటన ఆండిపట్టిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. తేని జిల్లా ఆండిపట్టి మెక్కిహార్‌పట్టి గ్రామ సమీపంలో పట్టణాభివృద్ధి పథకం కింద సుమారు 250 ఇళ్లతో కూడిన అపార్ట్‌మెంట్ బ్లాక్ నిర్మాణం జరుగుతోంది. ఈ నిర్మాణ పనుల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 100 మందికి పైగా పని చేస్తున్నారు. మంగళవారం తేని అన్నంజి సమీపంలోని వాడవీరనాయకన్ పట్టి ప్రాంతానికి చెందిన 30 మంది కార్మికులు భవనానికి పిల్లర్లు వేసే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో సిమెంట్ మిక్సింగ్ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాడవీరనాయకన్‌పట్టికి చెందిన కాళీరాజ్ కుమారుడు గోపి ( 20) వాహనం కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందాడు. తోటి కార్మికులు సుమారు గంటపాటు శ్రమించి గోపీ మృతదేహాన్ని వెలికితీశారు. సమాచారం అందుకున్న బంధువులు తమకు న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లే ప్రసక్తే లేదన్నారు. ఆండిపట్టి డిప్యూటీ సూపరింటెండెంట్ రామలింగం, ఇన్‌స్పెక్టర్ శివకుమార్ అక్కడికి చేరుకుని బంధువులు, కార్మికులతో చర్చలు జరిపారు. అనంతరం గోపీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తేని ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఆండిపట్టి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెట్టుబడిదారులకు ఉచిత సేవలు



మాట్లాడుతున్న అంబర్ పబ్రేజా

**సాక్షి, చెన్నై:** పెట్టుబడిదారులకు ఉచిత సేవలను అందించడమే లక్ష్యంగా దేశ ప్రముఖ అనలిటిక్స్ సంస్థ అయిన ట్రెండ్‌లైన్ కొత్తగా స్టార్‌ఫోలియోను ప్రారంభించింది. ఈ మేరకు స్థానికంగా మంగళవారం జరిగిన సమావేశంలో ఆ సంస్థ సీఈఓ అంబర్ పబ్రేజా మాట్లాడుతూ.. పెట్టుబడిదారులు, వ్యాపారుల కోసం స్టార్ ఫోలియోను ప్రారంభించామని తెలిపారు. ట్రెండ్ లైన్‌లో లాగిన్ అయ్యే పెట్టుబడిదారులకు ఏ విధంగా పెట్టుబడులు పెడితే లాభాలను పొందవచ్చు ఉచితంగా విశ్లేషణ అందిస్తామని అన్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో తమ ట్రెండ్‌లైన్ మార్కెట్ యాప్ ఇప్పటికే అధిక రేటింగ్‌లు సొంతం చేసుకుందని తెలిపారు.

## డీఎంకే కౌన్సిలర్ కుమారుడిపై హత్యాయత్నం

- నలుగురి అరెస్టు



అరెస్టయిన నిందితులు

**తిరువళ్లూరు:** డీఎంకే యువజన విభాగం నేతపై హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. తిరువళ్లూరు పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ ఇందిరపరశురామన్. ఇతని కుమారుడు కలైవావన్(32) డీఎంకే యువజన విభాగం ఉప కార్యదర్శిగా పని చేస్తున్నారు. కలైవానన్ స్థానికంగా మెడికల్ షాపుతో పాటు షామియానా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతని వద్ద సమీప బంధువు శరవణన్(21) పని చేస్తున్నాడు. ఇతనికి గంజాయి గ్యాంగ్‌తో ఉన్న సంబంధాలను వదులుకోవాలని హెచ్చరించినట్లు తెలిసింది. అయితే శరవణన్ తమతో రాకపోవడానికి కలైవానన్ కారణంగా భావించి పలుమార్లు గంజాయి బ్యాచ్ ఘర్షణకు దిగింది. ఇదే విషయంపై కలైవానన్‌కు గంజాయి బ్యాచ్‌కు మధ్య గతంలో ఘర్షణ ఏర్పడింది. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీ కలైవానన్‌పై హత్యాయత్నం జరిగింది. నలుగురు యువకులు విచక్షణరహితంగా దాడి చేసి గాయపరిచారు. తీవ్రంగా గాయపడిన యువకుడిని తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తరువాత చెన్నై వైద్యశాలకు తరలించారు. కాగా యువకుడిపై హత్యాయత్నం సంఘటనపై తిరువళ్లూరు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరువళ్లూరు పట్టణానికి చెందిన ఆకాష్(21), సంతోష్(22), చంద్రశేఖర్(36)తో పాటు మైనర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

## 47 శాతం పెరిగిన ఇండియన్ బ్యాంకు లాభం



బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎల్ జైన్

**కొరుక్కుపేట:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఇండియన్ బ్యాంకు 2022–23 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. ఇందులో 2023 మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం 47 శాతం పెరిగి రూ. 1447 కోట్లు నమోదు చేసిందని బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎల్ జైన్ తెలిపారు. మంగళవారం విలేకర్ల సమావేశంలో ఫలితాలను వెల్లడించారు. 2022– 23 సంవత్సరంలో చివరి క్వార్టర్‌లో ఆశాజనకమైన ఫలితాలు నమోదు చేసిందని అన్నారు. గత ఏడాది ఇదే కాలానికి నికర లాభం రూ.984 కోట్లు కాగా ఈ ఏడాది రూ. 1447.3 కోట్లుకు చేరి ఏకంగా 47 శాతం లాభం పెరిగిందని అన్నారు. అలాగే నిర్వాహణ లాభం రూ .4016 కోట్లతో 47 శాతం, నికర నిర్వాహణ ఆదాయం రూ. 5508 కోట్లతో 29 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. మొబైల్ బ్యాకింగ్ వినియోగదారులు ఈ ఏడాది 68 శాతం పెరిగారని అన్నారు. డిజిటల్ లావాదేవీలను మరింత ప్రోత్సహించే రీతిలో డిజిటల్ బ్యాంకింగ్ సేవలను విస్తృతం చేస్తున్నట్లు వెల్లడించారు. గోల్డెన్ పీకాక్ నేషనల్ ట్రైనింగ్ అవార్డు –2023 అవార్డును మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఇండియన్ బ్యాంకు అందుకున్నట్లు వివరించారు.

## పాదయాత్ర భక్తులపై దూసుకెళ్లిన బస్సు



తిరుమలకు పాదయాత్రగా వెళ్లిన శ్రీవారి భక్త బృందం (ఫైల్)

- ఇద్దరు భక్తుల మృతి
- ఐదుగురికి గాయాలు

**తిరుత్తణి:** తిరుమలకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులపై ప్రభుత్వ బస్సు దూసుకెళ్లడంతో ఇద్దరు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు గాయపడ్డారు. వివరాలు.. విల్లుపురం జిల్లా దిండివనం ప్రాంతానికి చెందిన శ్రీవారి భక్తులు 35 మంది శుక్రవారం తిరుమలకు పాదయాత్ర ప్రారంభించారు. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో తిరుత్తణి పరిధిలోని చెన్నై–తిరుపతి జాతీయ రహదారి పొన్పాడి చెక్‌పోస్టు వద్ద నడిచి వెళుతున్నారు. ఈ క్రమంలో భక్తులపై చెన్నై నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో శాతారామన్(22) నారాయణన్(43) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ముకేష్, కన్నన్, వడివేలు సహా ఐదుగురికి గాయాలయ్యాయి. వారందరినీ 108 అంబులెన్స్‌లో తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సత్యభామ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు




విద్యార్థినికి నియామక పత్రాన్ని అందజేస్తున్న చాన్స్‌లర్ మరియాజీనా

**కొరుక్కుపేట:** చెన్నైలోని సత్యభామ విశ్వవిద్యాలయంలో 91.18 శాతం మంది విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉపాధి అవకాశాలు లభించాయి. సోమవారం నిర్వహించిన సత్యభామ అచీవర్స్ డేలో ఉద్యోగాలు పొందిన 2823 మంది విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. సత్యభామ వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ మరియాజీనా జాన్సన్, అధ్యక్షుడు డాక్టర్ మరియా జాన్సన్, ఉపాధ్యక్షుడు అరుళ్ సెల్వన్, మరియా తమిళరసి, క్యాథరిన్ జయప్రియా తదితరులు విద్యార్థులను అభినందించారు. వీరిలో ఆరుగురు రూ.53 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారు. 14 మందికి రూ.27 లక్షలు, 120 మందికి రూ.10 లక్షల చొప్పున ప్యాకేజీతో ఎంపికైనట్లు వర్సిటీ చాన్స్‌లర్ తెలిపారు.

## క్లుప్తంగా...

### మొక్కజొన్న కొనుగోళ్లు ముమ్మరం

- సీఎం యాప్ ద్వారా 11,169 మంది రైతుల నమోదు
- ఇప్పటికే 1,089 టన్నులు కొనుగోలు



బాపట్ల జిల్లా వలివేరులో మొక్కజొన్న కొనుగోలును పరిశీలిస్తున్న మార్క్ ఫెడ్ ఎండీ రాహుల్ పాండే

**సాక్షి, అమరావతి:** అకాల వర్షాల వల్ల ఇబ్బంది పడుతున్న మొక్కజొన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపట్టింది. మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం కింద రైతుల వద్ద మొక్కజొన్న కొనుగోలు చేస్తోంది. మార్క్‌ఫెడ్ ద్వారా 66 వేల టన్నుల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 3,330 ఆర్బీకేల పరిధిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఇప్పటివరకు సీఎం యాప్ ద్వారా 11,169 మంది రైతులు నమోదు చేసుకున్నారు. అత్యధికంగా బాపట్ల జిల్లాలో 1,659 మంది రైతులు నమోదు చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో 1,456 మంది, శ్రీకాకుళం జిల్లాలో 1,419, ఏలూరు జిల్లాలో 1,341, ఎన్టీఆర్ జిల్లాలో 1,082 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కనీస మద్దతు ధర క్వింటాల్ రూ.1,962 చొప్పున ఇప్పటివరకు 1,089 టన్నుల మొక్కజొన్నలను కొనుగోలు చేశారు. శ్రీకాకుళం జిల్లాలో 375.40 టన్నులు, విజయనగరంలో 187 టన్నులు, బాపట్లలో 131.40 టన్నులు, గుంటూరులో 97, ఏలూరులో 92, పల్నాడులో 84.80, నంద్యాల జిల్లాలో 60.45 టన్నుల చొప్పున కొనుగోలు చేశారు. రైతులెవరూ ఆందోళన చెందనవసరం లేదని, వారివద్ద నాణ్యమైన మొక్కజొన్నను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### 2 నెలల తర్వాత మళ్లీ రాష్ట్రానికి పవన్ కళ్యాణ్

- నేడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పంటల పరిశీలన

**సాక్షి, అమరావతి:** జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సుమారు రెండు నెలల తర్వాత మళ్లీ రాష్ట్రానికి వస్తున్నారు. అకాల వర్షాలతో పంటలు కోల్పోయి నష్టాలపాలైన రైతాంగాన్ని బుధవారం ఆయన పరామర్శించనున్నట్లు ఆ పార్టీ మీడియా విభాగం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉదయం రాజమండ్రి చేరుకొని.. ఆ తర్వాత ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, రైతులను కలుసుకుంటారని తెలిపింది. మార్చి 14వ తేదీన మచిలీపట్నంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న పవన్‌కళ్యాణ్ ఆ తర్వాత మళ్లీ రాష్ట్రానికి రాలేదు.

### వివేకా హత్య కేసు డైరీని సమర్పించండి

- సీబీఐకి ప్రత్యేక కోర్టు ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు డైరీని న్యాయస్థానానికి సమర్పించాలని సీబీఐను ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ కేసులో నిందితుడిగా పేర్కొంటూ గత నెల 14న గజ్జల ఉదయ్ కుమార్‌ను సీబీఐ అరెస్టు చేసింది. అనంతరం ఉదయ్ సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై సీబీఐ కోర్టు మంగళవారం విచారణ జరిపింది. హత్య కేసు విచారణ ముగింపు దశకు వచ్చినందున ఉదయ్‌ను జైలులో ఉంచాల్సిన అవసరం లేదని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. ఇంకా విచారణ పూర్తి కాలేదని, ఈ దశలో ఉదయ్‌కు బెయిల్ ఇవ్వడం సరికాదంటూ సీబీఐ పేర్కొంది. దీంతో వివేకా కేసు డైరీని సమర్పించాలంటూ సీబీఐను కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది.

**తెలంగాణ**

### నీడ మాయం సాధారణమే...



జీరో షాడో డే గురించి వివరిస్తున్న రఘునందన్

**పంజగుట్ట(హైదరాబాద్):** నీడ కనిపించకపోవడం కొత్తమీకాదని, పాశ్చాత్యాల్లో ఉన్నదేనని శాస్త్రవేత్త రఘునందన్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నీడ కనిపించని సమయంలో ఆయన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విద్యార్థులకు జీరో షాడో డే గూర్చి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇది మూఢ నమ్మకం కాదని ప్రకృతి సహజంగా జరిగేదన్నారు. మనం ఎక్కడా చూడకపోవడంతో నీడ మాయం అనే ప్రచారం జరుగుతోందని, ఇటీవలే బెంగుళూరులో జరగడంతో ప్రజల్లో కుతూహలం పెరిగిందని తెలిపారు. భూమి సూర్యుని చుట్టూ తిరిగే క్రమంలో ఇవి చోటు చేసుకుంటాయన్నారు. ఈ నెల 10న విశాఖపట్నంలో, 11న వరంగల్‌లో, 12న శ్రీకాకుళం, విజయనగరంలోనూ ఇది జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి రాజేష్ పాల్గొన్నారు.

# గంగపుత్రులకు 'భరోసా'

### వైఎస్సార్ మత్స్యకార భరోసా పంపిణీకి రెడీ

**సాక్షి, అమరావతి:** నడిసంద్రంలో బతుకు పోరాటం చేసే గంగపుత్రులకు వేట నిషేధ సమయంలో అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వరుసగా ఐదో ఏడాది వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద వేట నిషేధ భృతి పంపిణీకి ఏర్పాట్లుచేసింది. ఈ ఏడాది 1,23,519 మంది అర్హత పొందగా, వారికి ఈనెల 16వ తేదీన బాపట్ల జిల్లా నిజాంపట్నంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రూ.123.52 కోట్లు జమచేయనున్నారు.

**గతంలో అరకొరగా సాయం**

రాష్ట్రంలో తడ నుంచి ఇచ్ఛాపురం వరకు సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. వేట నిషేధ వేళ గతంలో రూ.2వేలు, బియ్యం, ఇతర నిత్యావసరాలు ఇచ్చేవారు. ఆ తర్వాత నిత్యావసరాలు నిలిపివేసి రూ.4వేల చొప్పున భృతి ఇచ్చేవారు. అది కూడా వేట నిషేధం ముగిసిన ఆర్నెల్లకో ఏడాదికో తమకు అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే ఇచ్చేవారు. ఈ నేపథ్యంలో.. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ భృతిని రూ.4వేల నుంచి రూ.10వేలకు పెంచడమే కాక.. మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లతో పాటు సంప్రదాయ నావలపై ఆధారపడి జీవించే వారికి సైతం నిషేధకాలం ముగియకుండానే భృతినందిస్తూ సీఎం జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఈ కారణంగా బోట్ల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. 2019–20 నాటికి రాష్ట్రంలో అన్ని బోట్లు కలిపి 14,299 ఉండగా, ప్రస్తుతం రాష్ట్రంలో 1,610 మెకనైజ్డ్, 22,011 మోటరైజ్డ్, 6,343 సంప్రదాయ బోట్లు ఉన్నాయి. వీటిపై ఆధారపడి జీవించే మత్స్యకార కుటుంబాల సంఖ్య 1.60 లక్షలకు చేరింది.



**ఐదు రెట్లు పెరిగిన సాయం**

వేట నిషేధం అమలులోకి వచ్చిన వెంటనే అర్హుల గుర్తింపు ప్రక్రియ చేపట్టారు. ఆర్బీకేల్లో పనిచేసే మత్స్య సహాయకులు, వలంటీర్, సాగర మిత్రలతో కూడిన బృందాలు లబ్ధిదారుల గుర్తింపునకు శ్రీకారం చుట్టాయి. తీరానికి చేరుకున్న బోట్లను పరిశీలించి, వాటిపై జీవనోపాధి పొందే మత్స్యకార కుటుంబాలను గుర్తించారు. ఆరు దశల వెరిఫికేషన్ అనంతరం అర్హుల జాబితాలను సామాజిక తనిఖీల్లో భాగంగా ఆర్బీకేల్లో ప్రదర్శించారు. అభ్యంతరాలు స్వీకరించి క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత తుది జాబితాలను ప్రకటించారు. ఈ విధంగా 1,23,519 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో బీసీలు 1,17,757 మంది, ఎస్సీలు 2,946, ఎస్టీలు 970, ఓసీలు 1,846 మంది ఉన్నారు. వీరి వివరాలను సోషల్ ఆడిట్‌లో భాగంగా ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.123.52 కోట్లను ఈనెల 16న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమచేయనున్నారు. కానీ, టీడీపీ ఐదేళ్ల పాలనలో భృతికింద 3 లక్షల మందికి రూ.104.62 కోట్లు ఇస్తే, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం ఈ ఏడాది జమచేయనున్న మొత్తంతో కలిపి ఐదేళ్లలో 5.38 లక్షల మందికి రూ.538 కోట్ల మేర సాయమందించింది. అంటే టీడీపీ ప్రభుత్వ హయాంతో పోలిస్తే లబ్ధిదారుల సంఖ్య 2.38 లక్షల మేర పెరిగితే, సాయం ఐదు రెట్లు పెరిగింది.

**2023-24 వైఎస్సార్ మత్స్యకార భరోసా అర్హుల తుది జాబితా..**

| జిల్లా | లబ్ధిదారులు |
|---|---|
| కాకినాడ | 24,147 |
| శ్రీకాకుళం | 15,281 |
| కృష్ణా | 12,527 |
| విశాఖపట్నం | 12,173 |
| నెల్లూరు | 12,072 |
| బాపట్ల | 12,060 |
| అనకాపల్లి | 11,373 |
| కోనసీమ | 9,821 |
| ప్రకాశం | 5,260 |
| తిరుపతి | 3,648 |
| విజయనగరం | 3,522 |
| పశ్చిమ గోదావరి | 1,635 |
| మొత్తం | 1,23,519 |

**టీడీపీ హయాంలో వేట నిషేధ భృతి వివరాలు**

| సంవత్సరం | కుటుంబాలు | మొత్తం రూ.కోట్లలో |
|---|---|---|
| 2014–15 | 12,178 | 2.43 |
| 2015–16 | 66,941 | 13.39 |
| 2016–17 | 68,957 | 27.59 |
| 2017–18 | 73,017 | 29.21 |
| 2018–19 | 80,000 | 32.00 |

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..**

| సంవత్సరం | కుటుంబాలు | మొత్తం రూ.కోట్లలో |
|---|---|---|
| 2019–20 | 1,02,478 | 102.48 |
| 2020–21 | 1,09,231 | 109.23 |
| 2021–22 | 97,619 | 97.62 |
| 2022–23 | 1,05,161 | 105.16 |

**మాటల్లో చెప్పలేను..**



మా బంధువుకు చెందిన తెప్పపై ఆధారపడి 20 ఏళ్లుగా జీవిస్తున్నా. వేటలేని సమయంలో ఏనాడు ఏ ప్రభుత్వం సాయం చేయలేదు. జగన్ ప్రభుత్వం నాలుగేళ్లుగా రూ.10వేల చొప్పున అందిస్తున్న సాయం అక్కరకొస్తోంది. ఎలాంటి పైరవీల్లేకుండా ఎంపిక చేస్తున్నారు.

– వై.అప్పలరాజు, రాజయ్యపేట, అనకాపల్లి జిల్లా

**వరుసగా ఐదో ఏడాది భృతి**



గడిచిన నాలుగేళ్లుగా వేట నిషేధ కాలం ముగియకుండానే వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద భృతినందించాం. అదేవిధంగా ఐదో ఏడాది కూడా సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లుచేసింది. ఈ ఏడాది 1.23 లక్షల కుటుంబాలు అర్హత పొందగా, వారి ఖాతాల్లో ఈనెల 16న వేట నిషేధ భృతిని జమచేసేందుకు ఏర్పాట్లుచేశాం.

– కె.కన్నబాబు, కమిషనర్, మత్స్యశాఖ

## అపర సంజీవని ఆరోగ్యశ్రీ

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని పేద ప్రజలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అపర సంజీవనిలా మారిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఆరోగ్యశ్రీ, 104, 108 వాహనాలు తదితర అంశాలపై మంత్రి విడదల రజిని మంగళవారం మంగళగిరిలోని తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.3,336 కోట్లు కేటాయించిందని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం 1,059 ప్రొసీజర్లకు మాత్రమే ఈ పథకం వర్తింపజేసిందని, తమ ప్రభుత్వం కొత్తగా మరో 2,446 ప్రొసీజర్‌లను చేర్చిందని చెప్పారు. దీంతో ఏకంగా 3,255 ప్రొసీజర్‌లకు వైద్యం ఉచితంగా ప్రజలకు అందుతోందన్నారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం ఏడాదికి రూ.వెయ్యి కోట్ల వరకు మాత్రమే ఖర్చు చేసేదన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం రూ.3వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందన్నారు. అదేవిధంగా ఆరోగ్య ఆసరా కోసం రూ.445 కోట్లు, 108 వాహనాల నిర్వహణకు రూ.187 కోట్లు, 104 వాహనాల నిర్వహణకు రూ.164 కోట్లు, ఈహెచ్‌ఎస్ కోసం రూ.140 కోట్లు చొప్పున ఖర్చు చేస్తోందని వివరించారు. ఏపీలో 2,061ఆస్పత్రులు, తెలంగాణలో 132, కర్ణాటకలో 49, తమిళనాడులో 22 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్, అడిషనల్ సీఈవో మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ వయస్సు పెంపు వారికి వర్తించదు

### ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులపై హైకోర్టు ధర్మాసనం తీర్పు

- అధికరణ 309 సర్వీసు నిబంధనలు వీరికి వర్తించవు
- ఈ నిబంధనలు వర్తించే వారే 1984 చట్టం పరిధిలోకి వస్తారు
- ఈ సంస్థలకు సొంత సర్వీసు నిబంధనలు ఉన్నాయి
- వీరు ప్రభుత్వ సంచిత నిధి నుంచి జీతాలు పొందడంలేదు
- సొంత సంస్థల నుంచే జీతాలు పొందుతున్నారు
- అందువల్ల పదవీ విరమణ వయస్సు పెంపును కోరలేరు
- సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసిన ధర్మాసనం

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల్లో పనిచేసే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 62 ఏళ్లకు పెంచడం సరికాదని హైకోర్టు ధర్మాసనం తీర్పునిచ్చింది. పదవీ విరమణ వయస్సు పెంపు ఉత్తర్వులు ఈ ఉద్యోగులకు వర్తించవని స్పష్టం చేసింది. వీరి రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. కార్పొరేషన్లు, ఇతర సంస్థల ఉద్యోగుల సర్వీసు నిబంధనలను అధికరణ 309 ప్రకారం రూపొందించలేదని, ఆ సంస్థలకు సొంత సర్వీసు నిబంధనలు ఉన్నాయని స్పష్టం చేసింది. జీతాలు సైతం సంచిత నిధి నుంచి కాకుండా ఆయా కార్పొరేషన్ల నుంచే తీసుకుంటున్నారని తెలిపింది. ఏపీ పబ్లిక్ సర్వీస్, ప్రభుత్వ కార్యకలాపాలతో ముడిపడి ఉన్న, సంచిత నిధి నుంచి జీతాలు అందుకుంటున్న ఉద్యోగులకు మాత్రమే పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్టం 1984లోని నిబంధనలు వర్తిస్తాయని చెప్పింది. అందువల్ల ఈ సంస్థల ఉద్యోగులు 1984 చట్టంలోని ప్రయోజనాలను పొందలేరని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్‌ఎస్ సోమయాజులు, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

**మాకూ పదవీ విరమణ వయస్సును పెంచండి**

ప్రభుత్వ ఉద్యోగుల్లానే తమకు కూడా రిటైర్మెంట్ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, రిటైరవ్వాలంటూ ఏపీ విద్య సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) ఎండీ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలంటూ ఆ సంస్థ ఉద్యోగులు కె.జనార్దన్ రెడ్డి, జె.కరుణాకర్‌రెడ్డి, సి.చంద్రశేఖరరెడ్డి తదితరులు హైకోర్టులో 2022లో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ మన్మథరావు... పదవీ విరమణ వయస్సును పెంచాలంటూ తీర్పునిచ్చారు.

**ప్రభుత్వం అనుమతినిస్తేనే అర్హులవుతారు**

సింగిల్ జడ్జి తీర్పును సవాలు చేస్తూ పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎండీ తదితరులు ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. వీరి తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సుబ్రహ్మణ్య శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. కొన్ని కార్పొరేషన్లు రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే పదవీ విరమణ వయస్సును పెంచుకున్నాయని తెలిపారు. ప్రభుత్వం అనుమతిస్తేనే రిటైర్మెంట్ వయస్సు పెంపునకు అర్హులవుతారని చెప్పారు. 1984 చట్ట నిబంధనల ప్రకారం ప్రభుత్వ కార్పొరేషన్లు, సొసైటీలు తదితరాల్లో పనిచేసే ఉద్యోగులు రిటైర్మెంట్ వయస్సు పెంపునకు అర్హులు కారని తెలిపారు. ఆ సంస్థలకు సొంత సర్వీసు నిబంధనలు ఉన్నాయన్నారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఓ.మనోహర్‌రెడ్డి, పీవీపీ పద్మనాభం వాదనలు వినిపిస్తూ ఏపీఈడబ్ల్యూఐడీసీ ప్రభుత్వ నియంత్రణలోనే పనిచేస్తుందని, ఆ ఉద్యోగులు ప్రభుత్వ కార్యకలాపాలతో ముడిపడి ఉన్న వారని, అందువల్ల రిటైర్మెంట్ వయస్సు పెంపునకు అర్హులేనన్నారు. గతంలో ఇదే అంశంపై హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో ఎస్‌ఎల్‌పీ దాఖలైందని తెలిపారు. దానిని సుప్రీంకోర్టు పరిష్కరించిందని, అందువల్ల హైకోర్టు ధర్మాసనం తీర్పు ఆ ఉత్తర్వుల్లో కలిసిపోయినట్లేనన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలతో ఏకీభవించింది. సుప్రీంకోర్టు కేసు పూర్వాపరాల్లోకి వెళ్లకుండానే ఎస్‌ఎల్‌పీని పరిష్కరించిందని, అందువల్ల హైకోర్టు ధర్మాసనం గతంలో ఇచ్చిన తీర్పు సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో కలిసినట్లు భావించలేమంది. ఆ ధర్మాసనం తీర్పు అమల్లోనే ఉందని తెలిపింది.

# ప్రభుత్వ ఉపాధ్యాయులకు శుభవార్త

- హైస్కూల్ ప్లస్‌లో బోధనకు నియామకాలకు ప్రభుత్వం చర్యలు
- 1,752 పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం
- సబ్జెక్టు టీచర్లుగా 7 వేల మంది ఎస్జీటీలకు పదోన్నతి
- సీనియారిటీ, ప్రతిభ ఆధారంగా ఎంపిక
- ఇంటర్ స్థాయి బోధనకు ఎంపికైనవారికి అదనపు ఇంక్రిమెంట్
- ఈ నెలాఖరు నాటికి నియామక ప్రక్రియ పూర్తి

**సాక్షి, అమరావతి:** మండలానికి ఒక బాలికల జూనియర్ కాలేజీ అనే మాటను నిలబెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆయా కాలేజీల్లో బోధనకు అవసరమైన సిబ్బంది నియామకాలకు చర్యలు చేపట్టింది. దీంతోపాటు దాదాపు 7 వేల మంది సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)కు పదోన్నతి కల్పించి హైస్కూల్ స్థాయిలో సబ్జెక్టు ఉపాధ్యాయులుగా నియమించనుంది. ఈ మొత్తం ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం గత విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 292 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను హైస్కూల్ ప్లస్ (జూనియర్ కాలేజీ స్థాయి) స్థాయికి పెంచుతూ ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), జూనియర్ కళాశాలలు లేనిచోట 'ప్లస్' స్కూళ్లను గుర్తించి బాలికలకు ఇంటర్మీడియెట్ విద్యాబోధన ప్రారంభించింది. ఈ క్రమంలో 2022–23 విద్యా సంవత్సరంలో 177 ప్లస్ హైస్కూల్స్‌లో ప్రవేశాలు చేపట్టింది. వచ్చే విద్యా సంవత్సరంలో మిగిలిన 115 'ప్లస్' స్కూళ్లలోనూ ఇంటర్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో అన్నిచోట్లా పూర్తి స్థాయి బోధన సిబ్బందిని నియమించే ప్రక్రియను చేపట్టింది.

**7 వేల ఎస్జీటీలు.. 1,752 ఎస్‌ఏలకు అవకాశం**

2023–24 విద్యా సంవత్సరంలో జూన్ 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత గణాంకాల ప్రకారం హైస్కూల్ ప్లస్ స్థాయిలో ఇంటర్ తరగతుల బోధనకు 1,752 మంది ఉపాధ్యాయులు అవసరమని గుర్తించారు. ఇందులో ఎంపీసీ, బైపీసీ, కామర్స్, ఆర్ట్స్ సబ్జెక్టులకు అవసరముంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సేవలందిస్తున్న స్కూల్ అసిస్టెంట్ల(ఎస్‌ఏ)లో సీనియారిటీతో పాటు పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) అర్హతలున్నవారిని హైస్కూల్ ప్లస్‌లో నియమించనున్నారు. ఇంతకాలం పాఠశాల స్థాయి బోధనలో ఉన్నవారు కాలేజీ స్థాయిలో బోధనకు ఎంత వరకు అనువుగా ఉన్నారో ఇంటర్ బోర్డు ద్వారా పరీక్షించనున్నారు. అనంతరం ఎంపికైన 1,752 మంది స్కూల్ అసిస్టెంట్లకు ఒక ఇంక్రిమెంట్ అదనంగా ఇచ్చి జూనియర్ కాలేజీల్లో బోధనకు నియమించనున్నారు. కాగా, దాదాపు 6 వేల నుంచి 7 వేల మంది ఎస్జీటీలకు పదోన్నతిని సైతం ప్రభుత్వం కల్పించనుంది. వీరిని హైస్కూల్ స్థాయిలో సబ్జెక్టు నిపుణులుగా నియమించనుంది. పదోన్నతులు, పోస్టుల భర్తీ ప్రక్రియను మే నెలాఖరుకు పూర్తి చేయాలని ప్రభుత్వం విద్యా శాఖను ఆదేశించింది.

# హైదరాబాద్‌లో 'ఉగ్ర' కుట్ర భగ్నం

- తెలంగాణ నిఘా వర్గాలతో కలిసి నగరంలో మధ్యప్రదేశ్ ఏటీఎస్ దాడులు
- ఐదుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు.. పరారీలో మరొకరు

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఉగ్రవాదుల కుట్రలను మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), తెలంగాణ నిఘా వర్గాలు భగ్నం చేశాయి. సంయుక్తంగా హైదరాబాద్‌లో మంగళవారం చేపట్టిన ఆపరేషన్‌లో ఐదుగురు హిజ్బ్ ఉత్ తహరీర్ (హెచ్‌యూటీ) సంస్థ ఉగ్రవాద అనుమానితులు చిక్కారు. ఈ మాడ్యూల్‌కు సూత్రధారిగా ఉన్న మహ్మద్ సలీం ఓ మెడికల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తుండగా, పట్టుబడినవారిలో ఒక దంత వైద్యుడు, ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉండటం కలకలం రేపుతోంది. ఈ ఐదుగురినీ ఏటీఎస్ అధికారులు పీటీ వారెంట్‌పై భోపాల్‌కు తరలించారు. ఇదే సమయంలో మధ్యప్రదేశ్‌లోనూ ఏటీఎస్ అధికారులు మరో 11 మంది హెచ్‌యూటీ సంస్థ సభ్యులను అరెస్టు చేశారు. వారందరినీ అక్కడి కోర్టులో హాజరుపర్చగా.. ఈ నెల 19 వరకు వారిని ఏటీఎస్ కస్టడీకి న్యాయస్థానం అప్పగించింది. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు అనుబంధంగా ఉన్న హెచ్‌యూటీపై దేశంలో నిషేధం లేదు. అయితే, ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్న ఈ సంస్థ భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల్లో తన ఉనికి చాటుకుంటోంది. ఆన్‌లైన్‌లోనే క్యాడర్‌కు ఆయుధాల వినియోగంతో పాటు రసాయన, జీవాయుధ, సూక్ష్మక్రిములతో దాడులు చేయడంలో శిక్షణ ఇస్తోంది.

**మతం మార్చుకుని..**

భోపాల్‌కు చెందిన యాసీర్ ఈ మాడ్యూల్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇతడు తన స్నేహితుడైన సౌరభ్‌రాజ్ వైద్యను చదువుకునే రోజుల్లోనే బ్రెయిన్ వాష్ చేసి అతడి పేరును మహ్మద్ సలీం అని మార్చుకునేలా చేశాడు. వీరి వ్యవహారాలపై అక్కడి పోలీసుల కన్ను పడటంతో సలీం 2019లో హైదరాబాద్‌కు వలసవచ్చి గోల్కొండ బాబాబజార్‌లోని మోతీ మహల్‌లో నివసిస్తున్నాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కాలేజీలో ఫార్మాస్యూటికల్ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా ఉద్యోగంలో చేరాడు. మరోవైపు కొన్నేళ్ల కిందట ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన దేవీప్రసాద్ పాండా కూడా మతం మార్చుకుని అబ్దుల్ రెహ్మాన్‌గా మారాడు. గోల్కొండలోని ధన్కోక ప్రాంతంలో నివాసం ఉంటూ.. ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో క్లౌడ్ సర్వీస్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇక హైదరాబాద్‌లోని హఫీజ్‌బాబానగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బస్క వేణుకుమార్ కూడా మతం మార్చుకుని మహ్మద్ అబ్బాస్ అలీగా మారాడు. సలీం ఈ ఇద్దరితోపాటు గోల్కొండ బడాబజార్‌కు చెందిన దంత వైద్యుడు షేక్ జునైద్, జగద్గిరిగుట్ట మగ్దూంనగర్‌కు చెందిన మహ్మద్ హమీద్, జవహర్‌నగర్‌లోని శివాజీనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్‌లను ఆకర్షించాడు. తనతో సహా ఆరుగురితో హెచ్‌యూటీ మాడ్యూల్‌ను ఏర్పాటు చేశాడు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో యాసీర్ నేతృత్వంలో 11 మంది మరో మాడ్యూల్ కార్యకలాపాలు ప్రారంభించింది. కాగా, యాసీర్, సలీంల మాడ్యూల్స్ ఉగ్రవాద దాడులకు సిద్ధమవుతున్న విషయంపై మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులకు మూడు నెలల క్రితం జాతీయ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. అప్పటి నుంచి తెలంగాణ నిఘా వర్గాల సాయంతో ఏటీఎస్ అధికారులు వీరిపై కన్నేసి ఉంచారు. అన్ని అంశాలను నిర్ధారించుకుని మంగళవారం తెల్లవారుజామున భోపాల్, హైదరాబాద్‌లలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. భోపాల్‌లో 11 మంది పట్టుబడగా.. హైదరాబాద్‌లో మహ్మద్ సల్మాన్ మినహా ఐదుగురిని పట్టుకున్నారు. మహ్మద్ సలీం ఇంటి నుంచి రెండు ఎయిర్‌గన్‌లు, పిల్లెట్స్, కత్తులు, గొడ్డళ్లతోపాటు ఉగ్రవాద సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, యాసీర్, సలీంల నేతృత్వంలో 17 మంది గతంలో రాకెట్ చాట్ యాప్ ద్వారా సంప్రదింపులు జరిపారు. తుపాకులు, కత్తులు, గొడ్డళ్లను వినియోగించి ఎవరికి వారుగా 'లోన్ వూల్ఫ్ ఎటాక్స్ (ఒంటరిగానే ఎవరిపైనైనా దాడిచేసి కలకలం రేపడం)' చేయాలని, జనసమ్మర్ధ ప్రాంతాల్లో బాంబులతో విరుచుకుపడాలని కుట్రపన్నారు. కొన్నినెలల క్రితం వికారాబాద్, అనంతగిరి అడవుల్లో క్యాంపు నిర్వహించారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో దాడులకు డ్రోన్లతో రెక్కీ నిర్వహించారు.

# సీఎం జగన్ చొరవతో క్షేమంగా వచ్చాం

- మణిపూర్ నుంచి ఇంటికి చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆనందం



మళ్లా గణేష్



అనిరుధ్

**మధురపూడి/తాడేపల్లిగూడెం/వెంకటాచలం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ కారణంగానే తాము మణిపూర్ నుంచి క్షేమంగా ఇంటికి చేరామని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం శ్రీరంగపట్టానికి చెందిన మళ్లా గణేష్ మణిపూర్‌లోని ఇంఫాల్ సెంట్రల్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బీఎస్సీ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. అతను మణిపూర్ నుంచి సోమవారం రాత్రి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక విమానంలో హైదరాబాద్ వచ్చి, అక్కడి నుంచి మంగళవారం ఉదయం శ్రీరంగపట్నం చేరాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపకపోతే తన పరిస్థితి దారుణంగా ఉండేదని గణేష్ చెప్పాడు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో తనను ఆదుకుని క్షేమంగా ఇంటికి చేర్చారని సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. గణేష్ తండ్రి చంద్రశేఖరరావు, తల్లి వీరలక్ష్మి మాట్లాడుతూ తమ బిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కాగా, మణిపూర్ నిట్‌లో రెండో సంవత్సరం చదువుతున్న తాడేపల్లిగూడేనికి చెందిన అనిరుధ్ సోమవారం రాత్రి ఇంటికి చేరుకున్నాడు.

**స్వగ్రామానికి చేరిన కల్యాణ్‌కుమార్**

మణిపూర్‌లో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం పాలిచెర్లపాడుకు చెందిన బి.కల్యాణ్‌కుమార్ కూడా మంగళవారం ఉదయం తన ఇంటికి చేరాడు. మణిపూర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో సోమవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్న కల్యాణ్‌కుమార్‌ను అక్కడ నుంచి బస్సు ద్వారా రాత్రికి విజయవాడకు తీసుకొచ్చారు. అక్కడ నుంచి తన స్వగ్రామం పాలిచెర్లపాడుకు మంగళవారం ఉదయం చేరుకున్నాడు. కల్యాణ్‌కుమార్‌తోపాటు అతని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేశారు. తన కుమారుడిని క్షేమంగా ఇంటికి చేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు కల్యాణ్‌కుమార్ తండ్రి మునలయ్య కృతజ్ఞతలు తెలిపారు.



తల్లిదండ్రులతో కల్యాణ్‌కుమార్

# అనుమతి లేని ప్రాజెక్టులే అజెండా

- నేడు కృష్ణా బోర్డు సర్వసభ్య సమావేశం

**సాక్షి, అమరావతి:** కృష్ణా జలాలపై రెండు రాష్ట్రాల మధ్య వివాదాలకు ముగింపు పలికేందుకు కృష్ణా బోర్డు సిద్ధమైంది. అనుమతి లేని ప్రాజెక్టులే ప్రధాన అజెండాగా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్ అధ్యక్షతన 17వ సర్వ సభ్య సమావేశాన్ని బుధవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ప్రతిపాదించిన అంశాలతోపాటు బోర్డు పరిధిని నిర్దేశిస్తూ కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ అమలు, బడ్జెట్, 2023–24 నీటి సంవత్సరంలో జలాల పంపిణీతో సహా 21 అంశాలతో అజెండాను ఖరారు చేసింది. కృష్ణా తాగు నీటి సరఫరా పథకం ఒకటి, రెండు, మూడు దశల ద్వారా ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కాలువ కింద ప్రస్తుతం తెలంగాణ సర్కారు ఆయకట్టుకు నీటిని అందిస్తోంది. ఇందుకోసం నాగార్జున సాగర్ జల విస్తరణ ప్రాంతంలో రూ.1,450 కోట్లతో సుంకిశాల ఇన్‌టేక్ వెల్ ప్రాజెక్టును తెలంగాణ చేపట్టింది. దీనిపై ఏపీ ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో అభ్యంతరం తెలిపింది. సుంకిశాల ఇన్‌టేక్ వెల్, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను నిలిపివేయాలని బోర్డును కోరింది. నీటి కేటాయింపులు లేనందున పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతలకు అనుమతిని కూడా సీడబ్ల్యూసీ తిరస్కరించింది. కృష్ణా ట్రిబ్యునల్–2 కేటాయించిన 4 టీఎంసీలను వాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డీఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీం) కుడి కాలువను చేపట్టడంపై తెలంగాణ కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేసింది. ట్రిబ్యునల్ తీర్పు నోటిఫై అయ్యాకే పనులు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. ఆర్డీఎస్‌ను మరోసారి ప్రస్తావించేందుకు తెలంగాణ సిద్ధమైంది.

**గెజిట్ నోటిఫికేషన్ అమలయ్యేనా?**

బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆర్నెల్లలోగా దాన్ని అమలు చేయాలని పేర్కొంది. మరో ఆర్నెల్లు పొడిగించినా నోటిఫికేషన్ అమలుపై రెండు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రాలేదు. దీనిపై రెండు రాష్ట్రాలను ఒప్పించేందుకు బోర్డు సిద్ధమైంది. ఉమ్మడి రాష్ట్రానికి ట్రిబ్యునల్ కేటాయించిన 811 టీఎంసీల జలాల్లో 66 శాతం (512 టీఎంసీలు) ఏపీ, 34 శాతం (299 టీఎంసీలు) తెలంగాణ వాడుకునేలా 2015 జూన్ 19న తాత్కాలిక ఒప్పందం కుదిరింది. కానీ.. సగ భాగం వాటా కావాలని తెలంగాణ డిమాండ్ చేయడంతో నీటి పంపిణీపై కూడా బోర్డు చర్చించనుంది.

**హిందీలో కార్యకలాపాలా?**

కేంద్రంతో బోర్డు ఉత్తర ప్రత్యుత్తరాలు, కార్యకలాపాలు హిందీ భాషలోనే జరగాలని కేంద్ర జల్ శక్తి శాఖ కోరుతోంది. కానీ.. రెండు రాష్ట్రాల అధికారులకు హిందీ భాషలో ప్రావీణ్యం లేదు. దీనిపై బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. కేంద్ర జల్ శక్తిశాఖ అనుమతి లేకుండా బోర్డులో పని చేస్తున్న సిబ్బందికి మూలవేతనంలో 25శాతం ప్రోత్సాహకంగా ఇచ్చిన నిధులు రికవరీ చేయాలన్న కేంద్రం ఆదేశాలపైనా చర్చించనున్నారు.

నాన్న కళ్లలో
ఆ ఆనందం కోసమే నా తపన

ఫలితాలలో కార్పొరేట్ స్కూళ్లకు
మించి ప్రభుత్వ స్కూళ్లు

ఏపీ ప్రభుత్వ స్కూళ్ల టెన్త్ టాపర్
కామిరెడ్డి హేమశ్రీ (594/600)

# ‘కలాసీ కూతురు ఇంజినీర్’

అని అందరూ చెప్పుకోవాలి


హేమశ్రీ


తండ్రి శ్రీనివాసరావు, తల్లి గోవిందమ్మలతో హేమశ్రీ

‘‘మా నాన్న వ్యవసాయ కూలీగా ఉంటూ కుటుంబాన్ని పోషించేవారు. ఆ సంపాదన మా చదువులకు సరిపోదని విశాఖ వచ్చి పూర్ణామార్కెట్‌లో కలాసీగా పనిచేస్తున్నారు. నాకు మంచి మార్కులు వస్తున్నాయని, బాగా చదివించమని మా ఉపాధ్యాయులు చెప్పడంతో నాన్న ఎప్పుడూ నా గురించే ఆలోచించేవారు. చాలీచాలని సంపాదనతో ఎలా చదివించాలన్నదే ఆయన ఆందోళన. అలాంటి సమయంలో నేను 8వ తరగతిలో ఉండగా మొదటిసారి అమ్మ ఒడి అందింది. వరుసగా మూడేళ్ల ఆ పథకం వల్ల లబ్ధి పొందడం వల్ల నా చదువు ఎలాంటి భారం లేకుండా సునాయాసంగా సాగిపోయింది. మా పాఠశాల ఉపాధ్యాయులందరూ ప్రత్యేక శ్రద్ధతో నన్ను తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉంది’’

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో 594 మార్కులు సాధించి ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల్లో టాపర్‌గా నిలిచిన అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థిని కామిరెడ్డి హేమశ్రీ మనోగతమిది.

అతి సామాన్య కుటుంబం నుంచి వచ్చి చదువుల సరస్వతిగా నిలిచింది. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తెచ్చింది. ఒకప్పుడు కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన టెన్త్ టాపర్లు.. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల నుంచి పుట్టుకొచ్చారు. అలాంటి టాపర్లలో ఈమె ఒకరు. ఆమెతో ‘సాక్షి’ సంభాషించింది. హేమశ్రీ ఎలా ఈ స్థాయికి చేరుకుందో ఆమె మాటల్లోనే..

**నాన్న మాటలే స్ఫూర్తి**

‘‘అమ్మ గోవిందమ్మ, మా నాన్న శ్రీనివాసరావు. నాన్న పదో తరగతిలో రెండు సబ్జెక్టులు ఫెయిల్. ప్రస్తుతం విశాఖలోని పూర్ణా మార్కెట్లో కలాసీ. ఓ రకంగా నాన్నే నా విజయానికి స్ఫూర్తి. తను బాగా చదవలేకపోవడం వల్లే టెన్త్ ఫెయిలయ్యారు. కలాసీగా రాత్రీపగలూ కష్టపడుతున్నారు. అదే మాకు పదేపదే చెప్పేవారు. తానెన్ని కష్టాలుపడ్డా.. అదంతా నా కోసం, నా తమ్ముడి కోసమేనని గుర్తు చేసేవారు. మా చదువులకు డబ్బులు అవసరమవుతాయనే ఆరేళ్ల క్రితం దేవరాపల్లి నుంచి విశాఖ వచ్చేశారు. నాన్న కష్టం తెలుసు. అందుకే చదువు తప్ప వేరే ధ్యాసలేకపోయింది. అదే నన్ను పదో తరగతి ఫలితాల్లో 594 మార్కులతో టాపర్‌గా నిలిపింది.

**చదువంతా సర్కారీ స్కూల్లోనే..**

ఒకటో తరగతి నుంచి 4వ తరగతి వరకూ మా స్వగ్రామం దేవరాపల్లి మండలం కొత్తపెంటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నా. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రవేశ పరీక్షలో 92 మార్కులు సాధించా. దీంతో అచ్యుతాపురం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (గరల్స్)లో సీటు వచ్చింది. నా జీవితంలో నేను సాధించిన తొలి విజయమది. ఐదోతరగతి నుంచి పదో తరగతి వరకూ ఇక్కడే. అమ్మానాన్నల కష్టం తెలియడంతో వారికి ఏ రోజూ నా చదువు భారం కాకూడదనుకున్నాను. ఎంత బాగా చదివితే.. నా చదువుకు అంత తక్కువ ఖర్చవుతుందని తెలుసుకున్నాను. దీనికి నా తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత తెలియడం ఒక కారణమైతే, మా స్కూల్ టీచర్లు మరో కారణం. ఇక్కడ చదువుతున్న వారిలో దాదాపు అంతా దిగువ మధ్యతరగతికి చెందిన వారే. అందుకే మా టీచర్లు చదువు విలువ తెలిసేలా, పరీక్షల భయం పోయేలా నిత్యం మమ్మల్ని ప్రోత్సహించారు.

**వసతులు పెరిగాయి**

సాధారణంగా రెసిడెన్షియల్ స్కూళ్లు మిగిలిన ప్రభుత్వ స్కూళ్లతో పోల్చుకుంటే కాస్త మెరుగ్గానే ఉంటాయి. అయితే నా వ్యక్తిగత అవసరాలకు మొదటి మూడేళ్లు ఇంటి నుంచి కొంత డబ్బులు తీసుకొచ్చేదాన్ని గత మూడేళ్లుగా పరిస్థితి చాలా మారింది. వసతులు మరింత మెరుగయ్యాయి. పర్యవేక్షణ పెరిగింది. పుస్తకాలు, యూనిఫాం, షూస్.. ఇలాంటి వాటి కోసం అమ్మానాన్నల్ని డబ్బులడిగే అవసరం లేకుండా పోయింది. మూడుసార్లు అమ్మ ఒడి అందుకున్నా. సీఎం జగన్ మామయ్య ప్రభుత్వంలో కార్పొరేట్ స్కూళ్లను మించి ప్రభుత్వ స్కూళ్లు బాగుపడ్డాయి.

**ఇంజినీర్ కావడమే లక్ష్యం**

ఇంజినీర్ కావాలన్నది నా కల. అందుకు రూ.లక్షల్లో ఖర్చుపెట్టే స్థోమత నా కుటుంబానికి లేదు. బాగా చదవడమే ఖర్చులేని దారని నాకు తెలుసు. అందుకే టీచర్లు చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు పునఃశ్చరణ చేసుకునేదాన్ని. అర్థంకాని విషయాల్ని ఎప్పుడు అడిగినా, టీచర్లు ఓపిగ్గా విడమరిచి చెప్పేవారు. నా తమ్ముడు సందీప్ ప్రస్తుతం 7వ తరగతి పూర్తి చేసుకున్నాడు. మా అమ్మానాన్నలకు మేం భరోసాగా నిలవాలన్నదే నా కోరిక. దాన్ని నెరవేర్చేందుకు చదువు తప్ప, నాకు వేరే మార్గం తెలియదు. ఇంజినీర్‌గా స్థిరపడి నాలాంటి వారికి ఆసరాగా నిలవగలిగితే చాలు. ‘కలాసీ కూతురు ఇంజినీర్’ అని నలుగురూ చెప్పుకుంటే.. మా నాన్న కళ్లలో కనిపించే ఆనందాన్ని చూడాలి.. అంతే..!’’

– లోవరాజు, సాక్షి, అనకాపల్లి

## మిట్టు.. సూపర్ హిట్టు

టెన్త్‌లో 594 మార్కులు


తల్లిదండ్రులతో మిట్టు మహాపాత్రో

శ్రీకాకుళం జిల్లా (ఆంధ్రప్రదేశ్) పాతపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిన మిట్టు మహాపాత్రో 600కు 594 మార్కులు సాధించాడు. పాతపట్నంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ ఎదురుగా ప్రధాన రహదారిలో వీరి ఇల్లు. మహాపాత్రో తండ్రి దుర్గాప్రసాద్ మహాపాత్రో ద్విచక్రవాహనాల టైర్లకు పంక్చర్లు వేస్తుంటారు. తల్లి మమత మహాపాత్రో గృహిణి. మిట్టు పాఠశాల సెలవుల్లోను, ఇంటి వద్ద ఉన్నప్పుడు సైకిల్‌కు, బైక్‌లకు పంక్చర్లు వేయడంలో తండ్రికి సహాయం చేస్తుండేవాడు. ఒడియా బ్రహ్మణ కుటుంబానికి చెందిన పేద కుటుంబం వీరిది. మిట్టుకు పదో తరగతిలోఅత్యధిక మార్కులు రావడంతో ఆ కుటుంబంపై ఇప్పుడు ప్రశంసలు కురుస్తున్నాయి. పాతపట్నంలో 20 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నా అత్యధిక మార్కులు మాత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన మిట్టు సాధించాడు. తన కుమారుడికి పదో తరగతిలో జిల్లా మొదటి స్థానం రావడంతో ఆనందంగా ఉందని తండ్రి దుర్గా ప్రసాద్ తెలిపారు. మిట్టు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పాతపట్నం ప్రభుత్వ ప్రాథమిక ఒడియా పాఠశాలలో చదివాడు.

**ఇంజినీర్ అవుతా...**

అమ్మ, నాన్న, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో పదో తరగతిలో మంచి మార్కులు సాధించాను. ట్రిపుల్ ఐటీ చదివి, ఇంజినీర్ అవుతా. – మిట్టు మహాపాత్రో

– రవి కుమార్, సాక్షి పాతపట్నం

మే 12 అంతర్జాతీయ నర్సుల దినోత్సవం. దుబయ్ హెల్త్‌కేర్ సంస్థ ‘ఏస్టర్ గార్డియన్స్’ ఆ రోజున లండన్‌లో ఒక గొప్ప నర్సుకు రెండున్నర లక్షల యూఎస్ డాలర్లతో (రెండు కోట్ల రూపాయలు) ‘గ్లోబల్ నర్సింగ్ అవార్డ్’ బహూకరించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఇందుకు 10 మంది నర్సులను షార్ట్‌లిస్ట్ చేస్తే మన దేశం నుంచి ఒకరు శాంతి తెరెసా లక్రా. అండమాన్‌లో ఆదివాసీలకు చేసిన సేవ, సునామీ సమయంలో చూపిన కరుణ ఆమెకు ఇదివరకే ‘పద్మశ్రీ’ని తెచ్చి పెట్టగా ఇప్పుడు గ్లోబల్ అవార్డు కనుచూపుమేరలో ఉంది. లక్రా పరిచయం.

● గ్లోబల్ అవార్డ్/ షార్ట్‌లిస్ట్

# అండమాన్‌కు ఆమే నర్సు



నర్స్‌ని ‘సిస్టర్’ అని పిలుస్తాం కాని ‘మదర్’ అని పిలిచినా తక్కువే. తల్లిలా సేవ చేసి, ఔషధాలిచ్చి పేషెంట్‌ని ఆరోగ్యవంతుణ్ణి చేయడంలో ఆమె చూపే ఓపిక గొప్పది. నర్సుల వ్యవస్థ లేకపోతే, నర్సులనే వారే లేకపోతే పేషెంట్లు ఏమైపోతారో. అందుకే ప్రపంచవ్యాప్తంగా మే 12వ తేదీని ‘అంతర్జాతీయ నర్సుల దినోత్సవం’గా జరుపుకుంటారు. నర్సుల సేవను కొనియాడతారు. భారత సంతతికి చెందిన డాక్టర్ ఆజాద్ మూపన్ దుబాయ్‌లో ‘ఏస్టర్ గార్డియన్స్’ అనే హెల్త్‌కేర్ సంస్థను నడుపుతూ గొప్ప సేవ చేస్తున్న నర్సుకు రెండు కోట్ల రూపాయల నగదుతో ‘గ్లోబల్ నర్సింగ్ అవార్డు 2023’ ను బహూకరించదలిచారు. ఆన్‌లైన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా 50 వేల మంది నర్సులు ఈ అవార్డు కోసం పోటీ పడితే ఫైనలిస్టులుగా 10 మంది నిలిచారు. వీరిలో 8 మంది స్త్రీలుకాగా, ఇరువురు పురుషులు. కెన్యా, పనామా, ఇంగ్లాండ్, టాంజానియా, పోర్చుగల్... తదితర దేశాల నుంచి ఒక్కొక్కరు ఫైనల్‌కు చేరగా మన దేశం నుంచి శాంతి తెరెసా లక్రా ఆ పట్టికలో నిలిచింది.

ప్రస్తుతం వీరి గెలుపుకు ఓటింగ్ జరుగుతోంది. ఎవరికి ఎక్కువ ఓట్లు దక్కుతాయో వారికి అవార్డును లండన్‌లో మే 12న బహూకరిస్తారు.

**లిటిల్ అండమాన్‌లో**

2000 సంవత్సరం నుంచి శాంతి తెరెసా లక్రా లిటిల్ అండమాన్‌లోని దుగాంగ్ క్రీక్‌లో విధులు నిర్వహించేది. అక్కడ ఓన్‌గీ గిరిజన తెగ వారు ఎక్కువ. వారు నాగరిక ప్రపంచంలో కలవరు. వైద్య సేవలను తీసుకోరు. కాని శాంతి లక్రా వారితో అతి కష్టం మీద మాట కలిపి నమ్మకం సంపాదించింది. ముఖ్యంగా గర్భిణీలకు వైద్య సహాయం అందేలా జాగ్రత్త తీసుకునేది. ఓన్‌గీ తెగ వారు తన దగ్గరకు రాకపోయినా తనే మందులు తీసుకుని అడవిలోకి వెళ్లేది. ‘ఒక్కోసారి తిరిగొస్తానో రానో కూడా తెలియని పరిస్థితిలో వెళ్లేదాన్ని’ అని ఆమె గుర్తు చేసుకుంది. క్రమక్రమంగా వారు ఆమెను విశ్వసించసాగారు.

**2004 సునామీలో**

ప్రపంచాన్ని కుదిపేసిన సునామీ అండమాన్‌ని అతలాకుతలం చేసింది. ముఖ్యంగా శాంతి లక్రా పని చేస్తున్న లిటిల్ అండమాన్‌లో ఏ అండా మిగల్లేదు. శాంతి కూడా ఒక గుడారం వేసుకుని వైద్య సహాయం అందించాల్సి వచ్చింది. ‘అలాంటి పరిస్థితిలోనే ఒకే రాత్రి ఇద్దరు ఓన్‌గీ మహిళలకు డెలివరీ చేశాను. ఒక మహిళకు చాలా బరువు తక్కువ శిశువు పుట్టింది. తల్లీ బిడ్డా ఇద్దరినీ కాపాడాల్సి వచ్చింది. వారిని పదిరోజులు చలి నుంచి కాపాడుతూ హెలికాప్టర్ సహాయం కోరి పోర్ట్‌బ్లెయిర్ తరలించాను. ఆరు నెలల తర్వాత వారు ఆరోగ్యంగా తిరిగి వచ్చారు. చాలా సంతోషించాను’ అని తెలిపింది శాంతి. ఆ సమయానికి ఆమె కొడుకు వయసు ఒక సంవత్సరం. పిల్లాణ్ణి కూడా చూసుకోలేక విధుల్లో మునిగి ఉండటం వల్ల అత్తామామలు వచ్చి బాబును తీసుకెళ్లారు. ‘రెండేళ్లు వాడి ముఖం చూడకుండా పని చేశాను’ అని చెప్పిందామె. 2006 వరకూ ఓన్‌గీ తెగ కోసం పని చేయడం వల్ల ఆమెకు రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా ‘పద్మశ్రీ’ ఇచ్చి గౌరవించింది ప్రభుత్వం. ఇప్పుడు శాంతి పోర్ట్ బ్లెయిర్‌లోని జి.బి.పంత్ హాస్పిటల్‌లో పని చేస్తోంది.

**కోవిడ్ కాలంలో**

‘మార్చి 24, 2020న అండమాన్‌లో తొలి కోవిడ్ కేస్ నమోదైంది. ఆ సమయంలో మా హాస్పిటల్‌లో ఇద్దరు గిరిజనులు వైద్యం పొందుతున్నారు. నేను వెంటనే హాస్పిటల్ వదిలి గూడేలకు వెళ్లిపోండి అని పంపించేశాను. వారికి కోవిడ్ సోకితే అండమాన్‌లోని అన్ని తెగలకు అంటుకుంటుంది. వారి రోగనిరోధక శక్తి తక్కువ. బతకరు. అందుకని వారిని అడవుల్లో ఇంకా లోపలికి వెళ్లి గడపండని చెప్పాను. వాళ్లు అర్థం చేసుకున్నారు. తమను తాము కాపాడుకున్నారు’ అని చెప్పింది శాంతి లక్రా.

కోవిడ్ కాలంలో ఆమె ఎంతో ధైర్యంగా అక్కడి భారతీయులకు వైద్య సహాయం అందించింది. ఆదివాసీ తెగలను ఒప్పించి వాక్సిన్లు వేసుకునేలా చేసింది. వృత్తి పట్ల ఎంతో అంకిత భావం ఉన్నవారే ఇవన్నీ చేయగలరు. అందుకే ఆమె గొప్ప నర్స్‌గా జేజేలు అందుకుంటున్నది. అవార్డు వచ్చినా రాకపోయినా ఆమె గొప్ప నర్సే.

● గౌరవం

# సేవకు ఆహ్వానం


మంజు మాల్హి

ఆంగ్లో ఇండియన్ వంటకాల్లో మహా వంటగత్తెగా పేరు తెచ్చుకున్న మంజు మాల్హికి ‘ప్రిన్స్ చార్లెస్ గారి పట్టాభిషేకానికి హాజరుకండి’ అని అరుదైన ఆహ్వానం అందింది. ఆమె వెళ్లింది. ఆమెకే ఎందుకు?

**1940 నాటి స్టయిల్‌తో**

చార్లెస్ పట్టాభిషేకానికి ఫ్యాషన్ డిజైనర్ గీతా హండా డిజైన్ చేసిన 1940ల నాటి ఇండో బ్రిటిష్ స్టయిల్ కాస్ట్యూమ్స్‌తో హాజరైంది మంజు మాల్హి. అంతేకాదు కొందరు దేశ ప్రతినిధులను రాజప్రాసాదం తరఫున రిసీవ్ చేసుకునే అవకాశం కూడా పొందింది. ‘ఆ అనుభవం జీవితాంతం మర్చిపోలేను’ అందామె. వంటలో కశ్మీరీ కారం పొడిని తప్పక వాడే మంజు ఆలూ, పచ్చి మిర్చిలతో బోలెడన్ని వంటలు చేస్తుంది. ఆమెకు వ్యక్తిగతంగా షాహీ పనీర్ ఇష్టం. ‘ప్రతి కూరకూ తినే సందర్భం ప్రత్యేకంగా ఉంటుంది’ అని చెప్పే మంజు తన ప్రత్యేకతలతో విశిష్టంగా నిలిచింది.

ప్రపంచవ్యాప్తంగా ఎంచి ఎంచి తయారు చేసిన 2000 మంది అతిథుల పట్టిక– ప్రిన్స్ చార్లెస్ పట్టాభిషేక మహోత్సవం కోసం ఖరారైంది. రాజ్యాధినేతలు, మతాధికారులు, సంపన్నులు... వీరందరూ ఉన్న ఈ లిస్ట్‌లో ఒక బ్రిటిష్ ఇండియన్ అయిన షెఫ్ కూడా ఉంది. ఆమె పేరు మంజు మాల్హి. వాయవ్య లండన్‌లో సెలబ్రిటీ షెఫ్‌గా జీవనం సాగిస్తున్న ఆమెకు ఏప్రిల్ నెలాఖరులో మెయిల్ వచ్చింది ‘మే 6న జరగనున్న ప్రిన్స్ చార్లెస్ పట్టాభిషేకానికి హాజరుకండి’ అని. ఆమె ఆ మెయిల్ చూసి ఎవరో ప్రాంక్ చేస్తున్నారని లైట్ తీసుకుంది. కాని ఆ తర్వాత అదే మెయిల్‌ను ధ్రువీకరిస్తూ అధికార ఆహ్వాన పత్రం అందింది. ఎంతో అరుదుగా జరిగే ఒక వేడుకలో మహామహుల మధ్య తనక్కూడా ఆహ్వానం అందడంతో మంజు మాల్హి ఆనందానికి అవధుల్లేవు.



**పంజాబ్ నుంచి వెళ్లి**

50 ఏళ్ల మంజు మాల్హిది పంజాబ్. ఆమె తల్లిదండ్రులు ఆమె పుట్టకముందే లండన్ వలస వెళ్లారు. మంజు అక్కడే పుట్టింది. అయితే బాల్యంలో ఆమె ఇండియాను మిస్ కాకూడదని కొన్నేళ్లు పంజాబ్‌లో ఉంచారు తల్లిదండ్రులు. అప్పుడే ఆమెకు భారతీయ రుచులు అర్థమయ్యాయి. ఆ తర్వాత లండన్‌కు చేరుకున్నా తల్లి బ్రిటిష్ దినుసులను, ఇండియన్ మసాలాలను కలిపి రోజూ వంటలు చేసేది. ఆ వంటలు మాల్హి మీద గాఢమైన ముద్ర వేశాయి. చాలా శ్రద్ధగా వంట నేర్చుకుంది. షెఫ్‌గా బతకాలని నిశ్చయించుకుంది. ఆ దిశగానే కెరీర్ మొదలెట్టింది.

**1999లో వెలుగులో**

బీబీసీ టీవీ కార్యక్రమం ‘ఫుడ్ అండ్ డ్రింక్’ 1999 సంవత్సర విజేతగా నిలవడంతో మంజు మాల్హి వెలుగులోకి వచ్చింది. బ్రిట్–ఇండిగా ఆమె పేర్కొనే వంటలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకోవడంతో అప్పుడు బీబీసీతో మొదలైన అనుబంధం ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. మంజు బీబీసీకి రెగ్యులర్‌గా ఫుడ్ ప్రోగ్రాములు చేస్తోంది. అంతే కాదు లండన్‌లో స్థిరపడిన భారతీయుల కోసం ‘బ్రిట్ స్పైస్’ అనే పుస్తకం రాసింది. అది పెద్ద హిట్. ఆ తర్వాత ‘ఇండియా విత్ పాషన్’, ‘ఈజీ ఇండియన్ కుక్‌బుక్’లాంటి పుస్తకాలు వెలువరించింది. చాలా సులభంగా తయారయ్యి రుచిగా ఉండటమే ఆమె వంటల ప్రత్యేకత.

**కోవిడ్ సేవలు**

కోవిడ్ కాలంలో లండన్‌లో వంట చేసుకోలేకపోతూ ఇళ్లల్లో ఇబ్బంది పడుతున్న వయోవృద్ధులను గమనించి ‘ఓపెన్ ఏజ్’ అనే కార్యక్రమం మొదలెట్టింది మంజు మాల్హి. తనే వారి కోసం వంట చేస్తూ ఆహారం అందించింది. అయితే అది శ్రమ కనుక కాన్ఫరెన్స్ కాల్స్ ద్వారా వయోవృద్ధులకు వంట చేసుకుని తినగలిగే సులభ వంటలను నేర్పింది. ‘కోవిడ్ సమయంలో ఫ్రైస్ వల్ల వృద్ధులు ఎక్కువ తినడం మొదలుపెట్టారు. వారికి ఆరోగ్యకరమైన తిండి చేసి చూపించడంతో వంటలో పడి కోవిడ్ భయం నుంచి బయటపడ్డారు’ అని తెలిపింది మంజు. ఈ కార్యక్రమం పెద్ద సక్సెస్ అయ్యింది. కోవిడ్ ముగిశాక ఇప్పుడు తాను ఉంటున్న ఏరియాలోనే తన కిచెన్‌లో వయోవృద్ధులకు ఫ్రీ క్లాసెస్ చెబుతోంది మంజు. తన కంటే వయసులో ఎంతో పెద్దవాళ్లయిన స్త్రీ, పురుషులు రోజూ వచ్చి బుద్ధిగా బీన్స్ వలుస్తూ క్యారెట్ తరుగుతూ మంజు దగ్గర వంట నేర్చుకుంటారు. వాళ్లంతా ఆమెను గురువుగా చూస్తారు. ఇది బ్రిటన్ ప్రభుత్వానికి బాగా నచ్చింది. అందుకే ప్రతిష్టాత్మకమైన ‘బ్రిటిష్ ఎంపైర్ మెడల్’ ఆమెకు బహూకరించింది. చార్లెస్ పట్టాభిషేకానికి ఈ మెడల్ పొందిన వారందరినీ పిలిచారు. వారిలో మంజు ఉంది.

# యూ(త్) అండ్ ఐ

యూత్ పల్స్

‘సినీ కలల యువతరానికి దారి ఏది?’ అనే ప్రశ్నకు ఎన్నో జవాబులు వినిపిస్తాయి. అప్రెంటీస్‌గా చేరడం నుంచి నిర్మాతకు కథ వినిపించి ఒప్పించడం వరకు అదొక సుదీర్ఘ ప్రయాణం.

అద్భుత ప్రతిభ ఉండి కూడా ఆ ప్రయాణంలో అడుగులు ముందుకు పడని వారు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారికి యాపిల్ కంపెనీ వారి ‘షాట్ ఆన్ ఐ ఫోన్’ పెద్ద గిఫ్ట్‌గా మారి లిఫ్ట్ ఇస్తోంది..!


సైన్స్ ఫిక్షన్ మూవీ కార్గో కోసం శ్వేత త్రిపాఠికి సూచనలిస్తున్న ఆరతి కడవ్

ప్రసిద్ధ బాలీవుడ్ దర్శకుడు, మ్యూజిషియన్ విశాల్ భరద్వాజ్ రెండు నెలల క్రితం ‘ఫుర్సత్’ అనే చిత్రాన్ని తీశాడు. 30 నిమిషాల నిడివి కలిగిన ఈ చిత్రాన్ని పూర్తిగా ఐఫోన్ ప్రో 14లో తీశాడు. యాపిల్ ఇండియా ఈ చిత్రాన్ని తన అధికారిక యూట్యూబ్ చానల్‌లో విడుదల చేస్తే 144 మిలియన్‌లకు పైగా వ్యూస్ వచ్చాయి.

సైన్స్–ఫిక్షన్ ఫిల్మ్‌మేకర్ ఆరతి కడవ్ ఐఫోన్‌ను ఉపయోగించి రెండు షార్ట్ ఫిల్మ్స్ తీసింది. తొలి చిత్రం ‘55 ఎం/సెకండ్స్’ కరోనా సమయంలో మారుమూల ప్రాంతాల్లో చిత్రీకరించింది. రెండో చిత్రం ది ఆస్ట్రోనాట్ అండ్ ది ప్యారట్. తన చిత్రాలను ఎడిటింగ్ చేయడానికి మ్యాక్‌బుక్ ప్రోమోను ఉపయోగించింది. ఆ రెండు చిత్రాలకు పెద్ద ఖర్చయితే కాలేదుగానీ పెద్ద పేరు మాత్రం వచ్చింది. ఐఫోన్ 12 ప్రోమాక్స్ ఉపయోగించి చిత్రించిన ‘ది ఆస్ట్రోనాట్ అండ్ ది ప్యారట్’ ఫాంటసి ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ పోటీలో ఆరతికి ‘బెస్ట్ డైరెక్టర్’ అవార్డ్‌ను తెచ్చిపెట్టింది. ఇండియాలోని బెస్ట్–సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్‌మేకర్‌లలో ఒకరిగా పేరు తెచ్చింది.

దిల్లీకి చెందిన ఫొటోగ్రాఫర్ పారుల్ శర్మ తన ఫొటోబుక్ ‘డైలెక్ట్స్ ఆఫ్ సైలెన్స్: దిల్లీ అండర్ లాక్‌డౌన్’ కోసం ఐఫోన్ ప్రో11ను ఉపయోగించింది. ఫొటోగ్రాఫర్ రితేష్ ఉత్తమ్‌చందానీ ముంబై జీవితాన్ని పట్టించే ‘ది రెడ్ క్యాట్ అండ్ అదర్‌స్టోరీస్’ కోసం ఐఫోన్ ఉపయోగించాడు. ఈ ఫొటోబుక్‌లోని 98 చిత్రాలను ఐమ్యాక్, మ్యాక్‌బుక్, ఐప్యాడ్‌లతో ఎడిట్ చేశాడు.



**సాఫ్ట్‌వేర్ టు షార్ట్‌ఫిల్మ్స్**

మధ్యతరగతిలో కుటుంబంలో పుట్టిన ఆరతి కడవ్ ఐఐటీ, కాన్పూర్‌లో ఇంజినీరింగ్ చేసింది. అమెరికాలో మైక్రోసాఫ్ట్ కంపెనీలో ఉద్యోగం చేసింది. తాను రాసుకున్న కథలను సెల్‌ఫోన్ కెమెరాతో షార్ట్ ఫిల్మ్స్ తీసేది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నప్పుడు కూడా ‘సినీ కల’ ఆమెను వదిలి వెళ్లలేదు. దీంతో ఉద్యోగానికి గుడ్‌బై చెప్పి కెమెరా చేతబట్టింది. ఐఫోన్ 12 ప్రో మాక్స్ తో తీసిన ‘ది ఆస్ట్రోనాట్ అండ్ హిజ్ ప్యారట్’ చిత్రంతో బెస్ట్ డైరెక్టర్‌గా గుర్తింపు పొందింది. ‘మన టాలెంట్ నలుగురి దృష్టిలో పడడానికి ఇప్పుడు ఎన్నో మార్గాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకోవడం కూడా మన ప్రయాణంలో భాగం కావాలి’ అంటుంది ఆరతి కడవ్.

తాను ఉపయోగించే ఐఫోన్‌లను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేస్తుండడం అతడి పాషన్. ఐఫోన్ 10,11,12,13లను ఉపయోగించిన రితేష్ ప్రస్తుతం ఐఫోన్ 14 ప్రోమాక్స్ ఉపయోగిస్తున్నాడు. తన ఫొటోబుక్ కోసం ఐఫోన్ 5ఎస్, ఐఫోన్ 6ఎస్ ఉపయోగించాడు.

యాపిల్ కంపెనీ కొన్ని సంవత్సరాల క్రితం ‘షాట్ ఆన్ ఐ ఫోన్’ క్యాంపెయిన్ మొదలుపెట్టింది,

సక్సెస్‌ఫుల్ యూజర్ జెనరేటెడ్ కంటెంట్ క్యాంపెయిన్‌గా ఇది పేరు తెచ్చుకుంది. దీనికి కేవలం ఇన్‌స్టాగ్రామ్‌లోనే 27.9 మిలియన్‌ల పోస్ట్‌లు ఉన్నాయి.

ఐఫోన్ యూజర్‌లు ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్‌లో షేర్ చేసిన ‘షార్ట్స్’ ప్యానల్ జడ్జీల ద్వారా బిల్‌బోర్డ్, యాపిల్ రిటైల్ స్టోర్‌లలోకి వెళతాయి. దీని ద్వారా క్రియేటర్‌లకు మంచి గుర్తింపు లభిస్తోంది.

‘షాట్ ఆన్ ఐఫోన్’ అనేది యాపిల్ ఉత్పత్తుల ప్రచార వ్యూహం అయితే కావచ్చుగానీ దీని ద్వారా యువత సృజన మరో స్థాయికి చేరింది. సాంకేతిక విషయాలపై లోతైన అవగాహన ఏర్పడడానికి కారణం అయింది.

ఐఫోన్‌తో తీసిన చైనీస్ మూవీస్ చూసి అబ్బురపడిన విశాల్ భరద్వాజ్ ‘ఫుర్సత్’ కోసం ఐఫోన్ చేతపట్టాడు.

విశాల్ ‘ఫుర్సత్’ ఎంత హిట్ అయింది అనే విషయం పక్కన పెడితే, ఆయన మాటల్లో ఈ చిత్ర ప్రయాణాన్ని అర్థం చేసుకోవడానికి యూత్ (సినీ కలల యువతరం) ప్రాధాన్యత ఇచ్చింది.

‘వెరీ లిబరేటివ్’ అని తన ప్రయాణ అనుభవాన్ని చెబుతూ యూత్‌ను ఉద్దేశించి ఇలా చెప్పాడు విశాల్ భరద్వాజ్...

‘సినిమా కెమెరాతో షూట్ చేయడం అనేది ఖర్చుతో కూడుకున్న పని. దీంతోపాటు ఒక బృందాన్ని కూడా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఇది కూడా ఖర్చుతో కూడుకున్న పని. నిర్మాతను వెదుక్కుందామనుకుంటే మనం రాసుకున్న స్క్రిప్ట్‌లకు అతడి వ్యాపార లెక్కలకు పొంతన కుదరకపోవచ్చు. మన జేబులో ఒక ఫోన్ ఉంది అనే విషయాన్ని గుర్తు చేసుకుంటే ఖర్చు అవసరం లేదు. కంటెంట్‌పై దృష్టి పెడితే చాలు. ఇది ఫిల్మ్‌మేకర్స్‌కు అద్భుతమైన సమయం’



## నితీశ్ రాణాపై రూ. 12 లక్షల జరిమానా

పంజాబ్ కింగ్స్ జట్టుతో సోమవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో పూర్తి ఓవర్ల కోటా పూర్తి చేయనందుకు కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కెప్టెన్ నితీశ్ రాణాపై రూ. 12 లక్షలు జరిమానా విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా ఈ సీజన్‌లో హార్దిక్ పాండ్యా (గుజరాత్), కోహ్లి, డుప్లెసిస్ (బెంగళూరు), సామ్సన్ (రాజస్తాన్), తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (ముంబై), కేఎల్ రాహుల్ (లక్నో), వార్నర్ (ఢిల్లీ)లపై ఐపీఎల్ నిర్వాహకులు జరిమానా విధించారు.



## అభిమన్యుతో అర్జున్ గేమ్ 'డ్రా'

టెపి సెగెమన్ ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తొలి 'డ్రా' నమోదు చేశాడు. భారత సంతతికి చెందిన అమెరికా గ్రాండ్‌మాస్టర్, 14 ఏళ్ల అభిమన్యు మిశ్రాతో జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను 19 ఏళ్ల అర్జున్ 33 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. గ్రాండ్‌మాస్టర్ హోదా పొందిన అత్యంత పిన్న వయస్కుడిగా ప్రపంచ రికార్డు సృష్టించిన అభిమన్యు ఈ టోర్నీలో రెండు గేముల్లో నెగ్గి, నాలుగు గేమ్‌లను 'డ్రా' చేసుకొని నాలుగు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.

# 'సూర్య' ప్రతాపం

- 35 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్స్‌లతో 83
- బెంగళూరుపై 16.3 ఓవర్లలో 200 లక్ష్యాన్ని ఛేదించిన ముంబై
- వధేరా అజేయ అర్ధ సెంచరీ
- మ్యాక్స్‌వెల్, డుప్లెసిస్ మెరుపులు వృథా


సూర్యకుమార్

ముంబై: ఐపీఎల్‌లో మళ్లీ బంతి బలయ్యింది. బ్యాట్లు ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఓవర్‌కు 10 పైచిలుకు రన్‌రేట్ కూడా దిగొచ్చింది. ముందు బెంగళూరు అదరగొడితే... తర్వాత ముంబై అంత పెద్ద లక్ష్యాన్ని చెదరగొట్టింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో బెంగళూరుపై ఘనవిజయం సాధించింది. తొలుత బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీస్కోరు చేసింది. మ్యాక్స్‌వెల్ (33 బంతుల్లో 68; 8 ఫోర్లు, 4 సిక్సర్లు), డుప్లెసిస్ (41 బంతుల్లో 65; 5 ఫోర్లు, 3 సిక్సర్లు) దంచేశారు. తర్వాత కొండంత లక్ష్యాన్ని ముంబై 16.3 ఓవర్లలోనే 4 వికెట్లే కోల్పోయి 200 పరుగులతో ఛేదించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్యకుమార్ యాదవ్ (35 బంతుల్లో 83; 7 ఫోర్లు, 6 సిక్సర్లు) తన ఐపీఎల్ కెరీర్‌లోనే అత్యధిక వ్యక్తిగత స్కోరుతో అదరగొట్టేశాడు. నేహల్ వధేరా (34 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు.

**క్యాచ్ మిస్ చేయడంతో...**

ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే వధేరా క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన డుప్లెసిస్ తర్వాత ఉతికి ఆరేశాడు. దీంతో ఆరంభంలోనే స్టార్ బ్యాటర్ కోహ్లి (1), అనూజ్ రావత్ (6) అవుటైనా ఆ ప్రభావం కనిపించలేదు. మ్యాక్స్‌వెల్, డుప్లెసిస్ ఉప్పెనతో పరుగుల ప్రవాహం బెంగళూరును కదం తొక్కించింది. ధాటిగా ఆడి ప్రత్యర్థుల్ని పరిగెత్తించారు.. బౌండరీలతో... వీలైతే సిక్సర్లతో స్కోరుబోర్డును ఉరకలెత్తించారు. 2.2 ఓవర్ నుంచి 12.3 ఓవర్ దాకా బ్యాటింగ్ జోరే స్టేడియం మొత్తాన్ని హోరెత్తించింది. తర్వాత వచ్చిన మ్యాక్స్‌వెలే ముందుగా (25 బంతుల్లో) ఫిఫ్టీ చేసుకోగా, కెప్టెన్ డుప్లెసిస్ (30 బంతుల్లో) ఆ తర్వాత అర్ధసెంచరీ చేశాడు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు 61 బంతుల్లోనే 120 పరుగుల్ని జతచేశారు. ఎట్టకేలకు మ్యాక్స్‌వెల్‌ను అవుట్ చేసిన బెహ్రెన్‌డార్ఫ్ ముంబై శిబిరాన్ని హమ్మయ్య అనిపించాడు. తర్వాత స్వల్ప వ్యవధిలోనే మహిపాల్ (1), డుప్లెసిస్ కూడా పెవిలియన్ చేరగా వేగం తగ్గింది. దినేశ్ కార్తీక్ (18 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్), కేదార్ (12 నాటౌట్), హసరంగ (12 నాటౌట్) ధాటిగా ఆడలేకపోయారు.

**ముంబై... డబుల్ వేగంతో!**

కొండను కరిగించేందుకు ముంబై ఓపెనర్ ఇషాన్ కిషన్ (21 బంతుల్లో 42; 4 ఫోర్లు, 4 సిక్సర్లు) అదే తీరున ఆడి బెంగళూరు శిబిరాన్ని వణికించాడు. దీంతో ఆర్‌సీబీ (5.2) కంటే వేగంగా ముంబై 4.3 ఓవర్లలోనే 50 స్కోరు చేసింది. ఐదో ఓవర్ వేసిన హసరంగ ... ఇషాన్ కిషన్, కెప్టెన్ రోహిత్ శర్మ (7)లను అవుట్ చేసి బెంగళూరును ఆనందంలో ముంచాడు. అయితే ఈ ఆనందం మాత్రం కాసేపే నిలిచింది. ఆ తర్వాత ఓవర్ నుంచే బాదడంలో స్పెషలిస్టు సూర్యకుమార్ దూకుడు మొదలైంది. వధేరా కూడా ధాటిగా ఆడటంతో లక్ష్యం కరిగిపోయింది. దీంతో 10.1వ ఓవర్లో ముంబై స్కోరు 100కి చేరితే అక్కడ్నుంచి మరో 20 బంతుల్లోనే (13.3వ ఓవర్లో) 150 పరుగుల్ని వాయువేగంతో అందుకుంది. ఈ క్రమంలో సూర్య 26 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. బ్యాటింగ్‌కు కలిసొచ్చే పిచ్‌పై పేలవమైన బౌలింగ్‌తో బెంగళూరు ఏమీ చేయలేకపోయింది. సూర్యకుమారే కాదు... వధేరా కూడా మంచినీళ్లు తాగినంత సులభంగా సిక్సర్లను బాదేశారు. వైశాక్, హర్షల్ వేసిన చెత్త బంతుల్ని సూర్య సులువుగా చితగ్గొట్టేశాడు. సూర్య, డేవిడ్ (0) వరుస బంతుల్లో అవుటైనప్పటికీ విజయం ముంగిట నిలిచిన ముంబైని సిక్సర్‌తో వధేరా గెలిపించడంతోపాటు అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు.



### స్కోరు వివరాలు

**రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్:** కోహ్లి (సి) ఇషాన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 1; డుప్లెసిస్ (సి) సబ్–విష్ణు (బి) గ్రీన్ 65; అనూజ్ (సి) గ్రీన్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 6; మ్యాక్స్‌వెల్ (సి) వధేరా (బి) బెహ్రెన్‌డార్ఫ్ 68; మహిపాల్ (బి) కార్తికేయ 1; దినేశ్ కార్తీక్ (సి) వధేరా (బి) జోర్డాన్ 30; కేదార్ జాదవ్ (నాటౌట్) 12; హసరంగ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 199. వికెట్ల పతనం:** 1–2, 2–16, 3–136, 4–143, 5–146, 6–185. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 4–0–36–3, పీయూష్ చావ్లా 4–0–41–0, గ్రీన్ 2–0–15–1, జోర్డాన్ 4–0–48–1, కార్తికేయ 4–0–35–1, ఆకాశ్ 2–0–23–0.

**ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** ఇషాన్ (సి) అనూజ్ (బి) హసరంగ 42; రోహిత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హసరంగ 7; సూర్యకుమార్ (సి) కేదార్ (బి) వైశాక్ 83; నేహల్ వధేరా (నాటౌట్) 52; టిమ్ డేవిడ్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) వైశాక్ 0; గ్రీన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (16.3 ఓవర్లలో 4 వికెట్లకు) 200. వికెట్ల పతనం:** 1–51, 2–52, 3–192, 4–192. **బౌలింగ్:** సిరాజ్ 3–0–31–0, హాజల్‌వుడ్ 3–0–32–0, హసరంగ 4–0–53–2, వైశాక్ 3–0–37–2, హర్షల్ పటేల్ 3.3–0–41–0.

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | పా | నె.ర. |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 11 | 8 | 3 | 0 | 16 | 0.951 |
| చెన్నై | 11 | 6 | 4 | 1 | 13 | 0.409 |
| ముంబై | 11 | 6 | 5 | 0 | 12 | -0.255 |
| లక్నో | 11 | 5 | 5 | 1 | 11 | 0.294 |
| రాజస్తాన్ | 11 | 5 | 6 | 0 | 10 | 0.388 |
| కోల్‌కతా | 11 | 5 | 6 | 0 | 10 | -0.079 |
| బెంగళూరు | 11 | 5 | 6 | 0 | 10 | -0.345 |
| పంజాబ్ | 11 | 5 | 6 | 0 | 10 | -0.441 |
| హైదరాబాద్ | 10 | 4 | 6 | 0 | 8 | -0.472 |
| ఢిల్లీ | 10 | 4 | 6 | 0 | 8 | -0.529 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

### ఐపీఎల్‌లో నేడు

చెన్నై x ఢిల్లీ (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

# 'బెస్ట్' మెస్సీ, షెల్లీ ఫ్రేజర్

**లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డుల్లో ఉత్తమ క్రీడాకారులుగా ఎంపిక**




పారిస్: గత ఏడాది అంతర్జాతీయ క్రీడా వేదికపై తమదైన ముద్ర వేసిన ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా), మహిళా అథ్లెట్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ (జమైకా)లకు ప్రతిష్టాత్మక లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులు లభించాయి. 2022 సంవత్సరానికిగాను పురుషుల విభాగంలో ఉత్తమ క్రీడాకారుడిగా మెస్సీ... మహిళల విభాగంలో ఉత్తమ క్రీడాకారిణిగా షెల్లీ ఎంపికయ్యారు. మెస్సీ సారథ్యంలో గత ఏడాది అర్జెంటీనా జట్టు 36 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఫుట్‌బాల్ ప్రపంచకప్ టైటిల్‌ను మూడోసారి సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో మెస్సీ ఏడు గోల్స్ చేయడంతోపాటు సహచరులు మూడు గోల్స్ చేయడానికి సహాయపడ్డాడు. ఈ మెగా ఈవెంట్‌లో ఉత్తమ ప్లేయర్‌గా నిలిచి 'గోల్డెన్ బాల్' పురస్కారాన్ని కూడా దక్కించుకున్నాడు. లారియస్ అవార్డు రావడం మెస్సీకిది రెండోసారి. 2020లోనూ మెస్సీకి ఈ పురస్కారం దక్కింది. మరోవైపు షెల్లీ ఆన్ ఫ్రేజర్ 100 మీటర్ల విభాగంలో ఐదోసారి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా షెల్లీ మూడు ఒలింపిక్స్ పసిడి పతకాలను, పది ప్రపంచ చాంపియన్‌షిప్ బంగారు పతకాలను గెల్చుకుంది. స్పెయిన్ టెన్నిస్ యువతార కార్లోస్ అల్‌కరాజ్‌కు 'బ్రేక్‌త్రూ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. గత ఏడాది అల్‌కరాజ్ యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో విజేతగా నిలువడంతోపాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. 1999 నుంచి లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులను అందజేస్తున్నారు.

**సౌదీ లీగ్‌లో మెస్సీ!**

పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో బాటలోనే మెస్సీ నడవనున్నాడు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ) క్లబ్‌కు ఆడుతున్న మెస్సీ ఈ సీజన్ తర్వాత పీఎస్‌జీని వీడి రొనాల్డో ఆడుతున్న సౌదీ అరేబియా లీగ్‌లో అడుగు పెట్టనున్నాడు. ఇప్పటికే సౌదీ అరేబియా లీగ్‌లోని ఒక క్లబ్ మెస్సీతో కళ్లు చెదిరే మొత్తానికి ఒప్పందం చేసుకుందని సమాచారం.

# పతకానికి విజయం దూరంలో...

**క్వార్టర్ ఫైనల్లో నిశాంత్ దేవ్, దీపక్ • సచిన్, ఆకాశ్‌లకు నిరాశ**


నిశాంత్


దీపక్

తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారత బాక్సర్లు నిశాంత్ దేవ్ (71 కేజీలు), దీపక్ భోరియా (51 కేజీలు) పతకం ఖరారు చేసుకోవడానికి మరో విజయం దూరంలో ఉన్నారు. మంగళవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్‌లలో దీపక్ 5–0తో జాంగ్ జియామావో (చైనా)పై గెలుపొందగా... నిశాంత్ దేవ్ పంచ్‌ల ధాటికి అతని ప్రత్యర్థి ఫాకాహా నిదాల్ (పాలస్తీనా) చేతులెత్తేశాడు. నిశాంత్ పంచ్ పవర్‌కు తొలి రౌండ్‌లోనే ఫాకాహా రింగ్‌లో రెండుసార్లు కూలబడ్డాడు. దాంతో రిఫరీ బౌట్‌ను నిలిపివేసి నిశాంత్‌ను విజేతగా ప్రకటించాడు. మరోవైపు భారత్‌కే చెందిన సచిన్ సివాచ్ (54 కేజీలు), ఆకాశ్ సాంగ్వాన్ (67 కేజీలు)ల పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. సచిన్ 0–5తో సాబిర్ ఖాన్ (కజకిస్తాన్) చేతిలో, ఆకాశ్ 0–5తో దులాత్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

## సినిమా

# రావణుడి గర్వాన్ని విరిచేయాలి


• ఓమ్ రౌత్, కృతీ సనన్, ప్రభాస్

''ఇది నా రాముడి కథ.. ఆయన మనిషిగా పుట్టి భగవంతుడైన మహనీయుడు..' అంటూ హనుమంతుడు పాత్రధారి దేవ దత్తా చెప్పే డైలాగ్‌తో 'ఆదిపురుష్' ట్రైలర్ విడుదలైంది. రాముడిగా ప్రభాస్, సీతగా కృతీ సనన్ నటించిన చిత్రం 'ఆదిపురుష్'. ఓమ్ రౌత్ దర్శకత్వంలో గుల్షన్ కుమార్ అండ్ టి. సిరీస్ సమర్పణలో భూషణ్ కుమార్, క్రిష్ణకుమార్, ఓమ్ రౌత్, ప్రసాద్ సుతారియా, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ పాన్ ఇండియా మూవీ జూన్ 16న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ''నా ప్రాణమే జానకిలో ఉంది.. కానీ నా ప్రాణాలకన్నా మర్యాదే అధిక ప్రియమైనది', 'మనం జన్మతో కాదు చేసే కర్మతో చిన్నాపెద్ద అవుతాం', 'నాకోసం పోరాడొద్దు.. వేల సంవత్సరాల తర్వాత తల్లులు మీ వీర గాథలు చెప్తూ పిల్లల్ని పెంచాలి.. ఆ రోజు కోసం పోరాడండి.. పోరాడతారా? అయితే దూకండి ముందుకు.. అహంకారం రొమ్ము చీల్చి ఎగురుతున్న విజయ ధ్వజాన్ని పాతండి' అంటూ ప్రభాస్, 'రాఘవ నన్ను పొందడానికి శివధనస్సును విరిచారు.. ఇప్పుడు రావణుడి గర్వాన్ని విరిచేయాలి' అని కృతీ సనన్ చెప్పే సంభాషణలు ట్రైలర్‌లో ఉన్నాయి.

# ఐకానిక్ షాట్స్ టచ్ చేయకూడదు

**- దర్శకుడు వీవీ వినాయక్**


• వినాయక్, బెల్లంకొండ సురేష్

''నేటి యువతలో చాలామంది తెలుగు 'ఛత్రపతి' (2005) సినిమాను చూసి ఉండరు. వారికి హిందీ రీమేక్ 'ఛత్రపతి' (2023) ఫ్రెష్‌గా ఉంటుంది. ఇక అప్పట్లో 'ఛత్రపతి'ని చూసినవారు తెలుగు 'ఛత్రపతి' సినిమాను పాడు చేయకుండా బాగా తీశారని అనుకుంటారు. లొకేషన్స్, సాంగ్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు కొత్తగా ఉంటాయి. ఓ ప్రాపర్ హిందీ సినిమా చూసిన ఫీలింగ్ కలుగుతుంది'' అన్నారు దర్శకుడు వీవీ వినాయక్. ప్రభాస్ హీరోగా రాజమౌళి దర్శకత్వంలో 2005లో వచ్చిన 'ఛత్రపతి' సినిమాను అదే టైటిల్‌తో హిందీలో రీమేక్ చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా వీవీ వినాయక్ దర్శకత్వంలో జయంతి లాల్ గడ నిర్మించిన ఈ సినిమా మే 12న హిందీలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో దర్శకుడు వీవీ వినాయక్ మాట్లాడుతూ – ''తెలుగులో సాయి హీరోగా నటించిన సినిమాలు హిందీలో అనువాదమై, మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. 'ఛత్రపతి' హిందీ రీమేక్ కోసం తను ఫిజిక్ బాగా మెయిన్‌టైన్ చేశాడు. హిందీ నేర్చుకున్నాడు. ఇంట్రవెల్, కొన్ని యాక్షన్ సీక్వెన్సెస్‌లో సాయి నటన చూసి నేనే ఆశ్చర్యపోయాను. ఈ చిత్రంతో సాయి బాలీవుడ్‌లో హీరోగా నిలబడిపోతాడనే నమ్మకం ఉంది. రీమేక్ అంటే కొన్ని ఐకానిక్ షాట్స్‌ను టచ్ చేయకపోవడమే మంచిది. మేమూ అదే చేశాం. ఇక యాక్టింగ్ పరంగా ప్రభాస్‌కు, సాయికి పోలికలు వద్దు. అయితే 'ఛత్రపతి' సినిమాలో హీరో క్యారెక్టర్‌కు సాయి న్యాయం చేశాడని మాత్రం చెప్పగలను. హిందీ 'ఛత్రపతి' విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఈ సినిమాను కేవలం హిందీ భాషలోనే రిలీజ్ చేస్తున్నాం'' అని అన్నారు. ''మాస్ పల్స్ తెలిసిన దర్శకుల్లో వీవీ వినాయక్ గారు ఒకరు. తెలుగులో 'అల్లుడు శీను'తో మా అబ్బాయి (బెల్లంకొండ సాయి)ని ఇంట్రడ్యూస్ చేసిన వినాయక్‌గారు హిందీలోనూ పరిచయం చేస్తుండటం సంతోషంగా ఉంది. ఈ సినిమాను తెలుగులో కూడా డబ్ చేయవచ్చు. కానీ హిందీలో తీసిన సినిమాను హిందీ భాషలోనే ఆడియన్స్‌కు చూపిద్దామన్నారు వినాయక్‌గారు. రూ. 60 కోట్ల బడ్జెట్‌తో పెన్ స్టూడియోస్ లాంటి నిర్మాణసంస్థ మా అబ్బాయితో సినిమా నిర్మించడం నాకు గర్వంగా ఉంది'' అన్నారు నిర్మాత బెల్లంకొండ సురేష్.

# చైతూ నా దగ్గర ఆ ప్రామిస్ తీసుకున్నాడు

**- వెంకట్ ప్రభు**



''మలయాళం మూవీ 'నాయట్టు' స్ఫూర్తితో 'కస్టడీ' స్టోరీలైన్ రాసుకున్నాను. అయితే 'నాయట్టు'లో కమర్షియల్ అంశాలు ఉండవు. 'కస్టడీ'లో తెలుగు, తమిళ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు కమర్షియల్ అంశాలు ఉంటాయి'' అన్నారు వెంకట్ ప్రభు. నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా వెంకట్ ప్రభు డైరెక్షన్‌లో రూపొందిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'కస్టడీ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వెంకట్ ప్రభు చెప్పిన విశేషాలు.

– ఓ సాధారణ కుటుంబంలో పుట్టి, భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న పోలీస్ కానిస్టేబుల్ శివ పాత్రలో నాగచైతన్య కనిపిస్తారు. శివకు ఉన్న ప్రాబ్లమ్స్‌తో ఈ సినిమా కథ మొదలవుతుంది. అతని కుటుంబం, ప్రేయసి వంటి అంశాలతో మొదటి ఇరవై నిమిషాలు గడుస్తాయి. కానీ తనది కాని సమస్యలో శివ ఇరుక్కుంటాడు. కాలానికి వ్యతిరేకంగా పరిగెత్తాల్సి వస్తుంది. ప్రీ ఇంట్రవెల్ నుంచి క్లయిమాక్స్ వరకూ ఆడియన్స్ ఈ సినిమాను ఆసక్తికరంగా చూస్తారు. సీట్ ఎడ్జ్ థ్రిల్లర్. రీసెంట్‌గా 'కస్టడీ' స్టోరీ లైన్ చెప్పేశాను. ఆ తర్వాత సినిమా గురించి ఎక్కువ రివీల్ చేయవద్దని, సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్‌ను థియేటర్స్‌లో ఆడియన్స్ చూసి ఎగ్జయిట్ అయితే బాగుంటుందని చైతూ నా దగ్గర ప్రామిస్ తీసుకున్నాడు. సో.. ఇంతకంటే ఏమీ చెప్పలేను.

– యాక్టింగ్ పరంగా ఈ చిత్రంలో కొత్త చైతూను చూస్తారు. రేవతిగా కృతీ శెట్టి, రాజుగా అరవింద్ స్వామి, శరత్‌కుమార్‌ల పాత్రలు ఆసక్తికరంగా ఉంటాయి. 'కస్టడీ' యూనివర్సల్ సబ్జెక్ట్. సబ్ టైటిల్స్‌తో ఇతర భాషలవారు ఈ సినిమాను చూస్తే వారికీ నచ్చుతుంది. ఇక 'మానాడు' సినిమాను తెలుగులో శ్రీనివాసా చిట్టూరిగారు నిర్మించాల్సింది కానీ కుదర్లేదు. అయితే ఆయనతో ఓ ప్రాజెక్ట్ చేయాలన్న ఆశ 'కస్టడీ'తో తీరింది. 'కస్టడీ' సినిమాకు ఇళయరాజాగారు, యువన్‌ల సంగీతం చాలా పెద్ద ఎస్సెట్.


• వీడీ 12 పోస్టర్

# డబుల్ ధమాకా


• విజయ్ దేవరకొండ, సమంత

హీరో విజయ్ దేవరకొండ పుట్టినరోజు (మే 9) కానుకగా అభిమానులకు డబుల్ ధమాకా ఇచ్చారు మేకర్స్. ఆయన నటిస్తున్న 'వీడీ 12 '(వర్కింగ్ టైటిల్) సినిమా నుంచి విజయ్ కొత్త పోస్టర్, 'ఖుషి' మూవీ నుంచి ఓ పాటని విడుదల చేశారు. విజయ్ దేవరకొండ, శ్రీలీల జంటగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. విజయ్ దేవరకొండ కెరీర్‌లో 12వ సినిమాగా రూపొందుతున్న ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 3న ప్రారంభమైన ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభం కానుంది. కాగా విజయ్‌కి బర్త్‌డే శుభాకాంక్షలు చెబుతూ ఈ చిత్రం మేకర్స్ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, కెమెరా: గిరీష్ గంగాధరన్.

**నా రోజా నువ్వే...** విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఖుషి'. నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో సెప్టెంబర్ 1న రిలీజ్ కానుంది. ఈ సినిమా షూటింగ్ కొచ్చిలో జరుగుతోంది. కాగా విజయ్ బర్త్ డే స్పెషల్‌గా 'ఖుషి' మూవీ నుంచి 'నా రోజా నువ్వే.. నా దిల్ సే నువ్వే, నా అంజలి నువ్వే గీతాంజలి నువ్వే...' అంటూ సాగే మెలోడి సాంగ్‌ను విడుదల చేశారు. ఈ పాటకి హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతం అందించటంతో పాటు పాడారు. దర్శకుడు శివ నిర్వాణ ఈ పాటకి సాహిత్యం అందించడంతో పాటు నృత్యరీతులు సమకూర్చారు.

# అఖిల్ ధీర?


• అఖిల్

అఖిల్ కొత్త సినిమాకు 'ధీర' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. 'సాహో' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన అనిల్ కుమార్ ఇటీవల అఖిల్‌కు ఓ కథ వినిపించారట. ఫ్యాంటసీ బ్యాక్‌డ్రాప్‌లోని ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మించనుందని టాక్. కాగా ఈ సినిమాకు 'ధీర' అనే టైటిల్‌ను పరిశీలిస్తోందట చిత్ర యూనిట్. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని సమాచారం.

# విద్య.. వైద్యాన్ని జాతీయం చేయాలి

**- ఆర్. నారాయణ మూర్తి**



''పేపర్ లీకేజ్ వ్యవహారాలు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. గుజరాత్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్‌లో కూడా జరిగాయి. ఇలాగైతే నిరుద్యోగులు ఏమైపోవాలి? అందుకే విద్య, వైద్యాన్ని జాతీయం చేయాలని చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ'' అన్నారు ఆర్. నారాయణ మూర్తి. స్నేహచిత్ర పిక్చర్స్‌పై ఆర్. నారాయణ మూర్తి నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. ఈ నెల 26న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''భారత దేశంలో చాలా చోట్ల పేపర్ లీకేజీలు జరుగుతున్నాయి.. దీన్ని జాతీయ సమస్యగా పరిగణించాలని రాష్ట్రపతి, ప్రధానిగార్లకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ చిత్రంలోని ఐదు పాటలు ఆలోచింపజేసేలా ఉంటాయి'' అన్నారు. 'యూనివర్సిటీ' ప్రదర్శనకు హాజరైన పలువురు జర్నలిస్టులు ఇది అందరూ చూడాల్సిన సినిమా అన్నారు. ఈ చిత్రాన్ని వీక్షించిన ప్రముఖుల్లో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్స్ లక్ష్మీ నారాయణ, కోయి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# జీవితంలో అందరం నటులమే

**- వాసుకి**



''సిల్వర్ స్క్రీన్‌పై ఆర్టిస్టులు నటిస్తారు. కానీ మనుషులుగా మనందరం నిత్యం విభిన్నమైన సందర్భాలు, పరిస్థితుల్లో నటిస్తుంటాం. సో.. మనందరం నటులమే. ఇరవయ్యేళ్ల తర్వాత కెమెరా ముందుకు వచ్చినా నేను భయపడలేదు. సెట్స్‌లో ఎక్కువగా టేక్స్ తీసుకోకుండానే యాక్ట్ చేశాను. అయినా నా భర్త ఆనంద సాయి (ఆర్ట్ డైరెక్టర్)తో నిత్యం సినిమాలు గురించి మాట్లాడుతూ ఇండస్ట్రీకి దగ్గరగానే ఉన్నాను'' అన్నారు వాసుకి. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం మే 18న విడుదల కానుంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన వాసుకి మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ– ''తొలిప్రేమ' సినిమా తర్వాత నాకు అవకాశాలు వచ్చినా కాదనుకున్నాను. ఎందుకంటే నాకు కుటుంబ బాధ్యతలే ప్రాధాన్యంగా అనిపించాయి. ప్రస్తుతం ఫారిన్‌లో మా అమ్మాయి మెడిసిన్ ఫోర్త్ ఇయర్, అబ్బాయి ఆర్కిటెక్చర్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. దాంతో నాకు ఖాళీ దొరికింది. నేను సైకాలజీలో పీహెచ్‌డీ చేస్తున్నాను. ఇటు నటిగా నాకు నచ్చే, నప్పే పాత్రలు చేస్తాను. 'అన్నీ మంచి..'లో సంతోష్ శోభన్‌కు అక్కగా నటించాను. తమ్ముడ్ని సపోర్ట్ చేసే అక్క పాత్ర ఇది. కథ బాగుంటే తల్లిగా చేయడానికి కూడా రెడీ'' అన్నారు.

# జూన్‌లో అహింస


• అభిరామ్

నిర్మాత సురేష్ బాబు తనయుడు, హీరో రానా సోదరుడు అభిరామ్ హీరోగా ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'అహింస'. తేజ దర్శకత్వంలో పి. కిరణ్ నిర్మించిన ఈ సినిమా జూన్ 2న రిలీజ్ కానుంది. ''లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'అహింస'. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై క్యూరియాసిటీని పెంచింది. సినిమా కూడా అందర్నీ అలరించేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.

సాక్షి బిజినెస్
బుధవారం
10-5-2023

**స్టాక్ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 3 | 61,761 |
| నిఫ్టీ △ | 2 | 18,266 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 12,196 | ▽ | 61 |
| డోజోన్స్ | 33,575 | ▽ | 44 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,764 | ▽ | 14 |
| డాక్స్ | 15,955 | △ | 3 |
| షాంఘై | 3,358 | ▽ | 37 |
| నికాయ్ | 29,243 | △ | 293 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

| బులియన్ రూ.ల్లో ముంబై | |
|---|---|
| బంగారం (24 క్యారెట్) | 61,553 △ 364 |
| బంగారం (22 క్యారెట్) | 61,287 △ 362 |
| వెండి (కిలో) | 76,399 △ 84 |



# పాలసీలపై రుణాన్ని క్రెడిట్ కార్డ్‌తో చెల్లించలేరు

- ఐఆర్‌డీఏఐ నిషేధం సానుకూల నిర్ణయం
- బీమా సంస్థల అభిప్రాయం



**న్యూఢిల్లీ:** జీవిత బీమా పాలసీలపై తీసుకున్న రుణాలను క్రెడిట్ కార్డులతో తిరిగి చెల్లించడాన్ని బీమా రంగ అభివృద్ధి, నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) విధించిన నిషేధాన్ని బీమా కంపెనీలు స్వాగతించాయి. ఈ నిర్ణయం పాలసీదారులకు మేలు చేస్తుందని, రుణ ఊబిలో పడిపోకుండా కాపాడుతుందని పేర్కొన్నాయి. భారీ వడ్డీ రేటుతో కూడిన క్రెడిట్ కార్డు రుణంతో పాలసీపై రుణాన్ని తిరిగి చెల్లించడం ప్రయోజనం కలిగించదని తెలిపాయి. క్రెడిట్ కార్డు బ్యాలన్స్ బకాయి పడితే భారీ వడ్డీ (రూ.3-4 రూపాయల వడ్డీ) వసూలు చేసే విషయాన్ని ప్రస్తావించాయి. ఇంతకుముందు వరకు బీమా పాలసీలపై తీసుకున్న రుణాన్ని క్రెడిట్ కార్డు నుంచి చెల్లించేందుకు బీమా సంస్థలు అనుమతించాయి. దీన్ని నిలిపివేయాలని ఐఆర్‌డీఏఐ ఇటీవలే ఆదేశించింది. ఆర్థిక క్రమశిక్షణకు ఎంతో ప్రాధాన్యం ఉందని, క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు చెల్లించే విధానం సరికాదని నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు. క్రెడిట్ కార్డుపై బకాయిని గడువులోపు చెల్లించకపోతే మిగిలిన బ్యాలన్స్‌పై అధిక వడ్డీ రేటు చెల్లించాల్సి రావడాన్ని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. ''వ్యక్తిగత రుణాలతో పోలిస్తే పాలసీపై తీసుకునే రుణం వడ్డీ రేటు చాలా తక్కువ. కనుక ఈ రుణాలను క్రెడిట్ కార్డులతో చెల్లించడం తెలివైనది కాదు''అని కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ రిస్క్ ఆఫీసర్ సునీల్ శర్మ పేర్కొన్నారు. పాలసీపై రుణం కొనసాగించడంతో పోలిస్తే, దానికంటే అధిక వడ్డీ రేటుతో కూడిన క్రెడిట్ కార్డు నుంచి చెల్లించడం వల్ల పాలసీదారులు రుణ ఊబిలో కూరుకుపోతారన్న ఆందోళనతో ఐఆర్‌డీఏఐ ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చని సెక్యూర్‌నౌ సహ వ్యవస్థాపకుడు కపిల్ మెహతా పేర్కొన్నారు. జీవిత బీమా పాలసీలపై ఇచ్చే రుణాలకు చాలా సంస్థలు 8-15 శాతం మధ్య రేటు వసూలు చేస్తుంటే, క్రెడిట్ కార్డు బ్యాలన్స్‌పై 36-44 శాతం మధ్య రేటు ఉండడం గమనార్హం.

## మ్యాన్‌కైండ్ బంపర్ లిస్టింగ్

### తొలి రోజు 32 శాతం హైజంప్



**న్యూఢిల్లీ:** హెల్త్‌కేర్ కంపెనీ మ్యాన్‌కైండ్ ఫార్మా బంపర్ లిస్టింగ్ సాధించింది. ఇష్యూ ధర రూ. 1,080తో పోలిస్తే 20% పైగా ఎగసి రూ. 1,300 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. తదుపరి 32% పైగా జంప్‌చేసి రూ.1,430 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి దాదాపు 32% లాభంతో రూ.1,424 వద్ద ముగిసింది. వెరసి కంపెనీ మార్కెట్ విలువ రూ.57,046 కోట్లుగా నమోదైంది. రూ.4,326 కోట్ల సమీకరణతో 2023లో భారీ ఐపీవోగా నమోదైన మ్యాన్‌కైండ్ ఫార్మా బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టయ్యింది. ఎన్ఎస్ఈలో 3.31 కోట్లు, బీఎస్ఈలో 12 లక్షల చొప్పున షేర్లు ట్రేడయ్యాయి. కంపెనీ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్స్ రూపొందిస్తోంది.

# మార్కెట్లు అక్కడక్కడే

- లాభాలతో షురూ- ఆపై డీలా
- 3 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
- 2 పాయింట్లు బలపడిన నిఫ్టీ
- పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు వీక్



**ముంబై:** వరుసగా రెండో రోజు మార్కెట్లు హుషారుగా ప్రారంభమయ్యాయి. అయితే మిడ్ సెషన్ నుంచీ అమ్మకాలు ఊపందుకోవడంతో చివరకు అక్కడక్కడే అన్నట్లుగా ముగిశాయి. సెన్సెక్స్ 3 పాయింట్ల స్వల్ప నష్టంతో 61,761 వద్ద నిలవగా.. నిఫ్టీ 2 పాయింట్ల నామమాత్ర లాభంతో 18,266 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 264 పాయింట్లు ఎగసి 62,000ను అధిగమించింది. 62,028 సమీపానికి చేరింది. చివర్లో లాభాలను వీడటంతోపాటు 109 పాయింట్లు క్షీణించి 61,655ను తాకింది. ఈ బాటలో నిఫ్టీ సైతం 18,344- 18,230 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ముందురోజు సెన్సెక్స్ 710, నిఫ్టీ 195 పాయింట్లు జంప్‌చేసిన నేపథ్యంలో రెండో సెషన్ నుంచీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగినట్లు స్టాక్ నిపుణులు పేర్కొన్నారు.

**రియల్టీ నేలచూపు:** ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఐటీ, ఆటో, ఫార్మా 0.5 శాతంస్థాయిలో పుంజుకోగా.. పీఎస్‌యూ బ్యాంక్స్ 2.75 శాతం పతనమయ్యాయి. రియల్టీ 1 శాతం నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో దివీస్, ఇండస్ఇండ్, కోల్ ఇండియా, టీసీఎస్, యాక్సిస్, ఎంఅండ్ఎం, టాటా మోటార్స్, విప్రో, ఇన్ఫీ 3-1 శాతం మధ్య లాభపడ్డాయి. మరోపక్క యూపీఎల్, ఐటీసీ, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, జేఎస్‌డబ్ల్యూ, గ్రాసిమ్ 3-1 శాతం మధ్య డీలాపడ్డాయి.

**రూపాయి నేలచూపు...**

డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ డీలా పడింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 28 పైసలు క్షీణించి 82.06 వద్ద ముగిసింది. ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో డాలరు బలపడటం రూపాయిని దెబ్బతీసింది. ఈక్విటీ మార్కెట్లు నీరసించడం దీనికి జత కలిసింది.

## జేపీ అసోసియేట్స్ రూ. 4 వేల కోట్లు డిఫాల్ట్



**న్యూఢిల్లీ:** సంక్షోభంలో చిక్కుకున్న జేపీ గ్రూప్ సంస్థ జైప్రకాశ్ అసోసియేట్స్ (జేఏఎల్) తాజాగా రూ. 3,956 కోట్ల రుణాల చెల్లింపులో డిఫాల్ట్ అయ్యింది. ఇందులో అసలు రూ. 1,642 కోట్లు ఉండగా, వడ్డీ రూ. 2,314 కోట్లు ఉంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి వివిధ రూపాల్లో తీసుకున్న ఈ మొత్తాన్ని ఏప్రిల్ 30న చెల్లించాల్సి ఉన్నప్పటికీ విఫలమైనట్లు ఎక్స్ఛేంజీలకు తెలిపింది. తాము 2037 నాటికి రూ.29,277 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇందులో రూ. 3,956 కోట్లు మాత్రమే ఈ ఏడాది ఏప్రిల్ 30 కల్లా కట్టాల్సి ఉందని జేఏఎల్ వివరించింది.

| కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో) | |
|---|---|
| **10-5-2023** | |
| విశాఖ | 485-00 |
| చిత్తూరు | 498-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 485-00 |
| విజయవాడ | 485-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **9-5-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 455-00 |
| వరంగల్ | 457-00 |
| రిటైల్ ధర | 5.15 |

# భారత్ వృద్ధి భేష్!

- స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ మైనస్' రేటింగ్ యథాతథం
- ప్రభుత్వాల ఆదాయ, వ్యయ తీరు మాత్రం బలహీనం
- ఫిచ్ తాజా విశ్లేషణ



**న్యూఢిల్లీ:** భారత్ సావరిన్ రేటింగ్ విషయంలో యథాతథ వైఖరిని అవలంభిస్తున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం- ఫిచ్ తన తాజా ప్రకటనలో పేర్కొంది. చక్కటి వృద్ధి తీరు, అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితులను తట్టుకొని నిలబడ్డం వంటి అంశాల నేపథ్యంలో రేటింగ్‌ను స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ మైనస్'గా కొనసాగిస్తున్నట్లు తెలిపింది. అయితే ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాల విషయంలో పరిస్థితి బలహీనంగా ఉందని కూడా హెచ్చరించింది. 'బీబీబీ మైనస్' అతి తక్కువ ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్. చెత్త రేటింగ్‌కు ఒక అంచె అధికం. 2006 ఆగస్టు నుంచి ఇదే రేటింగ్‌ను ఫిచ్ కొనసాగిస్తోంది. మరో రెండు అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజాలు- మూడీస్, స్టాండర్డ్ అండ్ పూర్స్ (ఎస్అండ్‌పీ) కూడా భారత్‌కు ఇదే తరహా రేటింగ్‌ను ఇస్తున్నాయి. అంతర్జాతీయంగా దేశంలోకి పెట్టుబడులు రావడానికి ఆయా సంస్థలు ఇచ్చే రేటింగ్స్ కీలకం. ఫిచ్ విశ్లేషణలో కొన్ని ముఖ్యాంశాలు...

- లాంగ్-టర్మ్ ఫారిన్ కరెన్సీ ఇష్యూయర్ డిఫాల్ట్ రేటింగ్ (ఐడీఆర్) స్టేబుల్ అవుట్‌లుక్‌తో 'బీబీబీ మైనస్'గా కొనసాగుతుంది. పటిష్ట వృద్ధి ధోరణి సావరిన్ రేటింగ్‌కు మద్దతిస్తున్న ప్రధాన అంశం.
- చెక్కుచెదరని పెట్టుబడుల అవకాశాల నేపథ్యంలో భారత్ వృద్ధి 2023 ఏప్రిల్-2024 మార్చి (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం) మధ్య 6 శాతంగా ఉంటుందని భావిస్తున్నాం. 2022-23లో 7 శాతం వృద్ధి రేటు అంచనాకాగా, 2024-25లో ఎకానమీ స్పీడ్‌ను 6.7 శాతంగా అంచనావేస్తున్నాం.
- తోటి ఎకానమీలతో పోల్చితే భారత్ వృద్ధి అవుట్‌లుక్ బాగుంది. దీనితోపాటు అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులను తట్టుకునే సామర్థ్యం వల్ల గత ఏడాది కాలంగా పురోగమన బాటలో పయనిస్తోంది.
- ప్రభుత్వం మౌలిక రంగంపై పెడుతున్న ప్రత్యేక దృష్టి నేపథ్యంలో గత కొన్నేళ్లుగా కార్పొరేట్, బ్యాంక్ బ్యాలెన్స్ షీట్‌లో సానుకూల ధోరణి కనిపిస్తోంది. దీనితో ప్రైవేట్ రంగం బలమైన పెట్టుబడితో వృద్ధి బాటపై ఉన్నట్లు కనిపిస్తోంది.
- సేవా రంగ ఎగుమతులకు భారత్ మంచి అవకాశాలు పొందవచ్చు.
- గత ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం సగటును 6.7 శాతం ఉంటే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 5.8 శాతంగా నమోదుకావచ్చు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ)కి కేంద్రం నిర్దేశిస్తున్న 6% అప్పర్ బాండ్ కన్నా ఇది 20 బేసిస్ పాయింట్లు తక్కువ.

### బలహీనతలు ఇవీ...

దేశం కొన్ని బలహీనతలనూ ఎదుర్కొంటోంది. ఆదాయాలు-వ్యయాలు, అధిక లోటు, దీనిని తగ్గించడానికి ప్రభుత్వ వ్యయాల కోత, రుణ భారం, ప్రపంచబ్యాంక్ గవర్నెన్స్ సూచీలుసహా, జీడీపీ తలసరి ఆదాయంసహా కొన్ని వ్యవస్థాగత సూచీలు ఇక్కడ ప్రస్తావనాంశాలు. ద్రవ్యోల్బణం సవాళ్లు, పెరుగుతున్న వడ్డీరేట్లు, అంతర్జాతీయంగా డిమాండ్ పరిస్థితుల మందగమనం, మహమ్మారికి సంబంధించి సమసిపోని సవాళ్లు- అనుమానాలు వంటివీ ఎకానమీ పురోగతికి సవాళ్లుగా ఉన్నాయి. కార్మిక శక్తి భాగస్వామ్యం ఎకానమీలో ఇంకా బలహీనంగానే ఉంది. సంస్కరణల అమలు బాట ఒడిదుడుకులుగానే ఉంది. భారత్ మార్కెట్ అంతర్జాతీయ సంస్థలను ఆకర్షిస్తున్నప్పటికీ, ఈ ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి సంబంధించి తగిన సంస్కరణలతో భారత్ సంసిద్ధంగా ఉందా? లేదా అన్న అంశంపై అనిశ్చితి నెలకొంది. భారత్ ప్రభుత్వ రుణ భారం 2022-23లో 82.8%గా (జీడీపీలో) ఉంటుందని భావిస్తున్నాం.

# రుణ చెల్లింపుపై అదానీ గ్రూప్ దృష్టి

**రూ. 1,066 కోట్ల ముందస్తుకు రెడీ**



**న్యూఢిల్లీ:** ఇటీవల రుణ భారాన్ని తగ్గించుకోవడంపై దృష్టి పెట్టిన అదానీ గ్రూప్ తాజాగా 13 కోట్ల డాలర్ల(సుమారు రూ. 1,066 కోట్లు) రుణాలను ముందస్తుగా చెల్లించే ప్రణాళికల్లో ఉంది. తద్వారా ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని బిలియనీర్.. గౌతమ్ అదానీ గ్రూప్ భావిస్తోంది. యూఎస్ షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో కంపెనీ కొద్ది రోజులుగా రుణాలను ముందుగానే చెల్లిస్తోంది. దీనిలో భాగంగా గత నెలలో 2024 జూలైలో గడువు తీరనున్న 13 కోట్ల డాలర్ల విలువైన బాండ్లను బైబ్యాక్ చేసేందుకు అదానీ పోర్ట్స్ టెండర్‌కు తెరతీసింది. ఈ బాటలో మరో 4 రుణాలను తిరిగి చెల్లించే యోచనలో ఉన్నట్లు తెలిపింది. టెండర్‌కు 41.27 కోట్ల డాలర్ల విలువైన బాండ్లు దాఖలైనట్లు అదానీ పోర్ట్స్ తాజాగా వెల్లడించింది.

# రేమండ్ లాభం క్షీణత

**క్యూ4లో రూ. 197 కోట్లు**



**న్యూఢిల్లీ:** డైవర్సిఫైడ్ దిగ్గజం రేమండ్ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం (2022-23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి-మార్చి(క్యూ4)లో నికర లాభం 26 శాతం క్షీణించి రూ. 197 కోట్లకు పరిమితమైంది. రూ. 93 కోట్ల మేర అనుకోని నష్టాలు లాభాలను దెబ్బతీశాయి. అంతక్రితం ఏడాది (2021-22) ఇదే కాలంలో రూ. 265 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ. 3 చొప్పున డివిడెండు ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం 10 శాతం పుంజుకుని రూ. 2,150 కోట్లను అధిగమించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర లాభం రెట్టింపై రూ. 537 కోట్లకు చేరింది. 2021-22లో రూ. 265 కోట్లు ఆర్జించింది. ఆదాయం సైతం రూ. 6,179 కోట్ల నుంచి రూ. 8,215 కోట్లకు ఎగసింది.

---

## భవిత

**నేడే తెలంగాణ పదో తరగతి ఫలితాలు-2023**
ఫలితాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వెంటనే ఫలితాలు పొందండి.
పూర్తి వివరాల కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

# జాబ్ పాయింట్

### ఇస్రోలో 65 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) సెంట్రలైజ్డ్ రిక్రూట్‌మెంట్ బోర్డ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో కేంద్రాలు/యూనిట్‌లలో సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులుకోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 65
- **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(సివిల్)-39, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఎలక్ట్రికల్)-14, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్)-09, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఆర్కిటెక్చర్)-01, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(సివిల్)-అటానమస్ బాడీ-పీఆర్ఎల్-01, సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఆర్కిటెక్చర్)-అటానమస్ బాడీ-పీఆర్ఎల్-01.
- **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్, ఆర్కిటెక్చర్.
- **అర్హత:** కనీసం 65% మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఆర్క్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 24.05.2023 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
- **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 24.05.2023.
- **వెబ్‌సైట్:** www.isro.gov.in

### బ్యాంక్ ఆఫ్ బరోడాలో 157 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా సీ అండ్ ఐసీ విభాగంలో.. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 157
- **పోస్టుల వివరాలు:** రిలేషన్‌షిప్ మేనేజర్-66, క్రెడిట్ అనలిస్ట్-74, ఫారెక్స్ ఆక్విజిషన్ మరియు రిలేషన్‌షిప్ మేనేజర్-17.
- **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.05.2023
- **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

### యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 76 ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 76
- **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు.
- **విభాగాలు:** సైన్సెస్, హ్యుమానిటీస్, ఎకనామిక్స్, సోషల్ సైన్సెస్, ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్ స్టడీస్.
- **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణతతో పాటు బోధన/పరిశోధనానుభవం కలిగి ఉండాలి. **వయసు:** 65 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,44,200 నుంచి రూ.2,18,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,31,400 నుంచి రూ.2,17,100, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.57,700 నుంచి రూ.1,82,400 ఉంటుంది.
- **ఎంపిక విధానం:** అభ్యర్థి అకడమిక్ రికార్డు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.05.2023
- **దరఖాస్తు హార్డ్‌కాపీ స్వీకరణకు చివరితేది:** 09.06.2023.
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

### బెల్, బెంగళూరులో 428 ఇంజనీర్ పోస్టులు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. ఒప్పంద ప్రాతిపదికన ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 428
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్-327:ఎలక్ట్రానిక్స్-164, మెకానికల్-106, కంప్యూటర్ సైన్స్-47, ఎలక్ట్రికల్-07, కెమికల్-01, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ ట్రెయినీ ఇంజనీర్-101: ఎలక్ట్రానిక్స్-100,ఏరోస్పేస్ ఇంజనీరింగ్-01.

**అర్హత**

- **ప్రాజెక్ట్ ఇంజనీర్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం 2 ఏళ్ల పని అనుభవం ఉండాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి రూ.55,000 చెల్లిస్తారు.
- **ట్రెయినీ ఇంజనీర్:** సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.40,000 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.05.2023
- **వెబ్‌సైట్:** www.bel-india.in

### చిత్తూరు జిల్లాలో టైపిస్ట్ పోస్టులు

చిత్తూరు జిల్లా సెలక్షన్ కమిటీ(డీఎస్సీ) 2022-23 సంవత్సరానికి సంబంధించి చిత్తూరు జిల్లాలో రిజర్వ్ చేసిన టైపిస్ట్ పోస్టుల భర్తీకి అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
- **అర్హత:** ఏదైనా డిగ్రీతో పాటు తెలుగులో టైప్‌రైటింగ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అంబేద్కర్ భవన్, న్యూ కలెక్టరేట్, చిత్తూరులో అందజేయాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 15.05.2023.
- **వెబ్‌సైట్:** www.chittoor.ap.gov.in

### అణుశక్తి విభాగంలో అవకాశాలు

ముంబయిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ, డైరెక్టరేట్ ఆఫ్ పర్చేజ్ అండ్ స్టోర్స్.. జూనియర్ పర్చేజ్ అసిస్టెంట్/జూనియర్ స్టోర్ కీపర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ముంబయితోపాటు దేశవ్యాప్తంగా ఉన్న డీపీఎస్ యూనిట్లలో ఉద్యోగులను నియమించనున్నారు.

- **మొత్తం పోస్టులు:** 65(రిజర్వేషన్ల వారీగా: ఎస్సీ-23, ఓబీసీలకు-08, ఈడబ్ల్యూఎస్-22, అన్‌రిజర్వ్‌డ్ అభ్యర్థులకు 12 కేటాయించారు)
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ/బీకాం/డిప్లొమా(మెకానికల్ ఇంజనీరింగ్ /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. గడువుతేదీ నాటికి సంబంధిత విద్యార్హతలు లేనివాళ్లు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులు.
- **వయసు:** అభ్యర్థులకు 18-27ఏళ్ల మధ్య వయసు ఉండాలి. గరిష్ట వయసులో ఎస్సీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీలకు 10-15ఏళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు 3ఏళ్ల మినహాయింపు ఉంటుంది.

**ముఖ్యసమాచారం**

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 15.05.2023
- **ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ పరీక్షలు:** జూన్ రెండో వారంలో
- **వెబ్‌సైట్:** https://dae.gov.in

# అడ్వాన్స్‌డ్.. విజయం నిశ్చయంగా!!

» జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 2,50,255 మంది ఎంపిక
» జూన్ 4న దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహణ
» రివిజన్, ప్రాక్టీస్‌తోనే సక్సెస్ అంటున్న నిపుణులు

**జేఈఈ-అడ్వాన్స్‌డ్.. ప్రతిష్టాత్మక ఐఐటీల్లో.. బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్+ఎంటెక్‌ల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష! జేఈఈ-మెయిన్ స్కోర్ ఆధారంగా..అడ్వాన్స్‌డ్‌కు అభ్యర్థులను ఎంపికచేస్తారు! ఇటీవల జేఈఈ-మెయిన్-2023 ఫలితాల ద్వారా 2,50,255 మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందారు. వీరంతా ఐఐటీల్లో అందుబాటులో ఉన్న దాదాపు 16వేల సీట్లకు పోటీపడతారు. ఇందుకోసం జూన్ 4న దేశవ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో.. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో విజయానికి మెలకువలు..**



జేఈఈ-అడ్వాన్స్‌డ్ - 2023

దేశవ్యాప్తంగా 23 ఐఐటీల్లో అందుబాటులో ఉన్న సీట్లు 16,598 మాత్రమే. అంటే..అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే అభ్యర్థుల్లో ఐఐటీ అవకాశం లభించేది కేవలం ఆరున్నర శాతం మందికే!! అయితే జేఈఈ మెయిన్‌కు ఎంపికైన విద్యార్థులు పూర్తి అంకితభావంతో ప్రిపరేషన్ సాగిస్తే.. విజయావకాశాలు మెరుగవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.

**పునశ్చరణకు ప్రాధాన్యం**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో విద్యార్థులు ముఖ్యమైన అంశాల పునశ్చరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇప్పటికే తాము రాసుకున్న నోట్స్ లేదా రెడీ రెకనర్స్‌ను అనుసరిస్తూ..అందులోని అంశాలను పదే పదే చదవాలి.

అలా రివిజన్ చేస్తున్నప్పుడే సంబంధిత ప్రాథమిక భావనలు, సూత్రాలతోపాటు అన్వయ దృక్పథంపై దృష్టిపెట్టాలి. వెయిటేజీ ఆధారంగా ఆయా అంశాల రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇందు కోసం గత ప్రశ్న పత్రాలను పరిశీలించాలి.

**అవగాహన ముఖ్యం**

అడ్వాన్స్‌డ్‌కు ప్రిపరేషన్‌లో భాగంగా విద్యార్థులు ప్రధానంగా ప్రశ్నల సరళి,మార్కింగ్ విధానాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సింగిల్ కరెక్ట్ కొశ్చన్స్;మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్;పేరాగ్రాఫ్ ఆధారిత ప్రశ్నలను సాధన చేయాలి. వీటిలో రాణించాలంటే.. కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు, అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ కొనసాగించాలి. ప్రస్తుత సమయంలో ప్రశ్నల సాధనకు సమయం కేటాయించాలి.

**నమూనా పరీక్షలు**

విద్యార్థులు కనీసం వారానికి ఒక గ్రాండ్ టెస్ట్ రాసే విధంగా సమయం కేటాయించుకోవాలి. ఆ పరీక్ష ఫలితం విశ్లేషించుకుని..తాము చేస్తున్న పొరపాట్లపై అవగాహన పెంచుకోవాలి. వాటిని పునరావృతం కాకుండా చూసుకోవాలి. ముఖ్యంగా గత నాలుగేళ్లకు సంబంధించిన ప్రశ్న పత్రాల్లో కనీసం రెండు ప్రశ్న పత్రాలను సాధన చేయాలి.

**పరీక్ష ప్యాట్రన్**

అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే విద్యార్థులకు పరీక్ష ప్యాట్రన్‌పై పూర్తి అవగాహన ఉండాలి. గత ఏడాది మొత్తం రెండు పేపర్లుగా 360 మార్కులకు పరీక్ష జరిగింది. పేపర్-1లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 18 ప్రశ్నలు చొప్పున మొత్తం 54 ప్రశ్నలు అడిగారు. పేపర్-2లో కూడా ఇదే విధంగా 54 ప్రశ్నలు అడిగారు. ఇంటీజర్స్, న్యూమరికల్ టైప్ ప్రశ్నలకు 2, 4 మార్కులు చొప్పున కేటాయించారు.

**సిలబస్ మార్పులకు అనుగుణంగా**

ఇప్పటి వరకు జేఈఈ-మెయిన్స్ దృష్టితో ప్రిపరేషన్ సాగించిన విద్యార్థులు..ఇప్పుడు పూర్తిగా అడ్వాన్స్‌డ్‌కే సమయం కేటాయించాలి. ఈ ఏడాది అడ్వాన్స్‌డ్ సిలబస్‌లో మార్పులు చేసిన విషయాన్ని గుర్తించాలి. మారిన సిలబస్ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ.. ప్రిపరేషన్, రివిజన్ కొనసాగించాలి.

**ఒత్తిడికి దూరంగా**

జేఈఈ అడ్వాన్స్‌డ్ విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో ముఖ్యం. అనవసరపు ఒత్తిడికి గురి కాకుండా.. ప్రశాంతంగా పక్కా ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ సాగించాలి. ఆయా సిలబస్ టాపిక్స్‌ను విశ్లేషించుకుంటూ.. నిర్దిష్ట సమయ పాలన పాటిస్తూ ప్రాక్టీస్ చేయాలి.

### సిలబస్ ముఖ్యాంశాలు

**మ్యాథమెటిక్స్:** కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్; 3-డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్; బైనామియల్ థీరమ్; లోకస్ అంశాలపై పూర్తి పట్టు సాధించాలి

**ఫిజిక్స్:** ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై లోతైన అవగాహన పెంచుకుంటే.. మెరుగైన స్కోర్‌కు అవకాశం ఉంటుంది.

**కెమిస్ట్రీ:** కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మోడైనమిక్స్ అండ్ థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ,ఆల్కహాల్,ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

**పరీక్ష హాల్లో ఇలా**

• పరీక్ష హాల్లో ప్రశ్న పత్రం పూర్తిగా చదివేందుకు కనీసం 10 నుంచి 15 నిమిషాలు కేటాయించాలి. • దాని ఆధారంగా తమకు సులభంగా ఉన్న ప్రశ్నలను గుర్తించాలి. ముందుగా వాటికి సమాధానాలు ఇవ్వాలి. •వీలైతే పరీక్ష ముగియడానికి ముందు పది లేదా పదిహేను నిమిషాలు సమాధానాల రివ్యూకు కేటాయించాలి. • సమాధానాలు ఇచ్చే సమయంలో ఏమైనా సందిగ్ధత ఉంటే మార్క్ ఫర్ రివ్యూ బటన్‌పై క్లిక్ చేసి.. చివరలో నిశ్చితాభిప్రాయానికి వచ్చి సదరు సమాధానాన్ని సేవ్ చేయాలి. •పరీక్ష హాల్లో.. కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపించే కౌంట్‌డౌన్ టైమర్‌ను చూసుకుంటూ ఉండాలి. • ఇలా ప్రతి విషయంలోనూ వ్యూహాత్మకంగా ముందుకు సాగితే.. మెరుగైన ఫలితం ఆశించొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

**అడ్వాన్స్‌డ్.. ముఖ్యాంశాలు**

• ప్రస్తుతం వీలైనంత ఎక్కువ సమయాన్ని రివిజన్‌కే కేటాయించాలి. • ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తూ అప్లికేషన్ ఓరియెంటెడ్ కొశ్చన్స్ సాధన చేయాలి. • ఇంటీజర్స్, ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకు ప్రాధాన్యం ఇవ్వాలి. •కనీసం నాలుగు మోడల్ టెస్ట్‌లకు హాజరు కావాలి. • అన్ని సబ్జెక్ట్‌లలో కాన్సెప్ట్స్, ఫార్ములాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. • పరీక్షకు రెండు రోజుల ముందు నుంచి ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండాలి.

**జేఈఈ-అడ్వాన్స్‌డ్-2023 ముఖ్య తేదీలు**

- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** మే 29-జూన్ 4, 2023
- **జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష తేదీ:** జూన్ 4(ఉదయం 9 నుంచి 12 వరకు; మధ్యాహ్నం 2:30 నుంచి 5 :30 వరకు).
- **వివరాలకు వెబ్‌సైట్:** https://jeeadv.ac.in

## క్లుప్తంగా...

### అటల్ భూజల్ యోజనలో ఏపీని చేర్చండి

- కేంద్ర జలశక్తి మంత్రిని కోరిన వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సాక్షి, న్యూఢిల్లీ: భూగర్భ జలాలను మెరుగుపరిచేందుకు కేంద్రం నిర్వహిస్తున్న అటల్ భూజల్ యోజన పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చేర్చాలని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి, పల్నాడు ప్రాంతానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. వ్యవసాయమే ప్రధాన ఆధారితమైన ఏపీలో నీటి అవసరం ఎంతో ఉందని.. సాగునీటి కోసం ఎక్కువగా భూగర్భ జలాలపై రైతులు, కొన్ని ప్రాంతాల్లో సాధారణ అవసరాలకు భూగర్భ జలాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఉన్నాయని, అందువల్ల ఈ పథకం కింద ఏపీని చేర్చాలని కోరారు. అంతేగాక ఆనకట్ట పునరుద్ధరణ, అభివృద్ధి ప్రాజెక్టు (డీఆర్‌ఐపీ) దశ 2, 3 కింద నాగార్జున సాగర్ డ్యామ్ భద్రత, కార్యాచరణ పనితీరు మెరుగుదల అంశంపై మంత్రికి విజ్ఞప్తి చేశారు. డీఆర్‌ఐపీ ఫేజ్ 2 పరిధిలోని డ్యామ్‌ల లిస్ట్‌లో నాగార్జున సాగర్ డ్యామ్ ఉన్నప్పటికీ.. డ్యామ్ భద్రత సమీక్ష ప్యానల్ తనిఖీ ఇంకా పెండింగ్‌లోనే ఉందని తెలిపారు. ప్రాజెక్టుకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా డ్యామ్ భద్రతా సమీక్షను డీఆర్‌ఐపీ ఫేజ్2 కింద నిపుణుల బృందం ద్వారా నిర్వహించాలని మంత్రిని కోరారు.

### క్విక్‌మనీ, హాట్‌బోట్ యాప్‌లు వాడొద్దు

- ఆన్‌లైన్ రుణాల ముసుగులో పడొద్దని కేంద్ర హోంశాఖ సూచన

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక అవసరాలను బలహీనతగా చేసుకుని ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా రుణాలిస్తామంటూ కొన్ని శత్రుదేశాలకు చెందిన సంస్థలు కుట్రలు పన్నుతున్నట్టు కేంద్ర హోంశాఖ వర్గాలు హెచ్చరించాయి. లోన్‌యాప్‌ల పేరిట సమాచారాన్ని సేకరించేందుకు, ఆర్థిక మోసాలకు తెరతీసేందుకు కొన్ని సంస్థలు వలవేస్తున్నట్టు గుర్తించామని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. ప్రధానంగా క్విక్‌మనీ, హాట్‌బోట్ యాప్‌ల నుంచి రుణాలు తీసుకోవద్దని సూచించింది.

## ముగిసిన ఆసియాన్–ఇండియా సముద్ర విన్యాసాలు



విన్యాసాల్లో పాల్గొన్న యుద్ధ నౌకలు

దక్షిణ చైనా సముద్రంలో జరుగుతున్న ఆసియాన్–ఇండియా సముద్ర విన్యాసాలు–2023 ముగిశాయి. ఇందులో సుమారు 1,400 మంది నేవీ అధికారులు, సిబ్బంది, 9 యుద్ధ నౌకలు పాల్గొన్నాయి. బ్రూనై, ఇండోనేషియా, మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం నావికాదళాల నౌకలతో పాటు భారత్ దేశీయంగా అభివృద్ధి చేసి నిర్మించిన నౌకలు ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ సాత్పురా, సముద్ర గస్తీ విమానం పీ8ఐ ప్రదర్శనలో తమ సామర్థ్యాలను ప్రదర్శించాయి. 2 రోజుల పాటు జరిగిన సముద్ర దశ విన్యాసాల్లో వ్యూహాత్మక యుక్తులు, హెలికాప్టర్ల ద్వారా క్రాస్ డెక్ ల్యాండింగ్‌లు, ఇతర సముద్ర కార్యకలాపాలను నిర్వహించారు. సముద్ర తీరంలో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడమే కాకుండా, ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, భద్రతను మరింత పెంపొందించేందుకు భారత్–ఆసియాన్ నౌకాదళాలు ఈ ప్రదర్శనలు నిర్వహించాయి.

– దొండపర్తి (విశాఖ దక్షిణ)

## నేటి నుంచి వడగాడ్పులు

- రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- అనేకచోట్ల 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు
- నేడు తుపానుగా బలపడనున్న వాయుగుండం
- ఏపీపై తుపాను ప్రభావం ఉండదన్న ఐఎండీ

సాక్షి, అమరావతి/విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగా వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మంగళవారం అన్నమయ్య జిల్లా సంబేపల్లి, సత్యసాయి జిల్లా నల్లమడ, మడకశిరలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అనేక ప్రాంతాల్లో 40 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవడంతో వేడి తాళలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బుధవారం నుంచి ఉష్ణోగ్రతలు నెమ్మదిగా పెరుగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని పేర్కొంది. రాష్ట్రంలోని 28 మండలాల్లో బుధవారం వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అడ్డతీగల, గంగవరం, రాజవొమ్మంగి, అనకాపల్లి జిల్లా గోలుకొండ, మాకవరపాలెం, నర్సీపట్నం, నాతవరం, రోలుగుంట, తూర్పు గోదావరి జిల్లా గోకవరం, కోరుకొండ, గుంటూరు జిల్లాలో మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ, తుళ్లూరు, కాకినాడ జిల్లా గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, కోటనందూరు, పెద్దాపురం, ప్రత్తిపాడు, రౌతులపూడి, శంఖవరం, ఏలేశ్వరం, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, పల్నాడు జిల్లా అమరావతి, పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని, కొమరాడ, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన చోట్ల కూడా ఎండ ప్రభావం ఉంటుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### నేడు బంగాళాఖాతంలో తుపాను

ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం బుధవారం తుపానుగా బలపడనుంది. అనంతరం 11 ఉదయానికి తీవ్ర తుపానుగా, అదే రోజు సాయంత్రానికి అతి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉంది. ఇది ఈనెల 14న మధ్యాహ్నం బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్, మయన్మార్‌లోని క్యాక్ ప్యూల మధ్య తీరాన్ని దాటుతుందని ఐఎండీ మంగళవారం రాత్రి విడుదల చేసిన బులెటిన్ లో వెల్లడించింది. తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉండబోదని ఐఎండీ ఇప్పటికే స్పష్టం చేసింది.



## తిరుపతి వందేభారత్‌కు ఇక 16 కోచ్‌లు

- ప్రస్తుతం ఉన్నది ఎనిమిది కోచ్‌లే
- ఈ వారంలోనే ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ –తిరుపతి మధ్య నడుస్తున్న వందేభారత్ రైలు కోచ్‌ల సంఖ్య పెంచాలని రైల్వే బోర్డు నిర్ణయించింది. ప్రస్తుతం 8 కోచ్‌లతో నడుస్తున్న రైలును 16 కోచ్‌లతో నడిపించబోతోంది. 2 ఎగ్జిక్యూటివ్, 14 ఎకానమీ కోచ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ వారంలో ఆ మేరకు మార్పులు చేయనున్నారు. ఏప్రిల్ ఎనిమిదో తేదీన ప్రారంభించిన రోజు నుంచి ఇప్పటి వరకు ఈ రైలు కిటకిటలాడుతూ ప్రయాణిస్తోంది. ఆక్యుపెన్సీ రేషియో 130 శాతానికి మించి నమోదవుతుండటంతో రైలు కోచ్‌ల సంఖ్య పెంచాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రైల్వే బోర్డు ఆ మేరకు అనుమతించింది. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి కేవలం 8 గంటల్లోనే ఇది చేరుకుంటోంది. ఉదయం ఆరు గంటలకు బయలు దేరి మధ్యాహ్నం 2గంటల వరకు వెళ్తుండటంతో ప్రయాణికులు దీనివైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం పెద్ద సంఖ్యలో వెయిటింగ్ లిస్టు కొనసాగుతోంది.

## హజ్ యాత్రికులకు ఏపీ ప్రభుత్వ సహకారం

- అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తుంది
- ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా వెల్లడి
- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో భేటీ



కేంద్ర మంత్రి సింధియాను కలిసిన అంజాద్‌బాషా, మిథున్‌రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు

సాక్షి, న్యూఢిల్లీ/చిత్తూరు కార్పొరేషన్ : కేంద్ర ప్రభుత్వ నిబంధనల వల్ల ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారిపై పడే అధిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీశాఖ మంత్రి అంజాద్ బాషా చెప్పారు. ఆయన మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కలిశారు. అనంతరం అంజాద్ బాషా ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ హజ్ యాత్రికుల సమస్యపై పౌరవిమానయాన శాఖ మంత్రితో చర్చించామని, బుధవారం కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి స్మృతి ఇరానీతో సమావేశం అవుతామని తెలిపారు. హైదరాబాద్, బెంగళూరులలోని ఎంబార్కేషన్ పాయింట్ల కన్నా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి ధరలు అధికంగా ఉన్నాయని, ఇదే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ఒక్కొక్కరికీ హైదరాబాద్ నుంచి రూ.3.05 లక్షలు, బెంగళూరు నుంచి రూ.3.04 లక్షలు ఉండగా.. విజయవాడ నంచి రూ.3,88,350 ఉందని తెలిపారు. ఒకవేళ ధర తగ్గించడం సాధ్యం కాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే అదనపు భారం భరిస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఎంబార్కేషన్ పాయింటును హైదరాబాద్ లేదా బెంగళూరుకు మార్చాలని మంత్రిని కోరామన్నారు. మైనారిటీల ఓట్ల కోసం హజ్ యాత్రికుల సమస్యను టీడీపీ రాజకీయం చేయడం తగదని ఆయన హితవు పలికారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌసలాజమ్, సభ్యులు ఉన్నారు.

## జంట హత్యలకు దారి తీసిన అనుమానం

- వివాహితతో ఓ యువకుడి వివాహేతర సంబంధం
- మరొకరితో సంబంధం పెట్టుకుందన్న అనుమానం
- మహిళ సహా యువకుణ్ణి హతమార్చిన ప్రియుడు



హత్యకు గురైన వెలమల ఎర్రమ్మ, ముద్దాడ సంతోష్ (ఫైల్) | నిందితుడు రామారావు

సారవకోట: వరుసకు వదినయ్యే మహిళతో అవివాహిత యువకుడు వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆ మహిళ మరో యువకుడితో సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో ఆమెతోపాటు మరో యువకుణ్ణి కూడా దారుణంగా హతమార్చాడు. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం కోదడ్డపనస గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదడ్డపనస గ్రామానికి చెందిన వెలమల ఎర్రమ్మ (40) అనే మహిళకు అదే గ్రామానికి చెందిన భాస్కరరావుతో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు సంతానం. కాగా, వరుసకు మరిదయ్యే ముద్దాడ రామారావు (30) అనే అవివాహిత యువకుడు ఎర్రమ్మతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు.

### మరొకరితో చనువుగా ఉంటోందని..

ఇదిలావుండగా.. ఎర్రమ్మ అదే గ్రామానికి చెందిన ముద్దాడ సంతోష్ (26)తో కొంతకాలంగా చనువుగా ఉంటోంది. ఎర్రమ్మ తనతోపాటు సంతోష్‌తో కూడా అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో రామారావు రగిలిపోతున్న ముద్దాడ రామారావు వారిద్దరిపైనా కక్ష పెంచుకున్నాడు. మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలో ఉన్న వంశధార ఎడమ కాలువలో స్నానం చేస్తున్న సంతోష్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. అనంతరం అదే కత్తి తీసుకుని సమీపంలోని పొలంలో పనిచేస్తున్న ఎర్రమ్మపైనా దాడి చేశాడు. కత్తిపోట్లకు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## నిఘా నేత్రం... మీ ఇళ్లు భద్రం

**ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో నమోదు చేసుకుంటే చాలు..**
**చోరీలకు చెక్‌పెడుతూ సాంకేతిక కాపలా**
**పైసా ఖర్చు లేకుండా పోలీసుల ఉచిత సేవలు**

**వేసవి సెలవుల్లో కుటుంబంతో సరదాగా టూర్లకు ప్లాన్ చేస్తున్నారా .. రోజుల తరబడి ఇంట్లో ఎవరూ లేకపోతే దొంగల భయం మనల్ని వెంటాడుతుంది. అయితే ఇప్పుడు ఆ భయం అవసరం లేదంటున్నారు జిల్లా పోలీసులు.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు మీ ఇంటికి ప్రత్యేక కాపలా ఏర్పాటు చేస్తారు. మళ్ళీ మీరు తిరిగి వచ్చే వరకూ మీ ఇంటి తలుపు ముట్టుకుంటే చాలు పోలీస్ నిఘా కేంద్రంలో బెల్ మోగుతుంది. తక్షణం రంగంలోకి దిగి దొంగల భరతం పట్టేందుకు పోలీసులు సిద్ధంగా ఉంటారు. సెలవుల్లో ఇళ్లు భద్రంగా ఉంచేందుకు ఏకైక మార్గం.. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్). ఈ యాప్‌లో నమోదు చేసుకుని, ఊరు వెళ్ళే సమయంలో మీ ఇంటిని పోలీస్ నిఘా పరిధిలో ఉంచండి.** - ఏలూరు టౌన్



ఏలూరు జిల్లాలో చోరీ సంఘటనలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

### నిర్లక్ష్యంతో భారీ మూల్యం

రోజుల తరబడి ఇంటికి తాళాలు వేసి ఉండడం దొంగలకు అదనుగా మారుతుంది. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడే గ్యాంగ్‌లు ఎక్కువయ్యాయి. వేసవి వస్తే చాలు దొంగల బెడద మరింత పెరిగిపోతూ జనాల్ని నిద్రపోనివ్వడం లేదు. చోరీలకు చెక్ పెట్టాలంటే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ఆశ్రయించాలి. ఈ యాప్‌ను వినియోగిస్తే మీ ఇళ్లకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పోలీస్ గస్తీ ఉంటుంది.

**ఏలూరు జిల్లాలో ఎల్‌హెచ్‌ఎంఎస్ రిజిస్ట్రేషన్ – 36,259**
**ఊరు వెళుతూ వాచ్ రిక్వెస్ట్ పెట్టినవి – 891**
**ఏలూరు నగరంలో రిజిస్ట్రేషన్లు – 9 వేలు**

### జిల్లాలో ఎల్‌హెచ్‌ఎంఎస్

ఏలూరు జిల్లాలో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ అందుబాటులో ఉంది. ఐదేళ్ళ క్రితం ఏలూరు నగరంలో ఎల్‌హెచ్‌ఎంఎస్‌లో రిజిస్టర్ చేసుకున్న ఒక కుటుంబం ఊరు వెళ్ళగా దొంగలు ఇంట్లోకి చొరబడే ప్రయత్నం చేశారు. వెంటనే నిఘా కెమెరాలు పోలీసులను అప్రమత్తం చేయగా వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు దొంగలను పట్టుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇంతవరకూ 36,259 మంది యాప్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. వీరిలో 891మంది పోలీసులకు రిక్వెస్ట్ పెట్టుకోగా పోలీసులు సేవలు అందించారు.

### అంతా ఉచితమే

మీరు రూపాయి చెల్లించాల్సిన పనిలేదు. పైసా ఖర్చు లేకుండా ఇంటికి పోలీసులు నిఘా నేత్రాలను అమర్చి కాపలా పెడతారు. విద్యుత్ లేకున్నా కెమెరా, సెన్సార్ పరికరాలు పని చేస్తాయి. పోలీస్ కంట్రోల్‌రూమ్‌తో అనుసంధానం చేస్తారు. గుర్తు తెలియని వ్యక్తులు, దొంగలు ఇంట్లోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తే సెన్సార్ అలెర్ట్ చేయగా సీసీ కెమెరాలు ఫొటోలు తీయటంతోపాటు, మీ సెల్‌ఫోన్లలో ఇంటి వద్ద పరిస్థితులను ఆన్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఉంటుంది. దొంగలు ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నిస్తే వెంటనే సెన్సార్ ద్వారా పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు సమాచారం వెళుతుంది.

### యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి

గూగుల్ ప్లేస్టోర్‌లోకి వెళ్ళి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ యాప్‌లో ఫోన్ నెంబర్, ఇంటి చిరునామాను పొందుపరిచి రిజిస్టర్ చేసుకోవాలి. రిజిస్టర్ చేసుకున్న వ్యక్తికి ఒక ఐడీ కేటాయిస్తారు. మీరు ఊరు వెళ్ళాలి అనుకుంటే ఈ యాప్‌లోకి వెళ్ళి యూజర్ ఐడీని నమోదు చేసుకోవాలి. ఊరు వెళ్ళే రోజు, తిరిగి వచ్చే రోజును ఎంటర్ చేయాల్సి ఉంటుంది. రిక్వెస్ట్ పోలీస్ వాచ్ అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే చాలు... వెంటనే సమాచారం పోలీస్ కంట్రోల్‌రూమ్‌కు వెళ్ళటం ద్వారా మీ ఇంటి సమీపంలోని పోలీస్ సిబ్బంది మీకు పరికరాలను అమర్చి నిఘా నేత్రం పర్యవేక్షణలో ఉంచుతారు.

### చోరీలకు చెక్



వేసవి సెలవులకు సరదాగా విహార యాత్రలు, బంధువుల ఇళ్ళకు, ఇతర పనులపై ఊరు విడిచి బయట ప్రాంతాలకు వెళితే .. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను వినియోగించుకోవాలి. తాళాలు వేసిన మీ ఇంటిలోకి దొంగలు జొరబడి విలువైన బంగారు వస్తువులు, నగదును చోరీ చేయకుండా నిరోధించేందుకు అవకాశం ఉంది. మీ ఇంట్లో బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలి.

– డీ మేరీ ప్రశాంతి, ఏలూరు జిల్లా ఎస్పీ

### ప్రజల్లో అవగాహన రావాలి



ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి. చాలా కాలంగా ఈ సేవలను అందుబాటులో ఉంచినా చాలామందికి అవగాహన లేకపోవటంతో దొంగలకు అవకాశం ఇస్తున్నారు. నిఘా నేత్రాలు మీ ఇంటికి కాపలాగా ఉంటాయి. మీరు మీ సెల్‌ఫోన్లలోనూ చూసుకునే అవకాశం ఉంది.

– సీహెచ్ మురళీకృష్ణ, ఏలూరు సీసీఎస్ సీఐ



## పర్యాటకం.. ప్రగతి పథం

- రూ.1.50 కోట్లతో ప్రతిపాదిత పనులు
- రిసార్టులకు గోదావరి పరీవాహక ప్రాంతాల్లో స్థల సేకరణ
- రూ.30 లక్షలతో కొల్లేరు టూరిజం అభివృద్ధి
- పేరుపాలెం బీచ్‌లో అదనపు వసతుల కల్పన



రిసార్టుల స్థలాన్ని పరిశీలిస్తున్న పర్యాటక సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పర్యాటక రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రకృతి అందాలకు చిరునామాగా నిలిచే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులను శరవేగంగా చేపడుతోంది. వేసవి సెలవుల నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలను సందర్శించే యాత్రికుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా సందర్శనార్థం విచ్చేసే విద్యార్థులకు రాయితీలు కల్పిస్తున్నారు. పేరుపాలెం బీచ్‌లో రిసార్టులు నిర్మించడానికి ఈ ఏడాది మార్చిలో విశాఖలో జరిగిన జీ–20 అంతర్జాతీయ సదస్సులు రెండు ఎంఓయూలు జరిగాయి.

### అభివృద్ధి పనులు

రాష్ట్ర పర్యాటకశాఖ ఆధ్వర్యంలో యాత్రికులను ఆకర్షించడానికి పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. పాపికొండలు సమీప కొరుటూరు వద్ద రూ.45 లక్షలతో విశ్రాంతి గదులు, జల్లేరు జలాశయం వద్ద రూ.20 లక్షలతో రిసార్ట్‌లు, గుంటుపల్లి గుహల వద్ద రూ.25 లక్షలతో టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, అదనపు గదులు, పేరుపాలెం బీచ్ వద్ద రూ.30 లక్షలతో యాత్రికుల కోసం మరుగుదొడ్లు, సేద తీరే బెంచీల ఏర్పాటు శరవేగంగా జరుగుతోంది. ముఖ్యంగా కొల్లేరు పర్యావరణానికి రూ.30 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో కైకలూరు, ఏలూరు ప్రాంతాల్లోని ఆటపాక, మాధవాపురం పక్షుల ఆవాస కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలను కల్పించనున్నారు.


### యూత్ క్లబ్‌లకు రాయితీలు

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి పర్యాటక ప్రాంతాలను సందర్శించే యూత్‌క్లబ్‌కు రాయితీలను ఏపీటీడీసీ కల్పిస్తోంది. యువతీ, యువకులు 18 ఏళ్ల పైబడి దాదాపు 30 మంది క్లబ్‌గా ఏర్పడి విచ్చేసే వారు గదులు, సందర్శనలో రాయితీలు అందుకుంటారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో హరిత, కొరుటూరు, శివరన్, సన్‌రైజ్ రిసార్టులు, పేరుపాలెం, హంస బీచ్ రిసార్టులు అందుబాటులో ఉన్నాయి. గుంటుపల్లి గుహలతో పాటు ఆహ్లాదాన్ని పంచే గోదావరి విహారి సిద్ధంగా ఉంది. వీటితో పాటుగా ద్వారకాతిరుమల, భీమవరం సోమేశ్వరాలయం, మావుళ్లమ్మ ఆలయం, మద్ది అంజనేయస్వామి, క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాలను సందర్శించవచ్చు.

### గోదావరి చెంత విహార కేంద్రాలు

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం నూతన ప్రణాళికను రూపొందిస్తోంది. గోదావరి నది సమీప యలమలకుదురులంక, నరసాపురం, ఆచంట ప్రాంతాల్లో ఒక్కోచోట దాదాపు 10 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు ఆదేశాల అందాయి. గోదావరి చెంత పర్యాటకులు విహరించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే మొగల్తూరు హైవే సమీపంలోని మూడు ఎకరాల్లో రిసార్ట్‌లు, టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్లను నిర్మించనున్నారు.

### పర్యాటకులకు అన్ని వసతులు



యూత్ క్లబ్‌లకు పర్యాటక ప్రాంతాల్లో రాయితీలు కల్పిస్తున్నాం. ఇప్పటికే పేరుపాలెం బీచ్ వద్ద రూ.1.50 కోట్లతో పలు పనులు జరిగాయి. విశాఖలో జరిగిన జీ–20 అంతర్జాతీయ సదస్సులో రెండు ఎంఓయూలు పేరుపాలెంలో మరిన్ని రిసార్టుల నిర్మాణానికి ఒప్పందం చేసుకున్నాయి. పర్యాటకులకు అన్ని వసతులను కల్పిస్తున్నాం. త్వరలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో స్థలాలను సేకరించి రిసార్టులను ఏర్పాటు చేసే ప్రణాళికను రూపొందిస్తున్నారు.

–ఎండీహెచ్ మెహరాజ్, పర్యాటకశాఖ అధికారి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943